# కేయూరబాహుచరిత్ర

## మంచెనకవి ప్రణీతము

పరిష్కర్త :
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి
సంపాదకులు – పీఠికా రచయిత :
డా॥ శ్రీరంగాచార్య

ప్రచురణ
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2012

**KEYURABAAHU CHARITRA**
**by**
**Manchena Kavi.**

**T.T.D. Religious Publications Series No.**

**© All Rights Reserved**
**2012**

**Copies : 1000**

**Price.Rs.........**

**Published by**
**L.V.Subrahmanyam,I.A.S.,**
**Executive Officer,**
**Tirumala Tirupati Devasthanams,**
**Tirupati -517 501**

**D.T.P. SVPSVP, T.T.D. Tirupati.**

**Printed at**
**Tirumala Tirupati Devasthanams, Press.**
**Tirupati.**

ఓం నమో వేంకటేశాయ

## ముందుమాట

**ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.** -01-2012.
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1888 సం॥ ఫిబ్రవరి 7వ తేదీన కృష్ణాజిల్లా, దివి తాలూకాలోని పెదకళ్లేపల్లి గ్రామంలో సుందరశాస్త్రి, శేషమ్మగార్ల పుణ్యదంపతులకు జన్మించారు.

వీరు జగద్విఖ్యాత శతావధానులగు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి శిష్యరికంలో సంస్కృతాంధ్ర సాహిత్యముల యందు అపారమైన పాండిత్యాన్ని సంపాదించి సుప్రసిద్ధ పండితునిగా, కవిగా,గొప్పరచయితగా, పరిశోధకునిగా, బహుగ్రంథ పరిష్కర్తగా యావదాంధ్రదేశంలో ప్రసిద్ధిని పొంది, మాస్టర్ సి.వి.వి. గారి యోగసాధనలో సిద్ధులై వారి యోగవిద్యతో వ్యాధిగ్రస్తులైన వారినెందరినో రక్షించి వారికి ప్రాణభిక్షపెట్టిన మహనీయులు. మహాతపస్వి.

శ్రీశాస్త్రిగారు తొలుత మదరాసులో తెలుగు పండితునిగా కొంతకాలం పనిచేసి తరువాత తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము నందు గ్రంథపరిష్కర్తగా, తి.తి.దే ఓరియంటల్ కళాశాలలో ఆచార్యులుగా పనిచేసి ఎంతో మంది శిష్యులను పండితులనుగా తీర్చిదిద్ది వారికి జ్ఞానభిక్షను ప్రసాదించిన పరమగురువు.

ఇంతటి బహుముఖప్రజ్ఞాశాలియైన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి సాహిత్యకృషిని గుర్తించి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం 2007వ సం॥లో శ్వేతభవనంలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠాన్ని స్థాపించి వారు రచించిన ముద్రిత, అముద్రిత గ్రంథాలను తి.తి.దే ద్వారా ప్రచురించి సాహితీ లోకానికి అందజేయాలని శ్రీకారం చుట్టింది.

వీరి రచనలోని ''తెలుఁగుమెఱుగులు, మీగడ తరకలు, అన్నమాచార్యచరిత్ర పీఠిక, ప్రజ్ఞాప్రభాకరము-గురుపూజ, సింహావలోకనము, పూలవిందు మొదలగు ఎన్నో గ్రంథాలను శ్రీశాస్త్రిగారి వాఙ్మయపీఠం ద్వారా తి.తి.దేవస్థానం ప్రచురించింది.

ప్రస్తుతం ఫిబ్రవరి 7, 2012వ తేదీన శ్రీ ప్రభాకరశాస్త్రి గారి 124వ జయంతి సందర్భంగా మంచెన మహాకవిచే రచింపబడి, శ్రీశాస్త్రిగారిచే పరిష్కరింపబడిన కేయూరబాహు చరిత్ర అనే కథాకావ్యాన్ని శ్రీ ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా తి.తి.దేవస్థానం ప్రచురించింది.

ఆంధ్రవాఙ్మయము నందు ప్రసిద్ధి చెందిన ప్రాచీన పద్యకావ్యాలలో మంచెన రచించిన కేయూరబాహుచరిత్ర చక్కని కవితాశిల్పం కలిగిన కథాకావ్యం. ఈ కావ్యంలో నాలుగు ఆశ్వాసాలున్నవి. పంచతంత్రము,హితో పదేశము వంటి కథల వలె లోకానికి చక్కని నీతిని తెలియజెప్పటమే ఈ కావ్య ముఖ్యోద్దేశం. ఈ గ్రంథానికి సంపాదకత్వం వహించి విలువైన పీఠికను రచించిన డా॥ శ్రీరంగాచార్యులు గారికి అభినందనలు.

శ్రీశాస్త్రిగారి 124వ జయంతి సందర్భంగా ఆవిష్కరింప బడుతున్న ఈ గ్రంథం కేవలము సాహిత్యప్రియులకే కాక ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. కనుక ఈ గ్రంథాన్ని సహృదయ పాఠకులందరూ చదివి నైతిక విలువలతో ఆదర్శవంతులవుదురు గాక యని ఆశిస్తున్నాను.

**(ఎల్.వి. సుబ్రహ్మణ్యం)**

## సూర్యాలోకనం

**బాలరసాలపుష్పనవపల్లవకోమలకావ్యకన్యకన్**
**గూళలకిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్**
**హాలికులైననేమి మరియంతకు నాయతి లేనినాడు కౌ**
**ద్దాలికులైననేమి నిజదారసుతోదరపోషణార్థమై**
(కేయూర 1-13)

బమ్మెర పోతన రచనగా ఈ పద్యం చాలాప్రచారం చెందింది, కాని పోతనగారికి దాదాపు 150 లేదా 200 సంవత్సరాలకు ముందే తెలుగుసాహిత్యంలో ప్రసిద్ధకథాకావ్యంగా పేరుగాంచిన కేయూరబాహుచరిత్ర యందు మంచన మహాకవి దీన్ని రచించినాడు. (రెండు పద్యాలలో క్రీగీతభాగం మాత్రమే తేడా)

తెలుగు ప్రబంధాలలో చెప్పదగిన కేయూరబాహుచరిత్ర 4 ఆశ్వాసాలరసవత్కథాకావ్యం. నందూరి గుండమంత్రికి అంకితమీయబడింది. ఈ గ్రంథమునందు ఎక్కడకూడా కవి తనను గూర్చిగాని, తల్లిదండ్రులు నివాసము మొదలైనవానిని గూర్చిగాని ఏమాత్రం తెల్పుకోలేదు. **'ఇది సకలసుకవిజనవిధేయ మంచెనప్రణీతంబైన కేయూరబాహుచరిత్రంబునందు'**- అని ఆశ్వాసాంతాలలోను

**తన యిష్టసఖుని, విద్వ**
**జ్జనమాన్యుని, నుభయకావ్యసరణిజ్ఞుని మం**
**చననామధేయు, నన్నుం**
**గనుగొని యిట్లనియె వినయగౌరవమెసగన్**(1-7)

అని మాత్రమే తెల్పినాడు, తనసఖుని ఇష్టసఖుడు అన్నాడే గాని బంధువనలేదు. ఒకనాటి తిక్కన, జక్కన, గుండన, కొమ్మన యన్న విధంగానే మంచన కూడా ప్రసిద్ధనామమైనది.

**కృతిభర్త-** మంచెనకవి యీ గ్రంథమునందు కృతిపతియైన



నందూరిగుండమంత్రినిగూర్చి అతనిపూర్వులను గూర్చి చాలా విషయాలను చెప్పినాడు.

ముఖ్యంగా గుండమంత్రి, కళావిశారదుడు, ధార్మికుడు, కౌశికగోత్రభూసురశిఖామణి, కౌశికగోత్రగృహప్రదీపుడు, నిరంతర సరసకవితాగోష్ఠీప్రియుడు, ధీగుణచింతామణి, శాస్త్రపురాణాగమదుగ్ధాబ్ధి మందరాచలమతి, నీతివిద్యావిహారుడు, సదాచారుడు, ఆజన్మవదాన్యుడు, కళావిజ్ఞాత, సంగీతవిద్యాభిరతుడు, గణకశిఖరరత్నము, ఇంతేగాక సరసకవిత్వప్రసంగసంగతిగల సత్కవుల కావ్యశిల్పం తెలిసినవాడు. మధురకవికులుడు (1-17) విఖ్యాత కవిత్వసంపదగలవాడు (1-43) మృదుమధురకావ్యపరిణతుడు (3-342), సరససుకవిగోష్ఠీలాలసుడు (3-343). ఈవిధమైన సుగుణుని పొంది మదీయకవితపృథివియందు నెగడును (1-15) అని తెల్పిన విశేషణాలు పరిశీలిస్తే సాహిత్యసంబంధమైనవన్నీ తనకు ఇతరమైనవి గుండయమంత్రికి చెల్లుతాయనే భావన కావచ్చు, గుండన సకల భాషావేత్త, వదాన్యుడు, అగ్రహారముల నెలకొల్పినాడు. ఎందరో బ్రాహ్మణయువతీయువకులకు ఉపనయనములు, వివాహములు చేయించినవాడు, ప్రతి సంవత్సరం శ్రీకాకుళస్వామి తిరునాళ్లలో విశేషంగా ధనాన్ని వెదజల్లే వితరణశీలి."ఎలమంచిలాదిగా యెలమి ముప్పదిరెండు విష్ణుప్రతిష్ఠలు వెలయజేసినవాడు" (1-26) అని తెల్పటంవల్ల అప్పటికే శ్రీవైష్ణవం ఎంతవ్యాప్తిలోనున్నదనే విషయం తెలుస్తున్నది. దీనికి ఉదాహరణ వీరు భావనారాయణస్వామిభక్తులు. ఆస్వామిసన్నిధిని అభివృద్ధిపరచినవారు. అందుకే **భావనారాయణ దివ్యశ్రీపాదసరోజాతాశ్రయ నిజచిత్తషట్పదాన్వయుడు**గా (2-129) వర్ణింపబడినాడు. ఇది కేవలం తన కృతిభర్త విషయం.
**వంశవిషయం-** నందూరి గుండనమంత్రి అతనిపూర్వులు నేటి గుంటూరుజిల్లా తెనాలితాలూకాలోని **ధనదపురము,** రాజధానిగా వెలనాటి చోడులు పరిపాలించునప్పుడు వారివద్ద మంత్రులు సేనానులుగా వీరి పెద్దలున్నందున

గుండన కూడా అక్కడనే నివసించియుండును.

ఈ సనదప్రోలే చందవోలు, ధనదవోలు, ధనదపురము అని అప్పుడున్న చందవోలునే నాడు ధనదుపురమన్నాడు.

**చందవోలు** – తెలుగునాటప్రాచీనగ్రామాల్లో ఒకటి ఒద్దిరాజుపేరయ తన**'బ్రహ్మవిద్యావిలాసం'**లో చందవోలును తెల్పినాడు. పండితారాధ్యచరిత్రలో – **'సనదప్రోలనుమహాసద్భక్తగరిమ, ఎక్కడిసనదప్రోలెక్కడిసభలు** – అని సనదప్రోలును చెప్పినాడు. సింహాసనద్వాత్రింశిక ఆశ్వాసాంతగద్యల్లో సనదప్రోలున్నది. క్రీ.శ 1750 నుండి ఇది చందవోలైనది.

మంచెన తెల్పిన ప్రకారం– గుండన పూర్వుల గూర్చి వెలనాటివారిని గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం,

**1. నందూరిగోవిందమంత్రి–** ఇతడు వెలనాటిచోడమనుజేంద్రుడైన గొంక భూవిభుని ప్రగ్గడగా ప్రసిద్ధుడు,

**2. కొమ్మన–** గోవిందమంత్రి సుతుడైన యీయన గొంకవిభునికుమారుడైన రాజేంద్ర చోడునివద్దమంత్రి, మంచెన ఇతనిని గొప్పగా వర్ణించినాడు. గొప్పరాజువద్ద అమాత్యుడైనందున కొమ్మన అనేకాగ్రహారములను ఏర్పాటుచేయించి చెరువులత్రవ్వించినాడు. ముప్పదిరెండుస్థలాల్లో విష్ణుప్రతిష్ఠలు చేసినాడు. నిరంతరసహస్రబ్రాహ్మణ పంక్తిభోజనహస్తోదక ప్రదాన సంతృప్తుడు. వదాన్యత్వమేగాక గొప్పనటుడు, చోళరాజేంద్రుని ఆనతితో పాకనాడు ఇరువదియొక్కవేయిగ్రామాల జయించి పాలించినాడు. కర్ణాటకరాజైన సోమిదేవరాజు వెలనాటిపైన దండెత్తి రాగా కొమ్మనామాత్యుడు ఆ శత్రుసైన్యాలను ఎదుర్కొన్నాడు. అప్పుడు ఆయనకు చోడయ గొంకయ కోటనాయకులు తోడున్నారు. ఈయుద్ధం **క్రొచ్చెర్వుల**వద్ద జరిగింది. మంచెన దీనినే **క్రొత్తచెర్ల** అన్నాడు. (1–26) నేడిది ప్రకాశంజిల్లా దరిశితాలూకాలోని **కొచ్చెర్లకోట** గ్రామం. ఆనాడు దండెత్తి వచ్చిన కర్ణాటకరాజు అశ్వసైన్యమే దాదాపు 30 వేలట. ఇంత పెద్దసైన్యం అంతపెద్దయుద్ధం. దీనినే



**'సెలకట్టెవాటున'** (1–29) పద్యంలో వర్ణించినాడు. ఇక్కడొకవిశేషమేమనగా ఈయుద్ధమునందు గొంకయ క్షతగాత్రుడు కాగా అతనికి రాజు **నెత్తురుపట్టు** భూమిని ఇచ్చినాడట. అంటే యుద్ధంలో శౌర్యసాహసాలను ప్రదర్శించి క్షతాంకులైనవారికి రాజుయిచ్చేమాన్యంపేరు **నెత్తురుపట్టు.** గుంటూరుజిల్లా మోపర్రు గ్రామాన ఈనెత్తురు పట్టునిచ్చినాడు. కన్నడంలో దీన్ని **నెత్తురుకొడగె, రక్తకొడగె,** అంటారు. ఈపడవాలుగొంకనిశాసనంలో **నెత్తురుపట్టు నెత్తురువిద్ధ** అనివాడబడింది. (విజ్ఞానసర్వస్వం 3సం. తెలుగుసంస్కృతి 1959 ము.పు 226,227) ఇది ఆనాటిపరాక్రమ నిదర్శనం.

**కేతన–** కొమ్మనపుత్రుడైన ఈయన వెలనాటిచోడుల్లో ప్రసిద్ధుడగు పృథ్వీశమహారాజు మంత్రి. ఇతనికి కొమ్మన, మల్లశౌరి, భీమన అని పుత్రత్రయం – వీరిలో–

**భీమన–**మహావీరుడు. గుండదండాధీశునిపుత్రి పోలమాంబను వివాహమాడినాడు. వీరికి కేతనదండనాథ కేతనమంత్రి, గుండయ అనిముగ్గురు కుమారులు. వీరిలో కేతనదండనాథుడు మహాదాత. కేతనమంత్రి రసికుడు కవి. గణకవిద్యలో నిష్ణాతుడు. ఈయన ముగ్గురు పుత్రులలో కనిష్ఠుడు గుండయామాత్యుడు– ఈయనే కేయూరబాహుచరిత్ర కృతిపతి – ధనదపురాధిపతి,

**మంచనకాలం– నాటి రాజులు**

నందూరి గుండనపూర్వులగు గోవిందన కొమ్మన కేతనాదులు వెలనాటిచోళుల కడమంత్రులుగానున్నారు కావున వీరిననుసరించి మంచెనకాలం తెలుసుకోవచ్చు నందూరివారి మూలపురుషుడైన గోవిందన గొంకమహారాజువద్ద ప్రధాని, సేనానాయకుడు. నందూరి కొమ్మనశాసనాలు వెలనాటిచోడుల శాసనాలు కొన్ని ప్రకటితాలైనాయి. ఈగొంకరాజు ఇతని పూర్వులు దుర్జయనామాంతరులైన వెలనాటి చోడులే గొంకరాజులుగా ప్రసిద్ధులు. గొంకరాజుకూతురే పల్నాటియుద్ధం అనుంగురాజు మూడవభార్య

మైలమదేవి, ఇట్లా వీరు అల్లుకున్నారు. తెలుగుచోడుల్లోని శాఖలవారు కరికాలవంశీయులమని, క్షత్రియులమని అంటారు కాని వెలనాటిచోడులుమాత్రం రాజ-వర్మ శబ్దాలను తగిలించుకున్నా చతుర్థ కులజులమని దుర్జయవంశంవాళ్లమని స్పష్టంగా తెలిపినారు. అయితే తెలుగు చోళుల వంశాలవారు పాలించిన ప్రాంతాలబట్టి వారికాపేరు వచ్చింది. (ఉదా- వెలనాటి - పొత్తపి. కమ్మనాటిచోళులు) ఇట్లా వెలనాటివారిలో మొదటిగొంకరాజు ప్రసిద్ధుడు. రాజరాజనరేంద్రుని పుత్రుడైన కులోత్తుంగ చోడునికి సేనాధిపతియై వెలనాటిపైన అధికారాన్ని సంపాదించినాడు. గొంకరాజు (సుమారు 1076–1108 క్రీ.శ. నడుమ పరిపాలించియుంటాడు.) తన ప్రభుభక్తికి నిదర్శనంగా కుమారునికి కులోత్తుంగ వెలనాటిచోడుడని పేరుపెట్టినాడు. వేంగిరాజులకు వీరు నమ్మినబంటులు తరువాత- ద్వితీయ కులోత్తుంగవెలనాటిచోడమహారాజు, రెండవగొంకరాజు కేయూరబాహుచరిత్ర కృతిపతివంశ మూల పురుషుడగు గోవిందమంత్రి, ఈయనవద్ద ప్రెగ్గడగా సంధివిగ్రహిగానున్నాడు. ఇతని పుత్రుడు కొమ్మనకూడా తండ్రికి చాలా తోడ్పడ్డాడు.

**4 రెండవవెలనాటి చోడుడు** (1163–82) ఈయనకే కులోత్తుంగ రాజేంద్రచోడుడని నామాంతరం. కొమ్మన ఇతని మంత్రి 1170 ప్రాంతంలో కలిచురి బిజ్జలుడు పాకనాటిపై దండెత్తిరాగా అతనిని క్రొత్తచెర్లవద్ద కొమ్మనయే ఓడించినాడు. ఈ రెండవ వెలనాటిచోడుని కాలంలోనే సుప్రసిద్ధుడైన మల్లికార్జునపండితుడు చందవోలుకు వచ్చినాడు. వీరుడు, భక్తుడైన కొమ్మన గుంటూరుజిల్లాలోని బాపట్ల యందలి భావనారాయణస్వామివారి దేవాలయంలో రెండు తెలుగు పద్యశాసనాలను వేయించినాడు. (క్రీ.శ.1160నాటివి) ఈ శాసనాలవలన వీరి మూలపురుషుడు కొమ్మన ఇతని పుత్రుడు. గోవిందమంత్రి ఆయన కుమారుడు కొమ్మనయని తెలుస్తున్నది. తరువాత వచ్చిన మూడవ గొంకరాజు అసమర్థుడైనందున రాజ్యం అల్లకల్లోలం



అయ్యింది. ఇతని పుత్రుడు పృథ్వీశ్వరుడు రాజ్యవైభవాన్ని పునఃప్రతిష్ఠించినా అది నిలువలేదు. అందుకే మూడవగొంకరాజు గూర్చి మంచెన ఏమీ చెప్పలేదు. పృథ్వీశమహారాజువద్ద (1186–1206) నండూరి కొమ్మన పుత్రుడు కేతన మంత్రిగానున్నాడు. పృథ్వీశుని చివరిశాసనం శ్రీకూర్మంలో కలదు. ఈపృథ్వీశమహారాజు మస్తకంతో తిక్కచోడమహారాజు కందుకకేళి సల్పినట్లు తిక్కన నిర్వచనోత్తరరామాయణంలో తెల్పినాడు. పృథ్వీశుడు క్రీ.శ. 1206లో అస్తమిస్తే మండలేశ్వరుల కలహాలతో రాజ్యం అల్లకల్లోలం అయ్యింది. ఈ సమయంలోనే కాకతి గణపతిదేవుడు 1225–1249 మధ్య పూర్వాంధ్రం మీద దండెత్తి మాండలికులను సామంతులచేసినాడు. పృథ్వీశసంతతి కాకతీయులకు లోబడినా ఎదిరిస్తుండేది. అందుకే కేయూరబాహుచరిత్ర కృతిపతి పూర్వుల సాచివ్యం వెలనాటి పృథ్వీశ్వరునితోనే అంతరించినట్లు తెలుస్తున్నది. ఈ పృథ్వీశ్వరుని మంత్రియైన కేతనామాత్యుని మనుమడే కేయూర బాహుచరిత్ర కృతిభర్త గుండయామాత్యుడు. వెలనాటిచోడుల ప్రతిభ అంతరించినా గుండయ వరకు నండూరివారి వైభవం మాత్రం తగ్గలేదు. ఈ గుండయసోదరుల్లోని కేతన విఖ్యాతకవిత్వసంపద పొగడ్తకు ఎక్కినవాడు. (కువలయాశ్వచరిత్ర కర్తయైన కేతన ఇతడే యని కొందరి భావన.)

ఇక మంచన కవిస్తుతుల్లో నన్నయ, తిక్కనలనే స్తుతించినాడు. తిక్కననాటికి మంచెన వయస్సున చిన్నవాడు కావచ్చు. దీనివలన మంచనకాలం 1300 ప్రాంతం అని భావింప వీలు కలదు.

## కేయూరబాహుచరిత్ర

నాల్గాశ్వాసములు, 785 గద్య పద్యములు గల రసవత్ చిత్రకథాకృతి. మంచెన దీనిని రచించుట యందు మిక్కిలి శ్రద్ధ కనబరచి తనవరకెవ్వరు తెలుపని పద్ధతిని ప్రవేశపెట్టినాడు. గతానుగతికమైన ఏవేవో కథలకన్న నీతి, విద్య, విజ్ఞాన విషయబోధకాలైన పంచతంత్రకథలను గ్రహించి సందర్భోచితంగా వానిని ప్రబంధకథలో విలీనంచేసినాడు. కృతిభర్తయైన

గుండన **నాకు నొక్క కృతి గైకొన నిష్టము. నీవు ప్రాజ్ఞసంభావిత కావ్యదక్షుదవని** (1-10) పలికి ఆ రచన **కర్ణసౌఖ్యావహమై ప్రబంధ రచనాశ్రయమయ్యెడు మార్గము.** నందు (1-11) **స్థాయిరసము శృంగారము**గల (1-12) చక్కని ప్రబంధాన్ని రచించవలసిందిగా మంచెనను కోరినాడు. కాబట్టి కవి బాగా ఆలోచించి రాజులేగాక తదాశ్రితులైనవారు కూడా చదివి విని ఆనందించునట్లు **'పదినీతులు'** చెప్పదలచినాడు. అందుకే తనమొత్తం రచనలో పంచతంత్ర కథలతో సుమారు 470 గద్య, పద్యాలలో 22 కథలను చెప్పి మిగిలిన 317 పద్యాలలో అసలు కథను తెల్పినాడు. వీటిలో అవతారికకు 50 పద్యాలు కలవు. ఇట్లా అన్నీ తీసివేస్తే నికరంగా కథకొరకు వినియోగించిన 235 గద్య పద్యాలు ఇంతచిన్న కథాభాగంలోనే మంచెన తన ప్రతిభను నిరూపించినాడు. మనం ఇక్కడొక విషయం గమనించవలసియున్నది. విష్ణుశర్మ పంచతంత్రకథలు జగత్ప్రసిద్ధాలు. మూఢులు, విద్యావిహీనులైన రాజకుమారులను విద్యావంతులుగా చేయునిమిత్తం చెప్పిన ఈ కథలన్నిటిలోను పశుపక్ష్యాదులనే ముఖ్యపాత్రలుగా చేసి ఓ రాజకుమారులారా మనుష్యులకన్న పశుపక్షులే ఎంత గొప్పనైనవో తెలుసుకోండి. వాటిని చూచైనా మీరు బాగుపడండి అని గొప్పనైన హితోపదేశం చేసిన విష్ణుశర్మ కథాకల్పనాశక్తి ఆనాడే వయోజనవిద్యావ్యాప్తికి దోహదం చేసిన విషయాన్ని గమనించిన మంచెన తన యిష్టసఖునకు కర్ణసౌఖ్యావహముగా నుండునట్లు కేయూరబాహుచరిత్రను సిద్ధంచేసినాడు. మంచెన నాటికి ప్రబంధపద్ధతి అంతవ్యాప్తిలో లేనందున కృత్యాదివిషయాలు షష్ఠ్యంతాలు మొదలైన వానిని ఎక్కువగా చెప్పలేదు, నన్నెచోడుని కుమారసంభవం అప్పటికే వ్యాప్తిలోనున్నదేమో! అయినా దానిలోని వర్ణన పద్ధతులను ఈయన గ్రహించినట్లులేదు. మంచెన ఉద్దేశ్యంలో తన రచన సాహిత్యానికేగాక చారిత్రకంగాను నిలదొక్కుకొని ఆంధ్రదేశసాంఘికచరిత్రకు పయోగపడవలెనని భావించినాడు. అందుకే వెలనాటిచోడుల రాజ్యవైభవం వారి చరిత్రలను



కృష్ణా, గుంటూరుజిల్లాల్లోని సనదవోలు, శ్రీకాకుళం దేవాలయాలను, బాపట్ల భావనారాయణస్వామి దేవాలయ విషయాలను తెల్పటంవల్ల మన చరిత్ర పరిశోధకులు దీనినుంచి చాలా విషయాలను గ్రహించినారు. కేయూరబాహుచరిత్ర కథాసాహితి ముఖ్యరచన. మన తెలుగుసాహిత్యంలో కథాసాహిత్యం ఒక ప్రత్యేకవిభాగం, ప్రాచీనకాలంనుండి నేటివరకు పద్యమయంగానే యున్న దీన్ని తెలుగుకవులు రాజకథలను తత్సంబంధ నీతికథలను కావ్యంగా రచించి వాటిపేరులో చరిత్ర చేర్చినారు. ఆపద్ధతిలో వచ్చిన ప్రాచీనరచనల్లో **పండితారాధ్యచరిత్ర, విక్రమార్కచరిత్ర, దశకుమారచరిత్ర** ఈ **కేయూరబాహుచరిత్ర** లున్నవి. (మనుచరిత్రాదులు తరువాత కాలానికి చెందినవి) మనకు మొట్టమొదటి కథాసాహితీరచన కేతన దశకుమారచరిత్ర, ద్వితీయమైనా అద్వితీయమైన రచన - కేయూరబాహుచరిత్ర. ఇది ఏకైక రాజనాయకత్వ శృంగార రస ప్రాధాన్యంవల్ల ప్రబంధలక్షణవిలసితం. మంచెన సంస్కృతనాటికను పద్యానుకృతిగా చెప్పినా ఎన్నో నీతికథలను చేర్చినాడు. ఈపద్ధతి రచనల్లో ఇదే మొదటిది. దీనిలోని కథలన్నీ ప్రత్యేకంగా చేర్చబడి నీతిప్రాధాన్యాన్ని వివరిస్తున్నాయి. తరువాతి కాలంలో సంస్కృత రచనలను అనువదించిన వారెవ్వరు కూడా ఈ పద్ధతిని పాటించలేదు. మంచెన దీనియందు సప్తసంతానప్రశస్తి, షష్ఠ్యంత సంప్రదాయం. ఆశ్వాసాంతంలో విభక్త్యంత రచనా సంప్రదాయాన్ని పాటించి అనంతర రచనల కొక పద్ధతిని చూపినాడు. తనది చిన్నప్రబంధమైనా విషయ వివరణ ఎంతో విశేషమైనది,

**దీనికి మూలం-** కేయూరబాహుచరిత్రకథకు సంస్కృతకవి రాజశేఖరుని **'విద్ధశాల భంజిక'** అనే సట్టకభేదనాటకం మూలమని పరిశోధకుల భావన. కవి యెచ్చటకూడా దీని మూలరచనను తెలుపలేదు. కృతిభర్తకూడా **కేయూరబాహుచరితము చేయుము నీవందు కావ్యశిల్పముమెరయన్** (1-12) అనే కోరినాడు.

రాజశేఖరకవి దాదాపు 900 ప్రాంతంలో కాన్యకుబ్జపరిపాలకుడైన మహేంద్రపాలుని గురువు. సంస్కృతసాహిత్యంలో ఈయన ప్రఖ్యాతుడు. **యశస్తిలకచంపువు** రాజశేఖరుని ప్రశంసించింది. **సూక్తిముక్తావళి సదుక్తి కర్ణామృతము**లయందు ఈయన శ్లోకాలు గ్రహింపబడినవి. రాజశేఖరుని రచనల్లో విద్ధశాల భంజికయేగాక **బాలరామాయణం, బాలభారతం, కర్పూరమంజరి, కావ్యమీమాంస** (1 అధికరణం) అనేవి లభించినవి. ఇవియేగాక రాజశేఖరుడు **హరవిజయ, భువనకోశము**లను రచించినట్లు సాహిత్యచరిత్రకారులు తెలుపుచున్నారు. రాజశేఖరుని నాటికలలో మొదటిదైన విద్ధశాల భంజిక మామూలు నాటికయేయైనా మంచెన దీనినుండి కొంత ఇతివృత్తాన్ని గ్రహించి యథేచ్ఛగా మార్చి కృతినిర్మాణ మొనర్చినాడు. తన రచనకాధారముగా గ్రహించిన విద్ధశాలభంజిక నాలుగు అంకాల రచనయై నందున కేయూరబాహుచరిత్ర కూడా నాల్గాశ్వాసాల పరిమితిగా రచితమైంది.

**నాటికయందలి కథ–** విద్యాధరమల్లుడనే రాజు ఉజ్జయిని రాజధానిగా త్రిలింగరాజ్యాన్ని పాలిస్తున్నాడు, ఈయన భార్యపేరు మదనవతి వీరికి చారాయణుడు విదూషకుడు. భాగురాయణుడు మంత్రి. రాణిగారి మేనమామైన చంద్రవర్మ లాటదేశాధిపతి. ఈయనకు పురుషసంతతి లేనందున కూతురైన మృగాంకావళిని మృగాంకవర్మ నామధేయంతో పెంచి రాణికడయుంచును. కొంతకాలానికి కుంతలదేశరాజైన చండమహాసేనుడు రాజ్యభ్రష్టుడై తనపుత్రియైన కువలయమాలను మదనవతి రక్షణలోనుంచి పోవును. పురుషరూపంలోనున్న తన మృగాంకావళికి కువలయమాలనిచ్చి వివాహం చేయవలెనని దలంచిన రాణి విదూషకుని పరిహసించుటకై తన చేటునకు స్త్రీవేషంవేసి వివాహం జరిపిస్తుంది. ఈ మధ్య మంత్రియైన భాగురాయణుడు మృగాంకావళిని చేబట్టినవాడు సార్వభౌముడు కాగలడను రహస్యంతెలిసి ఆమె చెలికత్తెను లోబరుచుకుంటాడు. తరువాత తాను రహస్యంగా నిర్మాణంచేయించిన సుషిరస్తంభమార్గంద్వారా రాజశయ్యాగారానికి



మృగాంకావళి వచ్చేటట్టుచేసి ఆమెచేత రాజుకంఠానికి ముక్తాహారం వేయిస్తాడు. ఈ విచిత్రసన్నివేశాన్ని రాజు ఒక స్వప్నంగా భావిస్తాడు కాని తనకంఠంలో హారం ఉంటుంది. విదూషకుని తోడ్పాటున వనవిహారానికి వెళ్లిన రాజు అక్కడ ఆమెను (కువలయమాలను) ప్రత్యక్షంగా చూస్తాడు అప్పుడే రాణి వచ్చుచున్న జాడతెలిసి ఇద్దరు భీతిల్లుతారు. ఈ మధ్యనే చారాయణుడొక ఉపాయంచేసి రాణిదాసియైన మేఖలను భయపెడుతాడు, దీనితో రాణి క్రుద్ధురాలై తానే మహారాజును మోసగింప ప్రయత్నిస్తుంది. మృగాంకవర్మ పురుషుడనుకొని ఆయనకు స్త్రీవేషంవేసి భర్తకు పెండ్లిచేసి ఆవినోదాన్ని చూడవలెననుకొని తానే చివరకు మోసపోతుంది. ఇంతలోనే చంద్రవర్మకు పుత్రోదయమైనట్లు దూతద్వారా రాణికి తెలియజేస్తారు. ఆమె తాను పెంచిన కువలయమాలను కూడా తనభర్తకు పెండ్లిచేయిస్తుంది. భాగురాయణుని మంత్రాంగంవల్ల విద్యాధరమల్లుని సైన్యం సర్వదిక్కులయందలి రాజులనోడించగా కుంతలాన్ని ఆక్రమించిన వీరపాలుడు వీరికి సామంతుడగును. రాజు చక్రవర్తియగును.

ఇది సంక్షేపంగా విద్ధశాలభంజిక విషయం. ఈకథలో బిగువులేదు. సహజత్వం లోపించింది. రాణికి కూడా తెలియకుండా మృగాంకావళి వివాహ వయస్కయగువరకు పురుషునిగా పెరుగుట నమ్మదగినట్లులేదు. చేటీవిదూషకుల వివాహం, దాసిని భయపెట్టడం అనేవి బాగాలేవు. మొత్తంపైన దీనినుండి ఏదో ఒక విచిత్ర సన్నివేశాన్ని గ్రహించిన మంచెన నాటికపేరెత్తలేదు. మూలం ఫలాన అనలేదు.

**మంచెన మార్పులు–** ఈ కథను మంచెన సందర్భోచితంగా మార్పులనుచేసి వానికి నీతికథలను జోడించి పాత్రలపేర్లను దేశ రాజధానులపేర్లను కూడా తనకు నచ్చినట్లు మార్చుకున్నాడు. అట్టిమార్పులు కొన్ని.

1 కేయూరబాహుచరిత్ర కథానాయకుడు కళింగదేశంలోని త్రిపురీనగరపాలకుడైన కేయూరబాహుమహారాజు. భార్యపేరు రత్నసుందరి,

ఈరాణికి పినతల్లి భర్తయైన చంద్రవర్మలాటదేశాధిపతి, మూలంలోని విద్యాధరమల్లుడు– దీనిలో కేయూరబాహువు.

2. చారాయణుడే దీనిలో విదూషకుడు. రాణిదాసియైన మేఖలను పరిహసింపదలచి ఒకదాసికి పురుషవేషంవేసి పెండ్లిచేయిస్తాడు. దీనికి ప్రతీకారంగా భాగురాయణుడను మంత్రిచే ప్రేరేపించబడి రాణి మృంగాకవర్మకు స్త్రీవేషం వేయించి మహారాజునకిచ్చి వివాహంచేయించి తానే మోసపోతుంది. ఈ రహస్యం తెలిసిన మంత్రి మృగాంకవర్మను రప్పించుకొని తనరక్షణలో వుంచుకుంటాడు. ఈవ్యవహారమంతా తనచే నియుక్తురాలైన మృగాంకావళి దాసి కళావతి నడుపుతుంది.

3. దీనిలో విదూషకుని ద్వితీయపరిణయం, మేఖలకు అవమానం, కుంతలరాజపుత్రి కువలయమాలావృత్తాంతం. ఆమెతోనే రాజునకు మరొక వివాహం తీసివేయబడినవి. నాటికలోని కొన్నిపాత్రలు కూడా దీనిలో లేవు. ఈ విధమైనమార్పులతో మంచెన రచించినా చెప్పుకోదగిన కథగామాత్రంలేదు. అందుకే పంచతంత్ర కథలను అతికించి వీటికి చదివే శక్తిని కలిగించినాడు. ఒక విధంగా యిది కల్పిత, ఉత్పాద్య మిశ్ర కథాయుక్తపద్యరూపమైన నవల –గ్రంథనాయకనామ ప్రబంధము, దీనియందు పురుషపాత్రలు7, స్త్రీపాత్రలు 8, వేరేగాక పంచతంత్రకథల్లోని పాత్రలు వున్నాయి.

మూలానికి దీనికి కొన్ని భేదాలు కలవు. ఉపాఖ్యానాలు అధికంగా చేర్చబడటం కృతిభర్త కోరిక కావచ్చు. విదూషకుని ద్వితీయవివాహం తీసివేయటానికి కారణం తెలియదు. మూలంలోని పాత్రలు వారిబాంధవ్యం దేశం రాజధానులు మార్చబడినవి. మూలంలో చంద్రవర్మ త్రిలింగదేశ ప్రభువు, దీనిని మంచెన కళింగాధిపతి చేసినాడు. మూలకథలోని చంద్రవర్మలాటదేశాధిపతి యని **లాటేంద్రశ్చంద్రవర్మా నరపతితిలకః కల్పితా తేన పుత్రీ ...** అని స్పష్టంగాకలదు. ఐతే విద్ధశాలభంజికలోని **'త్రిలింగ'** పదం ప్రాచీనమైనా అంతకుముందే కొన్ని పురాణాలలోను, తంత్రగ్రంథాల్లోను



**'త్రిలింగదేశం'** పేర్కొనబడింది. (చూ–కేయూరబాహుచరిత్రపీఠిక గడియారం–15పు) మంచెన పంచతంత్రంనుండి గ్రహించి సందర్భోచితంగా చెప్పిన 22 కథలు బాగా ప్రచారంలో వున్నాయి. వీటినే ఆయా సన్నివేశాలలో **ఉద్ధవచాణక్యయుగంధరాదినయవిద్యాకోవిదధ్యాని** యైనాడు(1–3). కృతిభర్తయగుమంత్రిగూడా **చిత్రకథాశ్రవణలాలసుడు.** అందువలననే దీనియందు నీతిలేని కథ లేదు. ప్రధానకథలో కూడా నీతిని చెప్పి చివర సప్తవ్యసనాలచే నశించిన వారిని పేర్కొని (4–209) వీటితోపాటు రాజనీతిని సంక్షేపంగా ప్రవచించినాడు (4–205,208,210) అందుకే మంచెన తెనుగునందు నీతికావ్యరచయితలలోను, స్వతంత్రకథాకావ్యరచయితలలోను ప్రథమతః గణనీయుడు, ఇతని తర్వాతనే బద్దెన **నీతిశాస్త్రముక్తావళి,** ప్రతాపరుద్రుని **నీతిసారం** వచ్చినవి. కథనే ప్రధానంగా పెంచి కవితాసామర్థ్యమును చూపుటకన్న నీతికథలను ఒకహారముగా ప్రధానకథకు బలం కల్గించే విధంగా రచించటం మంచెన నియమం.

కేయూరబాహుచరిత్రమునందు పంచతంత్రకథలను సమయోచితంగా పెంచినాడు. దానికి రెండుదాహరణములు –

**కర్తవ్యస్సంచయో నిత్యం కర్తవ్యో నాతిసంచయః**
**పశ్య సంశయశీలోసౌ ధనుషా జంబుకో హతః (మిత్రలాభః 175శ్లో॥)**

దీనికి

**తగుకొలది గాని లోభము**
**మిగులగ చేయంగరాదు మిక్కిలియగు లో**
**భగుణంబుకతనగాదే**
**మృగధూర్తుండొకడు తొల్లి మృత్యువు జెందెన్ (3–139)**

మూలంలోని **అతిసంచయం** తెలుగులో **అతిలోభమైనది** – అట్లే

**విద్వానేవోపదేష్టవ్యో నావిద్వాంస్తుకదాచన**
**వానరానుపదిశ్యాధః స్థానభ్రష్టా యయుః ఖగాః (విగ్రహః శ్లో–5)**

**అపగతవివేకులకు హిత**

**ముపదేశించుటయు వారినొందుటయును నీ**

**తిపరులకొప్పదు - విహగము**

**కపిసహవాసమునబడినకాడియవచ్చున్. 3-261**

**'వృద్ధస్య తరుణీ విషమ్'** అనేదాన్ని **'వృద్ధుడు తరుణికి నసహ్యావిషమూహింపన్'** 3-22

**వివాహశ్చ వివాదశ్చ సమయోరేవ శోభతే** - అనేది

**వియ్యమందబోక కయ్యమొనర్చుట**

**చెలిమిసేత తమకు దలముగాని**

**వారితోడదగదు చేర ..........** 4-120

ఈ విధంగానే ఎన్నో శ్లోకాలను ఆయాసందర్భాలలో అనువదించి అతికించి ఔచిత్యము పాటించినాడు. విద్ధశాలభంజిక నుండి ఇతివృత్తాన్ని మాత్రమేగాక కొన్నిపదాలను భావాలను కూడా చక్కగా గ్రహించి వీనితోపాటు కొన్ని శ్లోకాలను తెనిగించుకున్నాడు,

**జానే స్వప్నవిధౌ మమాద్య చులుకోత్సేక్యం పురస్తాదభూత్**

**ప్రత్యూషే పరివేషమండలమివ జ్యోత్స్నాసపత్నం మహః**

**తస్యాంతర్నఖనిస్తుషీకృత శరచ్చంద్రప్రభైరంగకైః**

**దృష్టా కాప్యబలా బలాత్కృతవతీ సా మాన్మథం మాన్మథం**

**(విద్ధ1-15)**

దీనికి

**ప్రకటితదేహదీప్తులు ............** 4-12 అనేది అనువాదం. దీనిలో **నఖనిస్తుషీకృతశరచ్చంద్ర ప్రభైరంగకైః** అనేదానిని 'ప్రకటిత దేహదీప్తులు' అని **పరివేషమండలమివ జ్యోత్స్నాం సపత్నం మహః తస్యాంతం** అనేదాన్ని **వెల్గుచుండు పరివేషములోపలనొప్పు చంద్రరేఖకు సరియైన** అని మార్చినాడు.



**హారోయం కేవలస్త్రీ విలసితశుచిభిః పంక్తిబి ర్మౌక్తికానాం**

**సద్యఃషాణ్మాసికానాం మమ మదిరదృశా దత్తచంద్రోదయశ్రీః**

**సోత్కంఠం కంఠదేశాజ్ఝటితి కుచతటాత్ ఓం నమో మన్మథాయే**

**త్యస్తోయన్మధ్యరత్నం ఘరయతి కకుభః కౌంకుమాభిః ప్రభాభిః**

(1-17)

దీనిని-

**అసదృశతారమౌక్తిక .........**4-16 అని అనువదించటంలో స్వాతంత్ర్యం వహించినా మూలంలోని **మదిరదృశ**యైననాయిక తెలుగులో **బిసరుహహస్త యైనది** ఇట్లే మరికొన్ని మార్పులున్నవి.

**స్వప్నః కిమేష కిము సంవిదియం చ సాక్షాత్ ........** (1-21) దీనిని **కలయగునొక్కొ యొండెకలగాదిది నిక్కమయొక్కొనిక్కము ...** 4-41 అని సుందరముగా అనువదించినాడు. ఔచిత్యవిచారచర్చయందు క్షేమేంద్రుడు రాజశేఖరకవిరచనగా నిచ్చిన **'కర్ణాటీదశనాంకితః శితమహారాష్ట్రీకటాక్షాహతః ......** అనే అందమైన శ్లోకాన్ని సహజప్రౌఢిమతో **-గౌళీనిర్జరరాజనందనుని ....** 1-82 అని అనుకరించినాడు.

నన్నెచోడుడు మంచెనను అనుకరించెనా లేక మంచెనయే నన్నెచోడుని అనుకరించినా అనేది నిశ్చప్రచంగాని విషయం కుమారసంభవం (8-116) లో **దుగ్ధాంబునిధినిట్టు దోచెనో యని శేషు**

**పాన్పుగా హరి నీట పవ్వడింప .........**

ఇత్యాదిపద్యం

**అంజనగిరి తనయద్రిబోలుదు నీల**

**కంకుండు తోరణ కట్టబనుప ..........** అని 4-158

అనుకరించినాడు.

ఇక- మంచెన తరువాత వచ్చిన కవులు. ఇతనిని అనుకరించినట్లు గమనింపవీలున్నది.

కేయూరబాహుచరిత్రలోని -

**కరిముఖుడశ్విసుల్**-1-3 **రూపమొక్కటి ..** విక్రమార్కచరిత్ర 2-192

**వననిధితటాక** 1-9 **తరుతటాకాది** .... .. వసు 1-18

**తన కృపాజలధి** 1-63 **తన యశోవిశద ......** వసు 1-116

**చుక్కలరాణి** 4-155 **చుక్కలరాణి** .... పారిజాత 5-10

**ఎవ్వరిదానవీవు హరిణేక్షణ** 4-21 **ఎవ్వతెవీవు ..** మను .2-39

**ఇట్లే** మరికొన్ని బింబప్రతిబింబపద్యాలున్నవి-

**మంచెనకవిత్వం-** సరసము, సలక్షణము- రసికజన హృదయంగమమైన యితని కవితయందు రచనాప్రౌఢిమ, భావసంపద, ధారాశుద్ధి, గణనీయము. కథాకథనపద్ధతిని సరళముగాచెప్పి తన కావ్యమును కర్ణసౌఖ్యావహమైన ప్రబంధరచనాశ్రయమార్గములో (1-11) నడిపినాడు.

కేయూరబాహుచరిత్ర ప్రారంభం **'ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశో వాపి తన్ముఖం'** అనే ఆలంకారికోక్తి ప్రకారం శ్రీకారంతో ఆరంభించి ఆశీస్సును తెల్పినాడు. ద్వితీయపద్యంలో ఇష్టదేవతలను, మూడవపద్యంలో సంస్కృతాంధ్రకవులు, తనది నీతికథారచన కావున నయవిద్యాకోవిదులైన ఉద్ధవచాణక్యయుగంధరాదుల స్మరించటం, సప్తసంతానాల్లోఖిలము గానట్టి కృతిప్రశంస, కృతిపతి అభ్యర్థన - వీని తర్వాత గుండయాదుల వంశవర్ణన ఒక్కపద్యంలో (47) షష్ఠ్యంతాలు, వీనితర్వాత **'అభ్యుదయ'**పదం లేకుండా **'ఇష్టార్థసిద్ధి' 'ఐశ్వర్యసమృద్ధి' 'పుత్రపౌత్రాభివృద్ధి'**గా కృతిని రచియించటం. మంచన కవిత మృదుమధురమై కొన్నిచోట్ల చక్కని సమాసములు కూర్పుకలిగియున్నది,

ప్రాగ్దిక్పశ్చిమదక్షిణోత్తరదిశాభాగప్రసిద్ధక్షమా
భుగ్దర్పాంతకుడేలె గొంకవిభు డీ భూచక్రమక్రూరతన్
వాగ్దేవీస్తనహారనిర్మల యశోవాల్లభ్య సంసిద్ధితో
దిగ్దంతి శ్రవణానిలజ్వలదటత్తీవ్ర ప్రతాపాఢ్యుడై- 1-22



అలంకారశాస్త్ర ప్రియుడైన మంచెన రసం విషంలో - తన అభిప్రాయాన్ని-

ఏ రసమునకెవ్వడు ప్రియు
డారసమునయందు జొచ్చి యభినవరుచివి
స్తారము పుట్టించినమును
చేరిన దెస విడిచి మనము సేరునవలకున్ - 2-37

రసముననుభవించు వ్యక్తిని గూర్చి చెప్పుచూ దీనియందు**'అభినవ'** రుచియన్నాడు. ఇది **అభినవగుప్తుని** గూర్చిన భావనయా? ఈ పద్యమంతా రసచర్చకాస్కారము కలిగించునట్టిదే.

**చక్కని సమాసరచనకు** 1-34 **వెలయాలు నీతి**గూర్చి 72-75 పలురకాలలేఖలను మన కవులు వ్రాయించినారు గాని మంచెన **కేతకీపత్రలేఖ** (4-144) వ్రాయించటం విశేషం. గర్భధారణయనేది స్త్రీజాతికే చెందుతుంది. దీనిలో ఒక పురుషుడు తన భార్యగర్భాన్ని ధరించి ఆమె బాధను పోగొట్టినాడు. (4-85-94) ఇది ఒక వింతవిషయమే. గ్రంథంలో వివాహాన్ని ముచ్చటగా మూడుపద్యాల్లో ముగించినాడు.(4.188-190) సుందరి విరహవేదనలో భాగంగా వర్ణించిన **వెన్నెలబాధ** (4-162) రమణీయంగా కలదు. ఇదే పద్ధతి అనంతర ప్రబంధాలలో విస్తృతరూపం పొందింది. దారిద్ర్యాన్ని వర్ణించిన సంస్కృతాంధ్రకవులు పలువురున్నారు. ప్రతీవారిదీ ఒక విశేషరీతి, మంచెనకవి దరిద్రదేవతను శార్దూలాకృతిగా మంచి విశేషణాలతో రమణీయంగా ఇట్లా చెప్పినాడు.

బల వద్దైన్యము వక్త్రగహ్వరముగా, బల్పోటులంగొన్న య
ప్పులు మైచారలుగాగ, బాలరుదితంబుల్ మ్రోగుటల్గాగ, దు
ర్నిలయారణ్యములో భయప్రకటమూర్తి క్రూరమైయుండగా,
దలమే వెల్వడజేయలావు కలిమిన్ దారిద్ర్యశార్దూలమున్ (3-303)

ఇట్లే ఎన్నెన్నో విషయాలను ఆయాసందర్భాలలో తెలియచేసినాడు,

**కేయూరబాహుచరిత్ర ప్రత్యేకత**

మంచన యీ కృతి ప్రాచీనమై రాజనీతికి సంబంధించినది. దీనికి వెనుక ముందు రాజనీతిగ్రంథాలు వచ్చినా ఇప్పటికీ అలభ్యాలుగానే వున్నాయి. దీని ప్రాముఖ్యాన్ని గమనించి ప్రబంధరత్నావళికారుడు 11 పద్యాలను, సకలనీతిసమ్మతగ్రంథకర్త 4పద్యాలను గ్రహించినారు.

**ప్రబంధమణిభూషణంలో–**(1971ము) గల పద్యాలు (బ్రాకెట్లోయిచ్చింది ప్రబంధమణి భూషణం పుటసంఖ్య– (1–58) ( 61)1 – 62( 136)1 – 65 (199) 4 – 49 (149) 4 – 33 (396) 4 – 35 (397) 4 – 26 (823) 1 – 72 (858) 1–73(160) 1–74 (826) 1–75 (863)

**సకలనీతిసమ్మతంలో** (1970ము) – 4–208(149) ఈ పద్యం నీతిభూషణంలోను గలదు. 2–88 (504) 3–229(736) 3–161(130) మంచెన నందూరిగుండమంత్రిని వర్ణిస్తూ ఆయన ప్రతిభాపాండిత్యాలను లేఖననైపుణ్యాన్ని–

**వాచకత్వము లేఖనోచితత్వము నాంధ్ర**
**లిపిరీతిగా సర్వలిపులయందు**
**ఫణితజాతియు తీవ్రభంగియును తెనుంగు**
**భాషయట్టుల సర్వభాషలందు**
**మర్మజ్ఞతయు ప్రౌఢమతియును గణకత్వ**
**విద్యయట్టుల సర్వవిద్యలందు–**
**వదనవికాసంబు మృదువాక్యమును బంధు**
**జనులయట్టుల సర్వజనులయందు**
**మన్ననయును నిర్వంచనమతియు మిత్ర**
**గణములట్టుల సర్వార్థిగణములందు**



**ననుట సహజంబుగాని వర్ణనముగాదు**
**గుండనామాత్యునకు మంత్రికుంజరునకు** (1–51) అని

ఈ పద్యం ద్వారా గుండన ప్రతిభాదులను తెల్పటమేగాక మొట్టమొదటి పర్యాయం తెలుగుసాహిత్యంలో **లిపి ప్రస్తావన**చేసినాడు, గుండమంత్రి తెలుగులిపివలెనే మిగిలిన లిపులన్నింటిలోను ప్రవీణుడు ఆయాలిపులను **'తీవ్రభంగి'**గా అంటే మిక్కిలివేగంగా వ్రాసేనైపుణ్యంగలవాడు అని తెల్పటం వలన తన నాటికే తెలుగునకొక సంపూర్ణలేఖనరీతి ఏర్పడి దాన్ని చక్కగా చదివేవారున్నట్లు తెలుస్తున్నది. ఇది ప్రశస్తవాచకలక్షణం. ఇట్లా చదివేవారు కవి గమకి వాది వాగ్మి అని శాసనాల్లోను కావ్యాలలోను కనపడుతారు. చాటుపద్యాలలో వాచకలక్షణం తెలిపే కొన్ని పద్యాలున్నవి (చాటుపద్యరత్నావళి–36పు) పురుషార్థసారంలోను ఈవిషయం తెల్పబడింది. **ఆత్మీయలిపులట్టులన్యదేశంబుల** పెద్దన చెప్పిన ఊహతెలియంగల లేఖక పాఠకోత్తములు వీరే.

**లిపులను జదువంగ నిపుణుడయ్యెనని విక్రమార్కచరిత్ర**లో జన్నయమంత్రిని గూర్చి కలదు. ఇంతవివరాన్ని మంచెన ఈయటానికి ముఖ్యకారణం– కృతిభర్త గణకశిఖామణి కాబట్టి ఆయన లేఖనరీతి తెలిసి చెప్పినది. అప్పటి శాసనాల్లో తెలుగుపద్యం సలక్షణమైన రూపుదాల్చటం కూడా ఒక విశేషం.

కృత్యాదియందు తనకృతిభర్తను దేవతలందరు చల్లగా చూతురుగాక అని తెల్పటంలో మంచెన వినూతన పద్ధతిని ప్రవేశపెట్టినాడు– ఆపద్యం–

కరిముఖు దశ్వినుల్ శ్రుతులు కంజసముద్భవుమోము లంబికే
శ్వరుమొగముల్ తదాత్మజుని వక్త్రము లాదిమునీంద్రమండలం
బురగపతుల్ గ్రహంబులు పయోరుహనాభుడు తారకంబులున్
బొరిబొరి నెల్లసంపదలు బోలమగుండనికిచ్చుగావుతన్(1–2)

దీనియందు దేవతాప్రశస్తి సంఖ్యాపరంగా ప్రారంభమై అసంఖ్యాకతారకలతో ముగిసినది,
కరిముఖుడు- (ఏకదంతుడు)1, అశ్వినులు 2, శ్రుతులు-3, కంజనముద్భవువెూములు 4, అంబికేశ్వరుమెుగములు-5, తదాత్మజునివక్త్రములు-6, మునీంద్రమండలము-7, ఉరగపతులు-8, గ్రహములు-9, పయోరుహనాభుని అవతారాలు-10, తారకలు- అనంతం- ఇట్లా ఈదేవతలు గుండయను రక్షింతురుగాక అన్నాడు- ఇది సంఖ్యాక్రమం. గుండయ గణకరత్నం గాబట్టి ఆయనకిష్టమైనరీతి పద్యమును రచించినాడు. **విక్రమార్కచరిత్రలో** జక్కన కూడా తనకృతిపతిని **రూపమొక్కటి** ఇత్యాది పద్యం (2-192)లోను ఇట్లే వర్ణించినాడు. **భాస్కరరామాయణం**లో 'దశరథుని వర్ణించేటప్పుడు **జనలోకైకమహారథుండు** అని ఆరంభించి వరుసగా **'దశ'**రథాధీశుడు అనే సంఖ్యాక్రమం చెప్పటం ఒక విశేషం.

మంచెన కవిత్వ విషయంలో నిష్ఠాపూర్తిగానున్నట్లే సందర్భోచితంగా విద్య, పాండిత్యాల గూర్చి చెప్పినాడు- **ఆపదలకెల్లకుదురు చదువలేమి**(3-289) అని **అక్షరజ్ఞుడుగానియతనికి శాస్త్రపురాణాగమాదులు రావు తెలియ, గ్రంథాధిగమశక్తి కలుగక శుద్ధవివేకంబు** లేదు. **వివేకబుద్ధికలుగక కర్తవ్యకర్మములెరుగడు -** అని విద్యాప్రాముఖ్యాన్ని వివరించినాడు.

ఈ విధంగా కేయూరబాహుచరిత్రను- రాజకీయ-సాంఘిక, నీతి, ధర్మ-విద్యావిషయ ప్రవచనముచేత ప్రత్యేక రచనగా తీర్చిదిద్దిన మంచెన ప్రతిభాపరిణద్ధమూర్తి-

## మంచన ప్రయోగించిన పదాలలో కొన్ని

1. ఆశ్వా.

| | | | |
|---|---|---|---|
| 51. | తీవ్రభంగి | - | వడివడిగా |



2. ఆశ్వా .

| | | | |
|---|---|---|---|
| 60 | మచ్చు | - | అటక |
| 70 | మిండడు | - | జారుడైన ఉపపతి |
| 72 | దేవుకపోవు | - | అన్నీ సర్దుకునిపోవటం |
| 89 | ఉక్కలుడు | - | ఉపేక్షించువాడు |
| 114 | కొండ్రురు | - | గ్రహింతురు (బహువచనంమీద బహువచనం)కోదండ్రుర వలె |

3. ఆశ్వా .

| | | | |
|---|---|---|---|
| 18 | ఉమ్మగలారు | - | వేడి |
| 22 | శ్రీపాదము | - | శ్రీవైష్ణవంలో భగవత్పాదాలను ఇట్లా అంటారు |
| 41 | గీనువ | - | మెుఅపెట్టుట |
| 74 | ముండపులుగులు | - | నింద్యములైన పక్షులు |
| 116 | తివ్వలు | - | తీగలు |
| 132 | పురటి | - | దుర్మార్గుడు |
| 168 | సీనపుదీవి | - | చీనాదీవి |
| 179 | ముండఎలుకలు | - | నింద్యములైన ఎలుకలు |
| 238 | అట్టుగ | - | అటక, (ప్రాసస్థానంలో 'గ' కలదు) |
| 242 | అర్ఘ్యపళ్యము | - | మిశ్రపదం (అర్ఘ్యపాత్రయైన పళ్లెరం) |
| 256 | పెరిమెలు | - | పెద్దరికంగలవారు (తమిళంలో పెరుమై) |
| 274 | పినుగు | - | పీనుగు,(నృసింహపురాణంలో లోభి, పాడుపిశాచము అని 4-115) |
| 306 | కరిసనంపు | - | కరిశనం, కర్షికం, వ్యవసాయం |

4 ఆశ్వా .

117 లాగలు - రంధ్రాలు

153 వెమ్మగ - వేడిగ

**ఛందస్సు-**

ఈ గ్రంథమునందు మంచెన విశేషవృత్తాలను ప్రయోగించలేదు. ఆశ్వాసాంతాలలో మాత్రమే మాలినీవృత్తాలున్నాయి. సాధారణచ్ఛందంలోనే రచన కొనసాగినా కొన్నిచోట్ల ఛందోభంగాలుండట లేఖకుల పొరపాటు కావచ్చు. ఆవిధమైనవాటిలో-

**తృతీయాశ్వాసములో-**

పద్యం.నెం. 205

ఇలపురమును దేశంబున్

వెలువడ ద్రోపించుటయును **నె**లతుల్-బి .......

**వెలువడ-నెలత** యతిభంగం అయినట్లు **'ము'**లలో కలదు, దీనిని 'దేశంబు' న్వెలువడ... నెలతుల్ అనినచో యతి సరిపడును.

ఈవిధమైనయతినే మంచెన - ఇదే గ్రంథమునందు - 3-254 న్రాజటయొకకప్పుయిట్టి నగవులు గలవే- అని ప్రయోగించినాడు.

225- **జ**వ్వనంబునదానచ**న**టియైన (దీనికి పాఠాంతరం కలదు)

యతిస్థానంలో **'చెనటి'**పదం కావలెను (ఎందరోకవులు **ఎ**కారాదిపదాన్ని అకారాదిగను, అకారాదిని **ఎ**కారాదిగను ప్రయోగించినారు. ఉదా॥ **చన్నయాచార్యుడాచార్య చక్రవర్తి**) కవిప్రయోగం **'చనటి'** అనియే కలదు. 238- **మృ**గశాబేక్షణలోచనావరణమున్ **వే**గంబునన్- దీని యతిస్థానంలో **'మోదము'** అనియుండగా వట్రువసుడికి ఏకారముతో యతి చెల్లదని ఇట్లుదిద్దినారు, కాని **న్మృగశాబేక్షణ..... న్వేగంబు**న అనిన సరిపడును. మడికిసింగనజ్ఞానవాసిష్ఠంలో 3-12 క **ఋ**త్వమున వెలంగి**దో**చుచుండు అన్నాడు.



256 **రాజటయొకకప్పుయిట్టినగవులుగలవే(ము)**

దీనియందు యతిభంగమైనది.

ఈ పాదాన్ని, వారికెల్ల/న్రాజటయొకకప్పుయిట్టినగవులుగలవే అని సవరించిన యతి కుదురును,

308- క/న్గొని కన్నీళులపాదముల్‌గడిగి స**మ్మో**దమ్ముతో (ము) **న్గొ-మో**-యతి కుదురదు. దీనిని క/న్గొని కన్నీళుల పాదముల్‌గడిగి స**న్మో**దమ్ముతో అని మార్చినచో **నొ-నో** యతి కుదురును.

4.172 **మందుట తొల్లి సిద్ధోపదేశంబ**ని- ఈపాఠాన్ని యతిభంగమని **మం**దుటతొల్లిసిద్ధాదేశమనిదిద్దినారు. కాని- **'మొం**దుటతొల్లిసి **ద్ధో**పదేశంబని' - దిద్దిన శాస్త్రిగారి పాఠం యోగ్యంగా కలదు.

## పరిష్కరణ

తిరుమలతిరుపతిదేవస్థానములవారు వేటూరిప్రభాకరశాస్త్రి మహోదయుల వాఙ్మయపీఠాన్ని ఏర్పరచిన తరువాత వెలుగులోనికి వస్తున్న ప్రబంధాలలో కేయూరబాహుచరిత్రము మొదటిది,

చాలాకాలంనాడే వేటూరువారు దీన్ని ముద్రణకొరకు సిద్ధంచేసే ప్రయత్నంలో అనేకానేకపాఠాంతరాలతో సిద్ధంచేసిన లిఖితప్రతి ఈ ముద్రణకు ముఖ్యం. ఇంతకుముందు భిన్నకాలాలలో ముద్రణమైన కేయూరబాహుచరిత్ర నాల్గుప్రతులతో- లిఖితప్రతిని తైపారువేసిచూచి- వీలయినంతమేర మంచిపాఠాలతో దీన్ని సిద్ధంచేయగలిగినాను, శాస్త్రిగారు సవరించిన కొన్నిపాఠాలను కూడా పుటయడుగున సూచించి ముద్రిత గ్రంథాలలోని సరియైన పాఠాన్ని పైకి చేర్చినాను. ఈ సందర్భాలలో **'లి'** అనగా వేటూరివారి లిఖితప్రతి **'ము'** అనగా ముద్రిత గ్రంథాలలోని సరియగు పాఠమని గ్రహింపవలెను.

అధికంగా చేరిన దాదాపు 18 గద్యపద్యాలు బోల్డ్‌టైపులో కలవు. ఆయాపేజీలలో సవరణలు- మార్పులు చేర్పులను సూచించినాను, ఇవేగాక

మరికొన్ని చిన్నమార్పు లున్నవి.

1. ఆ. 5 పద్యం. సీసం 4వ వరుస. ఫుట్‌నోట్స్‌పాఠంపైకి పైన వున్న పాఠం ఫుట్‌నోట్స్‌లో నుండవలెను.

2. 12 **'సేయుము నీ వంధ్రభాష'** పాఠాన్ని ఎకాడమీ ప్రతితప్ప మిగతా ప్రతులు గ్రహించినవి. మంచెనకృతి అనువాదం కాదుగదా! దీనికన్న **'సేయుము నీ వట్టికావ్యశిల్పము'** పాఠం బాగుంటుంది, **బాలరసాల.....** పద్యం పోతనకన్న చాల ముందటిది. దీన్ని ఏలేఖకుడో కేయూరబాహుచరిత్ర యందు చేర్చియుంటాడనే పరిశోధకుల నిర్ణయం సమంజసమైనది. మంచెన దీన్ని వ్రాసియుండడనటానికి ప్రబలాధారం దీని ముందు వెనుకగల (13,15) పద్యాలు.

1.16 వచనం- **కావున నీకుంగృతియిచ్చెదననియెుడంబడి పురాతనాధునాతన......'** అనే ప్రారంభం కొన్ని **'ము'**లలో కలదు.

2. 112, 113. పద్యాలు ఇప్పటి నాలుగు ముద్రితప్రతులలో చేరలేదు.

కేయూరబాహుచరిత్ర ప్రతులను, కేయూరబాహుచరిత్ర గూర్చి పెద్దలు వ్రాసిన వ్యాసాలను పరిశీలించి కొన్ని పాఠాలను పద్యాలను గ్రహించినాను. ఈ సందర్భంగా కేయూరబాహుచరిత్రల పీఠికలు- వివిధ గ్రంథాలు ఎంతగానో తోడ్పడినవి.

**కేయూరబాహుచరిత్ర ముద్రణలు**

1. 1902 సం- పోలవరంజమీందారుగారైన కొచ్చెర్లకోట రామచంద్ర వెంకటకృష్ణారావుగారు తమ సరస్వతి పత్రిక ద్వారా ప్రకటించిన దీనికి వారి ఆస్థానకవులైన తిరుపతివేంకటకవులు మూడుపుటల పీఠికను వ్రాసి అప్పటికి తమకుతోచినరీతిగా పరిష్కరించినారు. గద్యపద్యాలు 785 ఇది కేయూరబాహుచరిత్ర ప్రథమముద్రణ నేనొనర్చే పరిష్కరణ సందర్భంగా గుంటూరునుండి మిత్రులు అరిశెట్టి శాయిప్రసాద్‌గారు 1902,1960 నాటి ముద్రితప్రతులను సి.డి.లో తీసి పంపించినారు. తరువాత మాన్యులు వేటూరి



ఆనందమూర్తిగారు తమవద్దగల 1902 నాటి ముద్రితగ్రంథం. ప్రభాకరశాస్త్రిగారి అనేక సవరణలతో నున్నదాన్ని జిరాక్స్ తీయించి లామినేషన్ బైండింగ్‌తో 5-9-2011నాడు పంపించినారు.

2. 1960- సుప్రసిద్ధపరిశోధకులైన తిమ్మావఝుల కోదండరామయ్యగారు 1902 నాటి ప్రతి ఆధారముగా కొన్ని పాఠముల పరిష్కరించి - 'పూర్వముద్రణములోని పెక్కుదోషములిందు సవరింపబడినవి' అన్నారే కాని వారు తాళపత్ర లిఖితప్రతులనుగాని శాస్త్రిగారి ప్రతిని గూర్చిగాని తెల్పలేదు. వీరిప్రతిలో గద్యపద్యములు 767

3. 1966- ఆంధ్రప్రదేశసాహిత్యఎకాడమీవారు క్లాసికల్‌పాపులర్‌సిరీస్‌లో (1-00 గ్రంథపరంపరయందు) గడియారం రామకృష్ణశర్మగారి పీఠిక పరిష్కరణముతో ప్రకటించినది. శర్మగారు వివిధ ప్రతులను పరిశీలించినా కొన్ని పద్యాలను చేర్చలేదు. ఈ గ్రంథంలో గద్యపద్యాలు 767.

4. 1970- వేదంవేంకటరాయశాస్త్రిగారు (జూనియర్) విపులమగు ఉపోద్ఘాతముతో ప్రకటించిన దీనియందు తమతాతగారు వెంకటరాయశాస్త్రిగారు గుర్తించిన పాఠాలను చేర్చినట్లు తెల్పి అనేక పాఠాంతరములతో మధ్యమధ్య అర్థముల వివరణతో సన్న అచ్చు దగ్గరిగా ముద్రించిన ఈగ్రంథమున పూర్వముద్రణల పరిశీలన జరిగినది. కాని- తమతాతగారికి లభించిన ప్రతివివరాలు మాత్రం తెల్పలేదు. పీఠికలో వారి పూర్వవాదమైన నన్నెచోడుడు మంచెన తర్వాతివాడని సప్తసంతానములు షష్ఠ్యంతాలు మొదలైన వాటికి మంచెనయే ఆద్యుడని వ్రాసి చారిత్రకభూమిక ఎక్కువగాచేర్చి కథావిశేషాలు, పాత్రలు, ఇతర కథలను విషయసూచికలో యిచ్చినారు.గద్యపద్యాలు767

**కేయూరబాహుచరిత్రప్రతులు**

1. మదరాసుప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారం వ్రాతప్రతి (కాగితం) 45 నెం.పేపర్ అంగుళాలు పుటలు 230 ప్రతిపుటలో పంక్తులు 20, తెలుగులో

మంచి ప్రతి కె. ఆర్.వి.కృష్ణారావు బహదూర్‌గారిచ్చినది. (1911-1912) దీనిలో 62-142 పుటలు. కేయూరబాహుచరిత్రగలదు. బహుశః ఈప్రతి మొట్టమొదట ప్రచురణ నిమిత్తం ఆనాడు కొత్తపల్లివారు వ్రాసుకొనివచ్చిందా?

2. తంజావుర పుస్తకశాలలోగల తాటాకు పుస్తకం తెలుగు తాళపత్రగ్రంథాలకేటలాగు ఎం.ఎస్.ఎస్ వాల్యూం 1911-13 పుటలు 128. కేయూరబాహుచరిత్ర గూర్చి 130-137 పుటలలో కలదు. 157 కేయూరబాహుచరిత్ర (మంచన) 140 సమగ్రము. డిస్క్రిప్టిన్ కేటలాగు తెలుగు తంజాపూర్ సరస్వతీ మహల్ గ్రంథాలయం పు.34.

3. ఆంధ్రవాఙ్మయసూచిక- ముద్రితగ్రంథాలపట్టిక 46పుట (ముద్రితమైన సంవత్సరంలేదు) 62పు. 282పు. మంచెన కేయూరబాహుచరిత్ర ప్రబంధం అనియే కలదు.

4. గడియారంవారు పరిష్కరించిన ఎకాడమీవారి ప్రతికి 1902, 1960 ప్రతులు మదరాసులోని ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారములోని వ్రాతప్రతి ఆధారం అని తెల్పినారు.

1902లో ముద్రితమైన సరస్వతీ పత్రికవారి ప్రతి పీఠిక (3పుట)లో ఈ ''కేయూరబాహుచరిత్రమును చెన్నపురియందలి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునుండి యొక ప్రతిని వ్రాయించి తెప్పించి మరియొక ప్రతినిమిత్తము ప్రతీక్షించినను నెచ్చటను దొరకదాయె. తుదకు ఆ యొక్క ప్రతిని బట్టియే యందున్న తప్పులను లుప్తభాగములను బ్రహ్మశ్రీ శతావధానులు తిరుపతివేంకటేశ్వరకవులచే సవరింపించి సరస్వతీపత్రికాముఖంబున ప్రచురించినాడ" అని వెంకటకృష్ణారావుగారు తెల్పిరి. దీనియందు కొత్తపల్లివారి ప్రస్తావనేలేదు.

**వేటూరివారి పద్ధతి**

ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించవలెననే సంకల్పంతో సిద్ధంచేసి యుంచుకున్న ప్రతి తాళపత్ర లిఖిత ప్రతులతో తైపారువేసినట్లు వారిచ్చిన



పాఠాంతరాల వలన తెలుస్తున్నది. 1940, 1944లో ఈ పుస్తకాన్ని గూర్చి శాస్త్రిగారు చిలుకూరు పాపయ్యశాస్త్రిగారితోను, ఆంధ్రవిజ్ఞానసమితి-(విజయనగరం) కార్యదర్శిగారైన గంటి సూర్యనారాయణశాస్త్రిగారితోను, ఉత్తరప్రత్యుత్తరాలను జరిపినారు. (ఈగ్రంథం చివర్లో ఆలేఖలప్రతులున్నవి). ఈ ప్రతి ఫుల్‌స్కేప్ కాగితాలపై ఒకవైపు 95 పుటలలో అందంగా లిఖితమై పాఠాంతరాలు కూడా సూచింపబడినాయి. 4-191 పద్యం (90పు) నుండి వ్రాతమారింది. ఇది చిలుకూరుపాపయ్యశాస్త్రిగారి వ్రాత. ఆనాడే వీరు సవరణలు-మార్పులు చేర్పులను పాఠాంతరాలను ఇచ్చినారు, గద్యపద్యాలు 785 - దీని వరకు 16 పద్యాలు అధికమైనవి. శాస్త్రిగారే దీనికి పీఠికవ్రాసి పరిష్కరించి ప్రకటించియున్నచో ఎన్నో విశేషాలు తెలిసేవి. మన సాహిత్యంలో ఏకైక గ్రంథం మాత్రమే. లభించినవాటిలో కేయూరబాహుచరిత్రయొకటి. ప్రప్రథమంగా దీన్ని తంజాపురపుస్తకభాండాగారం నుండి (1900 ప్రాంతంలో) సంపాదించి ప్రత్యంతరం సిద్ధంచేయటానికి కొత్తపల్లివారు పడినశ్రమ, సరస్వతి పత్రికలో దీన్ని అనుస్యూతంగా ప్రకటించటానికి చేసిన ప్రయత్నాన్ని ఎంతో విపులంగా శ్రీనిడుదవోలు వెంకటరావుగారు తెల్పినారు (మానవల్లి కవిరచనలు. పుట.9ము 1972). ఐతే కొత్తపల్లివారు తమ తంజాపురగ్రంథ సంపాదనయత్నాన్ని గూర్చి ఎక్కడైనా వ్రాసినారా? అనేవిషయం మాత్రం నిడుదవోలువారి వ్రాతలో లేదు.

వేటూరివారి సవరణల్లోను లేఖల్లోను సూర్యారావుగారి ప్రసక్తి లేకపోటం ఆశ్చర్యం. ప్రభాకరశాస్త్రిగారికి 1940లో గంటివారు వ్రాసినలేఖలు, చిలుకూరివారిలేఖలు (1944) చూస్తే కొన్ని వింతవిషయాలు వెల్లడియైనవి, కేయూరబాహుచరిత్ర గూర్చి నిడుదవోలువారు తెల్పిన విషయం ఆలోచనీయం, కారణం ఏమంటే చిలుకూరివారిలేఖ (చూ-చివర్లో) యందు వఝల వారివద్ద ఒక తాళపత్రప్రతియున్నట్లు తెల్పినారు, మరి అది ఎక్కడిది? వేదంవారివద్ద ఒక ప్రతియున్నట్లు కేయూరబాహుచరిత్ర (1970) పీఠికలో జూనియర్

వేదంవారు తెల్పిరి. ఇదెక్కడిది? ఏ రకమైన ప్రతి? 1902నాటి ముద్రణ. 1902నాటి ముద్రణ కేయూరబాహుచరిత్ర 1944 వరకు వీరికి తెలియదనటం కూడా నమ్మశక్యం గానిదే. ప్రభాకరశాస్త్రిగారు నల్లసిరాతో సన్నగా వ్రాసిపెట్టుకున్న తాళపత్రప్రతి సవరణలుగల 1902 నాటి ప్రతి నేటికీ ఆనందమూర్తిగారివద్ద గలదు.

విజయనగరంలోని ఆంధ్రవిజ్ఞానసమితివారు (1940లేఖ) చిలుకూరివారు (1944లేఖ) 1902 నాటి ప్రతిని ఎరుగరా? దానిని గూర్చి తెల్పకపోవటానికి బలీయమైన కారణం ఏదో వుంటుంది. అందుకే దీన్ని సుపరిష్కృత ముద్రణగా ప్రభాకరశాస్త్రిగారు సిద్ధంచేయటం అవసరమని పైన పేర్కొన్న లేఖలద్వారా తెలుస్తున్నది. శాస్త్రిగారి డైరీలు-లేఖల్లో ఎక్కడైనా దీని ప్రసక్తి వచ్చిందేమో?

**కృతస్మృతి**

ప్రభాకరశాస్త్రిగారు వ్రాసియుంచుకున్న మరియొక గ్రంథం ఇంతకాలానికైనా తిరుమల తిరుపతి దేవస్థానములవారు ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా ప్రకటించటం ఆనందదాయకం. అనేకానేకకృతులను పరిష్కరించి విలువైన పీఠికలతో ప్రకటించిన ప్రభాకరశాస్త్రిగారు కథాసాహిత్యముపైన గల ప్రత్యేకాభిమానంతో కేయూరబాహుచరిత్ర ముద్రణ ప్రయత్నంచేసినారు. సుదీర్ఘకాలంగా వారి లిఖితప్రతి సంరక్షితమై యింతకాలానికైనా సూర్యాలోకభాగ్యమునకు నోచుకోవటం ఒక విశేషం. ఇట్టి సత్కార్యానికి ముఖ్యులైన పూజ్యులు తి.తి.దేవస్థానాల కార్యనిర్వాహణాధికారి శ్రీ లంకా వేంకటసుబ్రహ్మణ్యంగారు, ప్రభాకరశాస్త్రిగారి వాఙ్మయపీఠాధికారియైన ఆచార్య రవ్వా శ్రీహరిగారు, పీఠం ముఖ్యసలహా దారులైన వేటూరి ఆనందమూర్తిగారు సాహితీలోక నిరంతరసంస్తవనీయులు.

శాస్త్రిగారు ప్రకటించవలసిన యీ గ్రంథానికి అస్మాదృశుడు



పరిష్కర్తయగుట పురాకృత జనుర్విశేషముగా భావింతును. తి.తి. దేవస్థానాల నిర్వహణలో ఏర్పడిన ప్రభాకరశాస్త్రివాఙ్మయపీఠం అధికారులు అప్పగించిన ఈ పనిని 'నేర్చినభంగి' చేయగలిగినాను. దీని యందలి 'వరణీయత్వము'నకు సహృదయాః ప్రమాణం,

గ్రంథపరిష్కరణ సమయమునందు 1902,1960 నాటి కేయూర బాహుచరిత్ర ముద్రణ ప్రతుల పంపించి ఎంతో సహకరించిన గుంటూరువాసి మిత్రులు అరిశెట్టి శాయిప్రసాద్‌గారు, పుస్తకాలను అవసరమైన సమాచారాన్నిచ్చి ఆశీఃపూర్వకంగా ప్రోత్సహించిన మాన్యులు ఆచార్య ఆనందమూర్తిగారు, వాఙ్మయపీఠంలో వున్న ఇతర ఉద్యోగులు- ఈసందర్భంగా కొన్నిపుస్తకాలు, వ్యాసాలు తోడ్పడినవి, ఆయా రచయితలు-

అందరికీ ధన్యవాదాలు,

**'వేటురివారి వ్యాఖ్యలును పీఠికలున్ దెనుగుంబొలంతికిన్**
**బేటులురేగు గందవొడివెట్టినపూతలు నంతయయ్యు వా**
**రేటికి వట్టి పేదతనమే భజియింతురు నెంతయయ్యు నో**
**నాటకు నెక్కుటో తెలుగునాటికి నాటికి నాటికక్కటా'**

మీ

12-12-2011

డా॥ శ్రీరంగాచార్య

ఖర-మార్గశిరబహుళవిదియ.సోమవారం,

11-14-25, రోడ్.నెం.1,

హరిపురం, హైద్రాబాద్-35.

# కేయూరబాహుచరిత్రము
## ప్రథమాశ్వాసము

ఉ॥ శ్రీ వసియించుఁగాక సుఖసిద్ధి వహించి యనేక బంధు హం
సావళియుం[1]బ్రహృష్టరసికార్థి సముత్కరషట్పదంబునై
జీవన మెప్పుడున్ సుకవిసేవ్య మనంబొగడొంది సర్వపు
ణ్యావహమైన గుండసచివాగ్రణిగేహ సరోవరంబునన్. 1

చ॥ కరిముఖుఁ,దశ్వినుల్, శ్రుతులు, కంజసముద్భవు మోము లంబికే
శ్వరుమొగముల్, తదాత్మజుని వక్త్రము లాది మునీంద్ర మండలం
బురగపతుల్ గ్రహంబులు పయోరుహనాథుఁడు తారకంబులున్
బొరిఁబొరి నెల్ల సంపదలుఁ బోలమగుండనికిచ్చు [2]గావుతన్ 2

మ॥ శ్రవణానందనభారతీచతురునిన్ బ్రాచేతసున్,దివ్య స
త్యవతీనందనుఁగాళిదాసుఁగృతికర్తన్ గొల్చి వాక్పూర్ణమే
రువులన్ నన్నయభట్టుఁ దిక్కయకవీంద్రున్ భక్తితో మ్రొక్కి యు
ద్ధవచాణక్య యుగంధరాది నయవిద్యాకోవిద ధ్యానినై 3

వ॥ ఇట్లు కృతిప్రారంభకర్తవ్యంబు లాచరించి యున్నవాని 4

సీ॥ తన పేరి సొబగు మేదిని నెల్లవారికి
వీనుల నమృతంపువాన గురియఁ
దను నాశ్రయించిన జనుల మందిరములు
దొమ్మిది నిధులను దొంగలింపఁ
దన కీర్తికామిని యనిశంబుఁగ్రైసేసి
యేడు సాగరముల నీడఁజూడఁ
[3]దన యొప్పు సూచు కాంతలకుఁజిత్తప్రియా
స్వదనంబు నవ్వుల సంకుచిత క్రియా

1.ప్రహృష్టసరసార్థి ‘ ప్రహృష్టరసశాంతి’ ప్రహృష్టరతిశాంతి – ము
2. చుండెడన్, చుండెదన్ –లి
3.తన యొప్పు సూచు కాంతలకొండు మారుండు
తే దను బుద్ధి గల్గించుచుండ– ము



గీ॥ నెగడు బ్రహ్మవంశ నీరధి సంపూర్ణ
చంద్రముఁడు గళావిశారదుండు
నైజధార్మికుండు నండూరి గుండన
మంత్రి నిఖిలమంత్రిమండనంబు 5

వ॥ నిరంతరనరసకవివరగోష్ఠీనిష్ఠుండు గావున నొక్కనాఁడుచిత
కథా ప్రసంగంబున 6

కం॥ తన యిష్టసఖుని విద్వ
జ్జనమాన్యుని నుభయకావ్య సరణిజ్ఞుని మం
చన నామధేయు నన్నుం
గనుఁగొని యిట్లనియె వినయగౌరవ మెసఁగన్ 7

గీ॥ నందనుఁడు వనము నల్లిల్లు నిధి సుర
గృహము చెఱువు, మేలికృతి యనంగ
జగతి వెలయు సప్తసంతానములు; వీనఁ
బుణ్యమును యశంబుఁబొందవచ్చు 8

క॥ సొమ్ములలో ముప్పోర్చు, జ
గమ్మెల్లను సోడుముట్టఁగాఁజేయును శ్లా
ఘ్యమ్మగు వస్తువు, నగుటన్
గమ్మని కనకమ్ము గాదె కవిత దలంపన్ 9

క॥ వననిధి తటాక దేవభ
వనములు పుణ్యదము, లైనవానిఁ బ్రతిష్ఠిం
చినచోన కాని యెఱుఁగరు;
చనుఁగాదే సరసకవిత సకలదిశలకున్. 10

ఉ॥ కావున నాకు నొక్క కృతి గైకొన నిష్టము, నీవు ప్రాజ్ఞసం
భావిత కావ్యదక్షుఁడవు భవ్యమతిం ద్విజదేవనిర్మితం
బై విలసిల్లు తంత్రము ప్రియంబగుఁ జూచితి నందుఁ గర్ణ సౌ
ఖ్యావహమై ప్రబంధరచనాశ్రయ మయ్యెడు [1]మార్గమూతగన్ 11

క॥ స్థాయిరసము శృంగారం
బై యలవడఁ గథలు నీతులై యెడనెడ రాఁ
కేయూరబాహుచరితము
సేయుము [2]నీ వట్టి కావ్యశిల్పము మెరయన్ 12

వ॥ అని పలికి బహుమాన పురస్సరంబుగా నంబరాభరణాది వివిధ
పదార్థ సహితంబుగాఁదాంబూలంబిచ్చినం బుచ్చుకొని 13

ఉ॥ బాల రసాలపుష్పనవపల్లవ కోమలఁ గావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపుఁగూడు [3]భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి? మఱి యంతకు నాయతి లేనినాఁడు కౌ
ద్దాలికులైన నేమి? నిజదార సుతోదరరక్షణార్థమై 14

క॥ అని తగని వారిదెస నా
మనమెప్పుడు రోయుఁగాన మతిమజ్జన వ
ర్ణనలకు మిగిలిన సుగుణుని
నినుఁబొంది మదీయకవిత నెగడుం బుడమిన్. 15

వ॥ అని పలికియు జిరంతన కవిముఖ్యులకు నమస్కారంబుఁ గావించి వారి యనుమతి వడసి భారతిం బ్రార్థించి, పునఃపునః ప్రణామంబు లాచరించి యగ్గండనామాత్య వంశక్రమంబు జగత్ప్రసిద్ధంబైననుం గృతిలక్ష్మికి ముఖతిలకంబుగా రచియింతు నది యెట్లనిన 16

1 మార్గమందమౌన్- లి, 2..నీవంద్రభాష- లి, 3.చరించుట - లి



సీ॥ జనపాలనుతసింహ చక్రవాలంబు సా
మంత నిర్మలరత్నమండనంబు
రాజత్తురంగతరంగపయోనిధి
భద్రేభమేఘనభఃస్థలంబు
భూదేవదేవజాంబూనదాచలము వ
దాన్యకల్పకదేవతాపురంబు
బహుకళాకర్పూరభాసికరండంబు
సుజనముక్తాఫలశుక్తిచయము.
గీ॥ చతురకాంతాప్రసూనవసంత[1]కేళి
రసికవిటజనమధుకరారామలక్ష్మి
మధురకవికులకలహంసమానసంబు
నాఁగ ధనదుపురంబు వర్ణనలఁదనరు 17

వ॥ మఱియును 18

సీ॥ పుష్పకనివహంబు భూతలంబున నిల్చి
నట్లందమైన దేవాలయములు
రూప్యాచలము బహురూపంబుల నటించు
రమణ శోభిల్లు సౌధముల పెల్లు
అలకాధిపతినిధులన్నియు వెలివీడు
విడిసిన క్రియఁబణ్యవీథికలును
ధాత మేదిని మిన్నుఁ దఱఁగి వైచిన మాడ్కిఁ
గనుపట్టు బహుతటాకముల సొంపు
గీ॥ నుపవనంబులు సరసులు నొప్పు గల్గు
చెఱకుఁదోఁటలుఁబ్రాసంగుచేలు మెరయ
నఖిలవిభవంబులకు నెలవగుచు వెలయు
ధనదుపురమున కెన యన దనదుపురము 19

1.వేళ -లి

గీ॥ మంటికడవ నులుకమంచము పూరిల్లు
నూలిచీర రత్నకీలితంబు
గాని తొడవు పుడమి గలుగు టెఱుంగరు
ధనదుపురములోని జనములెల్ల 20

వ॥ ఆ పురంబున కధీశ్వరుండు 21

శా॥ [1] ప్రాగ్దిక్పశ్చిమ దక్షిణోత్తరదిశాభాగప్రసిద్ధ క్షమా
భుగ్దర్పాంతకుఁడేలెఁ గొంకవిభుఁడీ భూచక్ర మక్రూరతన్
వాగ్దేవీస్తనహారనిర్మలయశో వాల్లభ్యసంసిద్ధితో
దిగ్దంతి శ్రవణానిలజ్వల దటత్తీవ్ర ప్రతాపాఢ్యుఁడై 22

క॥ ఆ విభునకుఁ బ్రెగ్గడయై
భూవలయంబున యశోభిభూషణుఁడయ్యెన్
గోవిందన ప్రధానుం
డావాసము గౌశికాన్వయంబుగఁదనకున్ 23

మ॥ విహితస్థానములందు జూపుఁదగ గోవిందాభిధాన ప్రభుం
డహితోర్వీధరువజ్రి గోఁకవిభురాజ్యాధిష్ఠుఁడై సంధి వి
గ్రహముఖ్యోచిత కార్యసంఘటన [2]తంత్రప్రౌఢియున్ బాధస
న్నహనోదగ్రరిపు క్షితీశ బహుసైన్యధ్వంస సాటోపముల్ 24

క॥ ధీరుండా గోవిందన
కూరిమినందనుఁడు వెలసెఁ గొమ్మన గొంక
క్ష్మారమణునకుదయించిన
వీరుఁడు రాజేంద్రచోడవిభు ప్రెగ్గడయై 25

1.ప్రాగ్దేశాపర - గ, 2. వాక్ప్రౌఢత్వమున్ బాధ - ము



సీ॥ నవకోటిపరిమితద్రవిణ మే భూపాలు
భండారమున నెప్డుఁబాయకుండు
నేకోనశతదంతు లే రాజు [1]గజశాల
నీలమేఘంబులై లీలఁగ్రాలు
[2]బలవేగరేఖ నల్వదివేల తురగంబు
లే నరేంద్రుని వాగె నెపుడుఁదిరుగు
బ్రతివాసరంబు డెబ్బదియేను వుట్లు నే
యే విభుమందల నెపుడుఁగల్గు
గీ॥ అట్టి యధికవిభవుఁడగు కులోత్తుంగ రా
జేంద్ర చోడనృపతి కిష్టుఁ డగుచు
మంత్రిముఖ్యుఁడనుఁగుమంత్రి గోవిందనం
దనుఁడు కొమ్మన ప్రధానుఁడొప్పు 26

చ॥ ఇల వెలనాటిచోడ మనుజేంద్రునమాత్యత యానవాలుగాఁ
గుల తిలకంబుగా మనిన కొమ్మన ప్రెగ్గడ కీర్తి మాటలన్
దెలుపఁగ నేల తత్క్రియఁ బ్రతిష్ఠితమైన తటాక దేవతా
నిలయ మహాగ్రహారతతి నేటికి నెల్లెడఁ[3]దాన చెప్పఁగన్ 27

సీ॥ రమణీయమైన కూర్మగ్రామమునఁ [4]గుడ
ధాత్రిపురమున గ్రొత్తచర్ల
ద్రిపురాంతకమునఁ,చేర్చిన కొట్యదొన బొగ్గ
రమునఁగళింగరాష్ట్రంబులోని
యెలమంచిలాదిగా నెలమి ముప్పదిరెండు
విష్ణుప్రతిష్ఠలు వెలయఁజేసి
నిచ్చ వేగురుమేదినీసురులకు బంతి
సద్భక్తితోఁబాయసంబు దనర

1.ఘనశాల -లి, 2..బలవేగ రేఖల బదివేల తురగంబులు 3.దార- లి
4.దంతిపురంబున గొంతచెర్ల- లి, గురుదుర్తి పురంబున గొర్తచెర్ల -లి

గీ॥ పంచదారతోడఁ బాటించి యిడుట జ
న్మ వ్రతంబుగాఁగ నడపి చనిన
గుణగరిష్ఠుఁడైన కొమ్మన ప్రెగ్గడఁ
బోలఁగలరె ధర్మపురుషు లెందు? 28

మ॥అరుదందన్ వెలనాఁటి చోడమనుజేంద్రా జ్ఞాపనం బొంది దు
స్తర శక్తిన్ జని యేకవింశతి సహస్ర గ్రామ సంఖ్యాక మై
ధరణిన్ చేర్చిన పాకనాడు నిజదోర్దండైక లగ్నంబుగాఁ
బరిపాలించె నమాత్య కొమ్మన జగత్ప్రఖ్యాత చారిత్రుఁడై 29

క॥ చలముమెయిఁగటకసామం
తులు గరిహయ బహుళసేనతో నేతేరన్
దలపడియెఁగొమ్మసచివుఁడు
బలియుండై క్రొత్తచెర్ల పరిసరభూమిన్ 30

సీ॥ సెలకట్టె వాటునఁ జెలఁగు గుఱ్ఱంబులఁ
గూడ రెంటిని మూటి గుదులు గ్రుచ్చు
[1]బ్రతిముఖంబైన రాహుతుల క త్తళమునఁ
గడిమిమై వీపులు వెడలఁ బొడుచుఁ
[2]బట్టెంపు గొఱియల పగిది నేనుంగుల
ధారశుద్ధిగ నసిధార నఱకు
జదియించుఁ బిగిలించుఁ జేతుల తీఁటవో
వడి కాండమేసి మావటుల తలలు
గీ॥ [3]రాజశిరములఁ ద్రొక్కించు రాఁగెఁ దిరుగ
వాఁగె నుబ్బెడు తన వారువంబు చేత
మహితశౌర్యుండు కొమ్మనామాత్యవరుఁడు
కటకసామంతసేనతోఁగసిమసంగి 31

1.బ్రతిమొగంబగు నరిపతుల కత్తళమున - ము 2.బందంపు - ము
3.తలపుడికిక్రేసి మావంతుతలలు శత్రు-ము



చ॥ అరిగజకుంభ పాటన విహారము కొమ్మనమంత్రి సల్పుచో
నురిలిన మౌక్తికవ్రజము లుర్విపయిన్ బొలిచెం దదీయ సం
గరహత వీరదోర్గ్రహణ కౌతుక సంభ్రమ ఖేచరీ పర
స్పర తనుమర్దనోద్గళిత భాసుర [1]హారమహీచయంబనన్ 32

క॥ ఆ కొమ్మన ప్రెగ్గడ సుతుఁ
డై కేతన చోడ భూవరాత్మజుఁడన ధై
ర్యాకరమగు పృథ్వీశ మ
హీకాంతుని మంత్రి యయ్యె నెంతయుఁ బేర్మిన్ 33

ఉ॥ కౌశిక గోత్ర భూసురశిఖామణి కేతన భూవరుండు పృ
థ్వీశ నరేంద్రు మంత్రి యయి యెల్లెడఁ జాలఁ బొగడ్త కెక్కె నా
కాశనదీ మరాళ శివకాశ సురాశన తారకేశ నీ
[2] కాశ యశోధిరోచి రవకాశ విశాల దశాశుఁడై మహిన్. 34

ఉ॥ కేతన మంత్రి నందనులు కీర్తి వహించిరి బంధుజాత వి
జ్ఞాత వినీతభావుఁడనఁజాలిన కొమ్మన దండనాథుఁడున్
భ్రాతరహర్పతి ప్రతిమ భాసురతేజుఁడు మల్లశౌరియున్
బ్రీత సమస్త సజ్జనుఁడు భీమన ప్రెగ్గడయున్ గులాగ్రణుల్. 35

ఉ॥అందరిలోన బ్రాయమున నారసి చూడఁగఁ బిన్నయయ్యుఁబెం
పొంది గుణంబులందుఁ బొగడొందె ధరిత్రి నమాత్యభీముఁడా
నందము తల్లిదండ్రులు మనంబున నొందఁగ నిశ్చలంబులై
కుందవరాచ్ఛకచ్ఛప [3]ముకుందము లొందఁగ మందిరంబునన్ 36

1.హారవినిస్పృతంబులై- లి
2.కాశతరాధిరోచిరవకాశవికాసయశోవిశాలుఁడై-ము, 3.ముకుందములందము
పెంపుజెందగన్ -ము

సీ॥ క్షితిఁగశ్యపప్రజాపతి మన్మఁడై తాను
బుట్టుట నతనిన పోలు ననుచు
జను లెల్లవారును గొనియాడ నెగడిన
గుండగండాధీశు కూర్మిపుత్రిఁ
బుణ్యలక్షణమూర్తిఁ బోలన మారన
ప్రెగడన లాదిగాఁ బేరు గలుగు
సచివసప్తకముతో జనియించి మునుఁగుల
భూధరంబులతోడఁ బుట్టువు గను

గీ॥ వసుమతీదేవి [1]కెత్తాఱ వచ్చు ప్రోల
మాంబఁబెండిలియయ్యె నన్వయము పావ
నంబు లోకంబు కీర్తిపూర్ణంబు గాఁగ
భీమనామాత్యుఁ డెల్లెడఁ బేర్మి మిగిలి. 37

సీ॥ పుణ్యంపు ముడి మోచు పొలఁతుల కెల్ల నీ
పువుఁబోఁడి యొఁదల భూషణంబు
పతియాజ్ఞ దలనిడి బరియింత గడవని
లలనల కీ యింతి తిలకలక్ష్మి
తొడిపూసి కట్టి బంధుగులకు నిడి యున్న
పడఁతుల కీ పుణ్యభామ యొజ్జ
కడుపుచల్లఁగ మేలి కొడుకులఁబడసిన
సుదతుల కీ చాన మొదలిపేరు

గీ॥ తాల్మి గని, యొప్పుకందువ, తగవు నెలవు
ధర్మముల యిక్క మొగమోట తానకంబు
సుగుణముల తావు వినయంబు చోటనంగఁ
బ్రోలమాంబిక యెల్లెడఁ బొగడ నెగడె. 38

1.కెనయన – ము



చ॥ అతిశయపౌరుషైకపరులై జనియించిరి పుత్రు లిట్టి దం
పతులకు మువ్వు రుత్కట కృపానిధి కేసయ దండనాథుఁడున్
క్షితిధరతుల్యధైర్యుఁడగు కేతనమంత్రియు సర్వసద్గుణా
యతన సుబుద్ధి గుండసచివాగ్రణియున్ నిజవంశభూషణుల్ 39

వ॥ అందు 40

ఉ॥ రోహణపర్వతంబునఁ బ్రరూఢములైన యనర్ఘరత్నసం
దోహము లిట్టి నందనులతోఁదన వృద్ధియు బంధురక్షణో
త్సాహము బ్రాహ్మణోత్తముల ధన్యులఁ జేయు గుణంబు సత్కళా
గేహ విశుద్ధబుద్ధియును కేసనమంత్రికి నొప్పు నెప్పుడున్ 41

వ॥ తదీయానుజుండు 42

ఉ॥ నూతన దర్పకుండన మనోహరమైన సురూప మొంది వి
ఖ్యాతకవిత్వసంపదఁబొగడ్తకు నెక్కి యశేష బాంధవ
వ్రాత హితాత్ముఁడై గణకవర్గ కళామహిమన్ బ్రగల్భుఁడై
కేతనమంత్రి దిగ్భరితకీర్తి వహించె నమాత్యకోటిలోన్ 43

వ॥ తదనుసంభవుండు 44

శా॥ పుట్టెం గుండన బంధుకోటుల తపఃపుణ్యప్రభావంబుతో
బెట్టెం బాదము భూమి నప్రతిముఁడై పెంపారుభాగ్యంబుతో
గట్టెం జీర విరోధిమానవమనో గర్వ [1]ప్రపంచంబుతో
బట్టెం గంటము సర్వదీనభరణప్రౌఢవ్రత ప్రీతితోన్ 45

ఉ॥ భారతి దాది పెన్నిధులు బాలసఖుల్ తొలువిద్య నిశ్చలో
దారత ధర్మకృత్యము లుదాత్తవిభూషణముల్ వివేక వి
స్తారము యౌవనంబు బుధసంగతి పాత్రజనప్రశస్తి ది
క్పూరిత కీర్తితోడి రతిభోగము భీమయ గుండమంత్రికిన్ 46

1. ప్రబంధంబుతో – లి

సీ॥ పుణ్యనదీతీరభూమిఁ దా నిల్పిన
నల్లిండ్ల విప్రగణంబుచేత
సరసకవిత్వప్రసంగతిఁదనుఁబ్రీతి
గొనియాడు సత్కవిజనులచేతఁ
గర్పూరకస్తూరికాముఖద్రవ్యాను
భవవేళఁదనుఁజెప్పు ప్రభులచేతఁ
గాంక్షమైఁదనుఁబొందఁగాంతుమో యని యుప
శ్రుతులు వోయెడు వధూవితతిచేత
గీ॥ దానశక్తి బహుకథా నిపుణత్వంబు
సులభ భోగమహిమ సొబగు పేర్మి
నెగడుచుండ వెలసె జగతీతలంబున
మంత్రిగుండఁడధికమతి గురుండు. 47

శా॥ శైలవ్రాతము వారి సత్త్వములు భాస్వత్ఫేనముల్ తారకా
జాలంబున్ భుజగాధినాయక ఫణాచంచన్మణుల్ రత్నముల్
వేలా సేతువు చక్రవాళగిరి పృథ్వీనాథ సన్మంత్రి చూ
డాలంకార మమాత్యగుండని సముద్యత్కీర్తి దుగ్ధాబ్ధికిన్. 48

సీ॥ వడుగుఁబెండిలిఁ జేయు వయసైన విప్రులఁ
దడయక సేయించుఁ బుడమి నెల్ల
దొడఁ బూయఁ గట్టంగ నిడఁ గల్గునట్లుగా
[1]ఘనకుటుంబులఁ గాఁగఁ గవులఁ బ్రోచుఁ
బాఠకగాయక ప్రముఖుల మన్నించి
యాందోళికాది వాహనము లొసగుఁ
బాటించి [2]కాకుళపతి తిరునాళ్లలో
నర్థుల కేటేట నర్థమిచ్చు

1సహకుటుంబుల కవిజనులఁబ్రోచు-ము, 2.కాకుళేశ్వరు



గీ॥ ధర్మజుఁడు భానుజుఁడు [1]చిత్రంబు గాఁగ
దేహ మేకమై పుట్టిన తెఱఁగు దోఁప
[2]దానమును జారుధర్మంబుఁ దన్నుఁ బొంద
మంత్రి గుండన భీమనామాత్యసుతుఁడు. 49

చ॥ నలువునఁ గాకుళేశు [3]తిరునాళ్లను మేలుగ గుండమంత్రి ని
ర్మలమతి బిట్టు వేగముగ మాడలు రత్నచయంబు చల్లఁగా
నలవడు హేమవృష్టి క్రియ నర్థులు చాతకకోటి గాఁగ లోఁ
గలగొన రాలు ముత్యములు గానఁబడున్ వడగండ్లకైవడిన్. 50

సీ॥ వాచకత్వము లేఖనోచితత్వము నంధ్ర
లిపి యట్ల మహి సర్వలిపులయందు
ఫణితి జాతియుఁ దీవ్రభంగియును దెనుంగు
భాషయట్టుల సర్వభాషలందు
మర్మజ్ఞతయుఁ బ్రౌఢమతియును గణకత్వ
విద్యయట్టుల సర్వవిద్యలందు
వదనవికాసంబు మృదువాక్యమును బంధు
జనులయట్టుల సర్వజనులయందు
గీ॥ మన్ననయును నిర్వంచనమతియు మిత్ర
గణములట్టుల సర్వార్థిగణములందు
ననుట సహజంబుగాని వర్ణనము గాదు
గుండనామాత్యునకు మంత్రికుంజరునకు. 51

క॥ ఈ గుండయ ప్రెగ్గడకును
ధీగుణచింతామణికి నతిస్థిర ధర్మో
ద్యోగరతికి శాస్త్రపురా
ణాగమ దుగ్ధాబ్ధి మందరాచలమతికిన్ 52

1.తొంటితప్పు వాయు- ము,2.దానమును దానధర్మముల్ - ము,
3.తిరునాళులలోపల - ము

వ॥ ఇష్టార్థ సిద్ధియు, నైశ్వర్య సమృద్ధియుఁ బుత్రపౌత్రాభి వృద్ధియుఁ
గా నా రచియింపం బూనిన కథాక్రమం బెట్టిదనిన... 53

## కథాప్రారంభము

క॥ అపరిమిత విభవమై ధా
త్రిపయిన్ బరఁగిన కళింగదేశములో నిం
ద్రుపురమును బోలి యొప్పుం
ద్రిపురీ నగరంబు సంస్తుతికిఁ బట్టగుచున్ 54

క॥ ఉరగ స్త్రీ జలకేళీ
కరణంబులు దేవకన్యకాక్రీడా సం
చరణంబులు తమకమరఁగ
బురికిన్ బరిఖంబు సాలములు నొప్పుఁ గడున్ 55

మ॥నవముక్తా ఫలరాసులున్ రుచిర నానాసన్మణిశ్రేణి శు
క్తి వితానంబులు హేమవాలుకలు నక్షిప్రీతి సంధించుచున్
భువనస్తుత్యములై పురాంగణములొప్పుంజూడఁగాఁ గుంభ సం
భవపీతాంబునిధి స్థలాభినవవిస్ఫారంబులై యెప్పుడున్. 56

చ॥ మిగిలిన వేడ్క నాట్యములు మీఁదటి వేల్పులు చేయఁదన్మృ దం
గగణ నినాదముం దఱచుగా శిఖరంబులఁ బట్టియున్న య
మ్మొగుళుల మ్రోఁతయుం గదిసి మ్రోసిన నొక్కొకమాటు తాళవృ
త్తి గని యెఱుంగవచ్చుఁ బురి దేవగృహంబుల మర్దళధ్వనుల్ 57

.క॥ పురహర్మ్యవిహారిణులగు
తరుణులు వదనములతోడఁ దడఁబడునని పం
కరుహభవుఁడెఱుక యిడెఁగా
కరయంగందేల యిందునందు ఘటించున్. 58



చ॥ అనిశము మీఁదటన్ మెలఁగు నంగనలంగని నాఁడునాఁటికిం
దనికెడు కామవేదన సుధారుచి [1]చల్లని పట్ల ఁగాకయిచ్చెనో
యనఁజంద్రకాంతకృత శీతల నిర్మల చారువేదులం
బెనుపగ రాత్రులందుఁ బ్రతిబింబము లెంతయు నొప్పు మేడలన్. 59

**చ॥ హృదయము లుల్లసిల్లఁ బురినింతులు మేడలనుండి పాడఁగా
నది చవి గ్రోలుచుం బరవశాత్మకయై స్వమృగంబు పెద్దయుం
గదలక యున్నఁ గుంటువడి కాదె మృగాంకుఁడు రేలు గొన్ని కొ
న్ని దిథుల నభ్రవీథి కననిల్చుఁ బ్రభాతము డాసినప్పుడున్. 60**

చ॥ కలితకపోలసాంద్రమదగంధవశభ్రమితాళి మాలికల్
పలుమఱు మీఁద మూగిన బలాహక [2]లోకము గాఁగ శీకరం
బులు బహునిర్ఘరంబులుగ బొట్టుల జేగురు సూర్యకాంతి భం
గులుగఁ బురంబులోన నడకొండల బోలి చరించు నేనుఁగుల్ 61

చ॥ ఒడళులు [3]దాల్చి కానఁబడ నుండెడు గాడ్పులు, దీర్ఘపక్షముల్
విడిచి ధరంజరించు నహివిద్విషు, లర్థినసూక్ష్మరూపముల్
వడసిన చిత్తముల్, చెదరఁ బాఱినవెల్లను గూర్చి యొక్కచో
నిడిన బెడంగు ప్రోగు,లన నెంతయు నొప్పుఁ బురిందురంగముల్ 62

ఉ॥ అత్రిసమాను లర్జున సమాధికశూరులు, దేవవర్ణినీ
పుత్ర మహాధనుల్ విదురపూర్ణగుణుల్,మదనాయుధోపమా
పాత్రము లుగ్రసింహనిభ బాహుబలుల్ దలపంగ బ్రాహ్మణ
క్షత్రియవైశ్యశూద్రగణికాసుభటోత్తము లప్పురంబునన్ 63

---

1.చల్లనిపట్లవిశ్రమించెనొ–ము
2.మై గనుపట్ట–ము 3.కానకుండబడియుండెడు–ము,60 వ పద్యము 'ము' లో చేరలేదు.

చ॥ సరసిజపత్రలోచనల చందనచర్చలఁ బొందుచున్ దలో
దరుల మొగంబు గప్పురపుఁదావులతో సరసంబు లాడుచున్
దరుణుల గట్టి చన్గవలఁ దాఁకుచు ధన్యత తాన పొందఁగా
దిరుగుచునుండు నింపుగల తెమ్మెరల ప్పురిలోన నెప్పుడున్. 64

మ॥ లలనారోహణవాద్యమానబహుడోలాఘంటికానాదముల్
కలధౌతోజ్జ్వల పంజరాకలిత శౌకశ్లోకి కారావముల్
[1] కలకాంచీ ప్రముఖాంగనా భరణ సంఘర్ష ధ్వనుల్ తోడుగాఁ
దలమై యెప్పుడు దుందుభి ప్రభృతి వాద్యస్ఫూర్తి యేఁచున్ బురిన్ 65

చ॥ దలముగ నెల్లప్రొద్దును లతానివహంబుల రాలు పుప్పొడుల్
పులినతలంబులై చెలువుఁ బూనఁగ మీఁదటఁదేలు కేతకీ
దళముల మొత్తమోడలవిధంబునఁ దేలఁగఁ బాఱుఁ బెద్దలై
ఘలరస వాహినుల్ పురియుపాంతవనంబులఁ గొన్ని చోటులన్ 66

వ॥ ఆ పురంబున కధీశ్వరుండు 67

చ॥ దశరథరాము తమ్ముఁ డనఁదాఁ దగు లక్ష్మణు పుత్రుఁడై యశో
వశుఁడగు చంద్రకేతు వరవంశజుడైన మహేంద్రపాలుఁడా
శశింధరుఁ డున్న వీఁడనఁగఁ జాలు ప్రతాపముతో జగం బక
ర్కశుఁడన నేలె; నా నృపతి గాదిలిపట్టి నృపావతంసుఁడై 68

సీ॥ తన కృపాజలధికి ధరణీతలంబుపై
మానవేంద్రులు నీటి మానిసులుగఁ
దన కీర్తి దశదిశాంగనల పాపట పట్టు

1 రావసం, కులముం జంచదమందషట్పదపదీకోలాహలంబుల్ కడున్ దలమై మర్దళదుందుభిప్రభృతి వాద్యస్ఫూర్తి తోఁచుం బురిన్- ము,



లకు [1]ముత్తియంపు సూసకము కాఁగఁ
దన వాలు రిపుసంఘమునకు బంది కవాట
గోద్వారమునఁ [2]గుంచెకోల కాఁగఁ
దన మూర్తి కామినీజనచకోరికలకుఁ
బార్వణచంద్రబింబంబు గాఁగఁ
గీ॥ దనరు నుదయాస్తశిఖరులు దన ప్రతాప
దీపికాస్తంభయుగ్మమై తేజరిల్ల
నెగడె నాదిమహీనాథనిభ మహా ప్ర
భావుఁడనఁజాలు కేయూరబాహువిభుఁడు 69

మ॥ చతురప్రజ్ఞుఁడు చంద్రగుప్తున కిలన్ జాణక్యుభంగిన్ దివ
స్పతికిన్ దైవతమంత్రియోజ సుమనశ్శ్లాఘ్యుండు వత్సావనీ
పతికిం దొంటి యుగంధరాఖ్యుగతి శుంభత్పుణ్యుఁ డమ్మేదినీ
పతికిం బ్రెగ్గడ భాగురాయణుఁడనం బ్రఖ్యాతుఁడిద్ధ స్థితిన్ 70

సీ॥ [3]ఆరోగ్యదేహుఁడాకారవంతుండు వం
శ క్రమాగత సువిస్తారబుద్ధి
ధీరుఁడాఢ్యుండు గంభీరుఁడవ్యసని, ప్ర
జానందకరుఁడు, దయాన్వితుండు,
నిజమర్మగోపననిపుణుండు పరమర్మ
భేదనకుశలుండు, సాదరోక్తి
శీలుఁడాచారవిశిష్టుండు సర్వవి
ద్యా లిపిబాషావిధానజ్ఞుఁడుత్త
గీ॥ మాన్వయుండు శూరుఁడాలస్య రహితుఁడౌ
చిత్యపరుఁడు నిఖిలచిత్తవిదుఁడు

1.పాపటబొట్టు,లకును ముత్తెంపు సూచకము గాగ -ము 2.గోపురద్వారంబు గుంచె గాగ- లి,3.ఆరోగ్యవద్దేహుఁడాకారశాలి వం - ము

భక్తియుక్తి గలఁడు భక్తుండు నెయ్యంబ
నంగ మంత్రిముఖ్యుఁడవని వెలసె. 71

ఉ॥ రాజకళావిశేషవనరాజమరాళి యుపాయసాయక
భ్రాజితచాపశింజిని పరాక్రమసంహృతవైరి భూపతి
శ్రీజనయిత్రి ధర్మపద శిక్షిత వర్తన మేదినీ ప్రజా
రాజగళత్సుధారస తరంగిణి యాతని బుద్ధి యారయన్ 72

శా॥ క్షోణీశోత్తముఁ డైన భూపతికిఁ దేజోరాశికిం దేవియై
యేణీలోచన రత్నసుందరి యనన్ హేలామనోహారి క
ల్యాణాకార సరోజగంధి కుచభారానమ్రతన్వంగి య
క్షీణ ప్రౌఢ వివేక మాన యగుచున్ జెల్వొందు నత్యంతమున్ 73

శా॥ ఆ లీలావతితోడ నా విభుఁడు కామాసక్తిరాగ క్రియా
లోలుండై విహరించు నెప్పుడును సంలుప్తావనీ[1]శార్థుడై
కేళీపర్వత రత్నకందరములన్ గ్రీడానివాసంబులన్
లీలోద్యాన మదాళి సంతమసవల్లీ గేహమధ్యంబునన్ 74

చ॥ నిదుపులు గాని యల్కలను నిండి తొలంకుల నుండు కాంక్షలన్
దడఁబడు కామతంత్రములఁ దప్పు లెఱుంగని తత్తరింతలన్
గడవఁగ లేచి కూటములఁ గప్పెడు చొక్కులఁ గానరెన్నఁడున్
బడతియు మేదినీశుఁడు ప్రభాతము రాకలు రాత్రి పోకలున్ 75

సీ॥ అంగనాకుచమండలాసక్త మై బుద్ధి
భూమండలము దెసఁ బోవ దయ్యె
లలన భ్రూచాపవిలాసంబు మెచ్చులఁ
జాప మెన్నఁడు దృష్టి సైప దయ్యెఁ

1 కామ్యుడై, శౌర్యుడై – ము



దరళాక్షి చూడ్కులఁ దా నాజ్ఞపడి యున్కి
ధరనాజ్ఞ చెల్లించు తగవు మరచె
భామినీరుచిరాంగపరిరంభలోలత
సప్తాంగరక్షణస్మరణ మెడలె

గీ॥ రమణితో సంతతము రతిరాజ తంత్ర
మోహమున రాజ్యతంత్రవైముఖ్యమయ్యె
ధరణివిభునకు రాగాబ్ధి తగవు కొలఁది
గట్టుపడక నానాఁటికి రెట్టిపడఁగ 76

ఉ॥ ఏకరసప్రమత్తుఁడగు నేలిక చిత్తము చూచి గాఢ చిం
తాకులబుద్ధియై తలఁకి యాతని ప్రెగ్గడ భాగురాయణుం
డీ కొఱగాని చెయ్దముల నీ నరనాథునిఁబాప నే క్రియన్
జేకురు నా కుపాయమని చిత్తములోనఁ దలంచు చుండఁగన్ 77

క॥ నానాదేశములకు మును
జూడగఁదా ననుపఁజనిన చారులలోనన్
ధీనిధి ధృతిమంతు డనం
గా నొక్కఁడు వచ్చి సమయకర్తవ్యంబుల్. 78

వ॥ నడపియుండి, యేకాంతంబిచ్చిన వాఁడునుం దన యెఱుగం బోయిన లాటదేశంబునందలి విశేషంబులెఱింగించి మహారాష్ట్రాధి నాథుండగు పరిఘబాహుండు మహాసైన్యంబుతోడఁ దనమీఁద దండెత్తివచ్చుచునికి విని యతని యుద్ధతికి నోర్వలేక లాటేశ్వరుండగు చంద్రవర్మ చింతించుచున్నవాఁడనియుఁ జెప్పి మఱియు నిది యొక్క రహస్యం బెవ్వరెఱుంగనియది యవధరింపుమని యిట్లనియె. 79

21.రమణితోడ సతతరతిరాజతంత్రమోహమున రాజ్యతంత్రవిముఖుఁడయ్యె । నవనిధవుఁడు యోషిదనురాగవారాశి । సోదుముట్ట నోలలాడుచుండి – ము

సీ॥ సచివభూషణ లాటజనపతి యొక కూఁతుఁ
ద్రిభువనసౌందర్యవిభవలక్ష్మి
యగుదానిఁ గని తన యన్వయంబునఁబూర్వు
[1]లేకసంతతి గొడ్డువీఁక యెఱిఁగి
పుత్త్రుఁడంతకుమున్ను పుట్టమి నీ బిడ్డ
[2]పుత్రిగాఁ గెలనికిఁబుట్టెనేని
నిటమీఁద గద్దియ కెవ్వరు దిక్కులే
రని చుల్కఁగాఁ జూతురని తలంచి
గీ॥ తాను దేవియు దాదియుఁ దక్కఁబట్టి
నంతనుండియు నిక్కార్యమన్యు లెఱుఁగ
కుండ సుతుఁడని ప్రోయించె యుక్తి పేర్మిఁ
బెనుపఁ బెరిగి యక్కన్య జవ్వనము చెంది. 80

క॥ ఉనికియు నవ్వనితం బొం
దిన పురుషుఁడు సార్వభౌమతేజోమహిమం
గనునని యొక ముని యేకత
మునఁ దత్పితృజనులతోడ మును జెప్పుటయున్ 81

వ॥ అక్కన్నియ పేరు మృగాంకావళియైయుండ మృగాంకవర్మ యని పుత్రనామంబుగఁ బిలుతు రనియును వినిపించిన మెచ్చి వానికిఁ దగు పసదనం బొసగి వీడుకొలిపి భాగురాయణుండంతట 82

1. లేక సంతతులగుటెరిగి తనకు- ము, 2. నింతిగాఁగెలని వారెఱిగిరేని - ము



శా॥ గౌళీనిర్జరరాజనందనుని బంగాళీముఖాబ్జార్కు నం
ధ్రీ లీలాంగజు ఘూర్జరీ రతికళాదీక్షాసముద్భాసితున్
జోళీలోలవిలోచనోత్పలసుధాంశున్ గుంతలీభద్రు నే
పాళీ నూతనకూచిమారుఁ గుకరీప్రత్యగ్ర పాంచాలునిన్. 83

క॥ పురుషార్థ గుణప్రీతున్
హరిభక్తి సుగంధి మానసాంభోజాతున్
నిరుపమసుగుణవ్రాతున్
ధరణీకల్పద్రుమాభిధానఖ్యాతున్. 84

మాలిని॥ [1]శరధిసమగభీరున్ సర్వలోకోపకారున్
సురుచిరగుణహారున్ సుందరీచిత్తచోరున్
నిరుపమధృతిసారున్ నీతివిద్యావిహారున్
పురుషతను సుమేరున్ బోలమాంబాకుమారున్. 85

గ॥ ఇది సకల సుకవిజనవిధేయ మంచననామధేయ ప్రణీతంబైన కేయూరబాహుచరిత్రం బను మహాప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

1.సకలసుగుణవారున్ - ము. ప్రాసభంగము

# ద్వితీయాశ్వాసము

కII శ్రీ రమణకటాక్ష సుధా
సారవివర్ధిత విశిష్టసంపత్సస్యా
ధారు సదాచారు యశ
స్తారకిత దశాశు గుండదండాధీశున్ 1

మII తన మేనల్లుని సోమదత్తు బహుతంత్రప్రౌఢు ధీమంతుఁ జ
య్యన నచ్చోటికిఁ బిల్చి తేఁబరిచి యేకాంతంబునన్ రాజువ
ర్తనముల జారులచేత విన్నవియు మీఁదన్ దారు సేయం దలం
చిన కార్యంబులు సెప్పె సస్మితరుచి శ్రీవక్త్రుఁడై వానికిన్ 2

వII చెప్పి మఱియును 3

కII మతియుతుఁడు గాఁడె లాట
క్షితిపతి యిటు కార్యగుప్తి సేయఁగ వలదే
మతి యింత లేక బహుజన
పతి నయ్యెద ననుట పిన్నపనియే తలఁపన్. 4

వII అనవుఁడు సోమదత్తుఁ డా సచివోత్తమునితో నిట్లనియె. 5

కII పొసఁగఁ బరికింప నేర్చిన
వసుమతిపై బుద్ధి గలుగు వారుం బ్రాఁతే
యసదృశ [1]మది "బహురత్నా
వసుంధరా" యనుట నేటి వచనమె చెపుమా 6

కII ఏల వెఱఁగంద నొకరుని
పాలిటిదే బుద్ధి; వైశ్యబాలిక వినవే
ప్రాలసరి తైల మమ్మియుఁ
దా లాభముఁ గొనదె తొల్లి దద్‌జ్ఞులు మెచ్చన్ 7

1. గుణ – ము.



వII అక్కథ యొకించుక యవధరింపుమని యిట్లనియె. 8

## నూనెవాని కథ

కII కాంచీపురమున నొకరుఁడు
కాంచనగుప్తుఁడను బుద్ధిగల వైశ్యుఁడని
ర్వంచనుఁడు సుతున కరయం
బంచెం బరిణయముసేయ బాలికనొకతెన్ 9

చII పనిచిన వారు వైశ్యకులబాలలఁజూచుచు నప్పురాంగణం
బున నొకక్రేవ నొక్కరుఁడు మూటెఁడు బియ్యము దెచ్చి నూనె సం
త నిలిచి ప్రాలతోడి సరిధారణ నూనియ పోయుఁడన్న నా
తని పలుకెవ్వరున్ వినక తద్దయు నవ్వుచుఁ గేలిసేయుచున్. 10

కII ప్రా లెడు మానికలకున్
దైలము మానెఁడు పురమ్ముధారణ [1]యిది దాఁ
బ్రాలసరి తైలమడిగిన
జాలియ యగుఁ గాక నీకుఁజము రే లబ్బున్. 11

కII అని పలుక మఱియు నడుగం
గని యచ్చటనున్న వైశ్యకన్య యొకతె యా
తనిఁజీరి కలదు నూనియ
కొనియెదవే నీవు ప్రాలకును సరిలెక్కన్. 12

వII అని పలికి చేర వచ్చిన యతని మూట విడిచి బియ్యము లెస్సయ
విగాఁ జూచి వానితో మఱియు నిట్లనియె. 13

1. గలుగన్ – ము,

కII ప్రాలొక్కటఁ గొని దానన
తైలము దిగువాఱఁ బోయుదానను నీకుం
[1]బోలినటులైనఁ గొలువుము
చాలము నీతోడఁబిదప జగడములాడన్ 14

వII అను పల్కులకు వాఁ డొడంబడుటయు 15

గీII పళ్లెరంబు తెచ్చి పటుబుద్ధి బియ్యంబు
దానినిండఁ గొని ముదంబుతోడ
నందపోసెఁ దైల మంచులు దిగువాఱ
నవ్విధంబు మెచ్చు లావహింప 16

కII కని కాంచనగుప్తునకున్
వినిపించిరి [2]వారివారు వేగమ యాతం
డును దద్బుద్ధివిశేషము
గొనియాడుచు దానిఁ దనకుఁ గోడలిఁ జేసెన్. 17

వII కావున మతిగలవారు లోకమున లేకుందురే యని సోమదత్తుండా సచివోత్తముతోడ మఱియు నిట్లనియె. 18

### తాత్కాలికమతి కథ

కII మతి గలిగియుఁ దాత్కాలిక
మతి గలుగక యుండినన్ బ్రమాదము వచ్చున్
మతిమద్వర తాత్కాలిక
మతిఁ గాదే [3]దక్షునకుఁ బ్రమాదము దలఁగెన్ 19

వII ఆ కథ యెట్లనిన 20

1. బోలినబ్రాలంగొలువుము – ము, 2..యతనివారు – ము,
3. దక్షుడొక – ము



కII క్షురికాపురమున నొక భూ
సురతిలకుఁడు దక్షుఁడనఁగ సులభవివేక
స్ఫురణుండయ్యును దోషా
కరమగు యౌవనముచేతఁ గాముకుఁడయ్యెన్ 21

కII అతని పొరుగింటియంగన
యతిశయసౌందర్య దాని యధిపతి శస్త్రా
న్వితుఁడుగ్రుం, డట్లైనను
ధృతిమదనుఁడు చెఱుపఁ గోర్కి తీగలుసాగన్ 22

కII [1]ఆ వాలుఁగంటి యెదిరిన
నావల నంగనయు మ్రొక్కు నిట్టులు మ్రొక్కం
దా వికృతిచేఁత నితరుల
చేవిని యక్కాంతమగఁడు చిత్తము గలఁగన్ 23

చII అరసెదఁగాక యివ్వెడగు నాగడ మంచు వసించె నంగణాం
తరమున గోడమాటువడి దక్షుఁ డెఱుంగక యుండె వాని సుం
దరి పనివెంట నద్దెసకుఁ దాఁ జనుదేర నిజేచ్ఛ నాత్మమం
దిరమున నుండి యా వెలఁది [2]దిక్కునకై చనుదెంచి యాతఁడున్

ఉII ఎప్పటియట్ల యింతిఁగని యేడ్తెఱ మ్రొక్కిన దాని వల్లభుం
డప్పుడ దిగ్గనన్నెగసి యచ్చటఁ దోచిన వాఁడు దిట్టఁడై
తప్పక యన్ని దిక్కులకుఁ దాఁవెస మ్రొక్కి ప్రదక్షిణంబుతోఁ
జప్పుడుగా జపించుచును జండమరీచికి మ్రొక్కెఁ బల్మఱున్ 25

1.ఆ వాలుగంటి యొంటిగ। సేవల మెలఁగినను మ్రొక్కు నిట్లాధూర్తుం। డావిప్రుచేత యితరుల । చేవిని యక్కాంతమగ డు చిత్తముఁగలఁగన్ – ము, 2.దిక్కునకుంజని యంత దక్షుఁడున్ – ము.

కII అది జపముతోడి మ్రొక్కని
పొదలిన కోపంబుఁ దొలఁగిపోయె భటుండి
ట్టిద తాత్కాలికమతి సం
పద లిడు యాపదలయిన చోట్లఁ బ్రజ్ఞానిలయా 26

### పులిచేతఁ జచ్చినవాని కథ

కII మతి లేనివాఁడు విద్యా
న్వితుఁడయ్యును మేలు వడయనేరఁడు విద్యోన్న
తుఁడయ్యుఁ దొల్లి గార్గ్యుఁడు
హతుఁ డయ్యెంగాదె విమతియై పులిచేతన్. 27

వII అక్కథ యెట్టి దనిన 28

కII గార్గ్యుఁడను విప్రుఁడొక్కఁడు
దుర్గారాధనముఁ బెక్కుదొసఁగులు పడుచున్
దుర్గాటవిలోఁ జేయ ని
రర్గళదయ దన్నుఁ జూచి యా యంబికయున్ 29

కII వర మడుగుమనిన మ్రొక్కుచు
సరభసమగు కాంక్షతోడ సంజీవని ని
ర్భరకరుణ నాకు నొసగుము
పరమేశ్వరి యనినఁ గొన్ని పచ్చని యాకుల్. 30

చII తలఁచినమాత్ర నాత్మకరతామరసంబున నున్నవానిని
మ్ములఁ గృపసేసి వీని రసమున్ [1]బిడువన్ గసబంబు చర్మ మె
మ్ము[2]లెఱచి ప్రాణముల్ గలిగి ముందటి రూపువహించి జీవముం
బలమును గల్గి పూర్వగుణభంగిన[3] వర్తన మొందు నెల్లెడన్ 31

1 బయిపై చిలికింపగా శవ,మ్ములకును- ము, 2. యెద్దియేని తగ - లి,
3.చరించుట కల్గునెల్లెడన్ -ము



కII ఎండవు తఱుఁగవు నివి యని
చండిక పొడఁగానరాక చనుటయు మదిలో
నిండిన సంతసమున వి
ప్రుండవి కొని యాత్మపురము పొంత నొకండున్ 32

చII చనునెడ నిర్మనుష్యమగు చక్కటి నప్పెనుఁగాన నెండిపో
యిన యొక పుండరీకశవ మీరము వెల్పలనున్నఁ జేరఁగా
జని తనకున్న యౌషధముశక్తి నిజంబును జూడ వేఁడి చే
త నలఁగఁజేసి యా పసరు దానిపయిన్ బిడిచెన్ విబుద్ధియై 33

చII పిడిచిన నేమిచెప్ప నతిభీకర దుస్సహపుండరీక మ
ప్పుడ తన నిద్ర మేల్కనినపోలిక మ్రోగుచు బిట్టు లేచి య
వ్వెడఁగగు విప్రుఁ గూయిడఁగ వ్రేసి మృతుండుగఁజేసి మ్రింగె మే
ల్పడసియు బుద్ధిచాలని యభాగ్యులు తత్ఫల మందనేర్తురే? 34

కII మతియ కళాకృషి బీజము
మతియ తన ఫలప్రదక్షమాజము తలఁపన్
మతియ చెలి, మతియ చుట్టము,
మతిహీనులు మెలఁగి యాడు మ్రాఁకులు ధాత్రిన్ 35

వII అని పలికి తన్మతిం బ్రశంసించి తత్ప్రసంగం బట్లుండ నిమ్మని తమరాజు వర్తనంబుఁ దలంచి చేయవలసిన కార్యంబు సేయం దలంచి సోమదత్తుడుఁ మాతులునకిట్లనియె. 36

కII ఏ రసమున కెవ్వఁడు ప్రియుఁ
డారసమునయందు [1]చొచ్చి యభినవరుచి వి
స్తారము పుట్టించిన మును
జేరిన దెస విడిచి [2]మనము సేరు నవలకున్ 37

1. దేల్చి, 2.యెరగుఁజిత్తం బొకటన్

కII [1]వాటమగు దేవిదెన మద
నాటోపము భూమిపతికి; నతిశయ రూపన్
జోటింజూపి మనంబా
రాటపడంజేసి కాని రాదుడిగంపన్. 38

కII కావున నిచ్చటికి మృగాం
కావలిఁ గొనివచ్చి చూపి యధిపు మనంబున్
దేవిమనము నూటాడం
గా వేగమ చేయవలయు గాఢవివేకా! 39

వII అటమీఁద నక్కన్య వరించి మన రాజు సార్వభౌమత్వముఁ బొందు నీ యుపాయంబు మనకు నపాయవిమోచనంబును శ్రేయస్కరంబును నగుట దీనింగడవం కార్యంబొండుగలదే యక్కన్యకారత్నంబు రప్పింప మనకిదియ సమయం బది యెట్లనిన నా రాజు రత్నసుందరి పినతల్లిభర్తయగుట బాంధవంబు దోప నతనికి సహాయులం దగినవారలఁగొండఱంబుచ్చి పరిఘుబాహుతోడ యుద్ధంబునప్పుడు నీ పుత్రుండగు మృగాంకవర్మ నచట నుండవలవదిట పుత్తెంచునది యని దేవిపేరి లేఖలు పుత్తము. నతండును సంతసిల్లుచు నిచటికిఁ బుత్తెంచు మన మతనికిఁ బ్రియముచేసిన వారమపోలె మన కార్యంబు నిర్వహించుకొందమని మఱియు. 40

కII నయవంతులు నిజకార్య
ప్రయోజనములకును జేయు పను లన్యులు మా
కయి సేసిరి వీరనుచుం
బ్రియ మందఁగఁ జేయుదురు భరితకౌశలులై. 41

1. మాటలు పెక్కేటికి,మదIనాటోపము భూమిపతికి నతిశయముగ మేల్ I జోటిఁ గనఁబఱచి మనసాIరాటపడంజేసికాని రాదుడిగింపన్ –ము.



## చతురిక కథ

కII ఇతరులు తనవలనఁ బ్రమో
దితులై యుండంగఁ దాను దిట్టతనముతో
మతిఁ దన కార్యము నడపిన
[1]చతురికకథ వినిన నట్టి చందము దెలియున్ 42

వII అక్కథ యెట్లనిన 43

సీII విదిశాపురంబున వికచాంబుజానన
చతురిక యనునది చాల వాసి
గల వారకామిని గలదు; దానికి నల్ల
నగరమేలెడిరాజు, నగరి బచ్చు
కొడుకర్థపాలకాఖ్యుఁడు, మంత్రిపుత్రుండు
బహుతంత్రుఁడను పేరఁబరగువాఁడు
తలవరి యగు దండధారుండుఁ బాతాళ
ఖనికాభిధానంబు కలుగునట్టి
గీII చోరుఁడొకరుఁడు బొజుఁగులై భూరిధనము
లొసగ సిరిఁబొంది నలువుర యుల్లములను
దాను దక్కంగఁగొని వారు తమక తమక
కూర్చునన నత్తలోదరి నేర్చి మెలఁగు 44

శాII ఆ రామాతిలకంబు కూరిమి సఖుండైయుండు నవ్వీటిలో
నారీనాయక సంధివిగ్రహ విధాన ప్రౌఢసాచివ్య సం
చారైక ప్రవణుండధిష్ఠిత మహాసాధుత్వ వేషుండు మం
దారాఖ్యుండగు విప్రుఁడొక్కరుఁడు మేధాభూషణుండెల్లెడన్ 45

1.చతురికకథ వినవె యిట్టిచందము తెలియన్ – ము.

కll అతఁడా చతురిక విటజన
చతుష్క చిత్తములు దన వశంబగు గతి స
మ్మతిఁజేసి వారి యిష్టా
ప్తత నొండొరు నెఱుఁగనీక తా నటియించున్ 46

వll ఇట్లు వర్తించుచు నమ్మందారుండొక్కనాఁడర్థపాలనాఖ్యు మందిరంబునకుంబోయి యేకాంతంబున నిష్టాలాపగోష్ఠి నడపు సమయంబున 47

కll అతనికిఁబరమాప్తుండై
చతురిక నీవలన గూర్మి చాలగలుగ [1]గాంచితి
వేయన వెంటనె వాఁడతి
శయరాగాంధబుద్ధియై యిట్లనియెన్ 48

ఉll ఎన్నఁడుఁ జేర నీదొరుల నే జనుదెంచినఁబ్రీతితోడ న
త్యున్నతమైన మచ్చుపయినుంచు మహోజ్జ్వలరత్నభూషలన్
మున్నొకనాఁడు దాల్ప నివి మోదముతో ధరియించివచ్చు నా
[2]యున్నెడకింతి, నావలన నూనిన ప్రేమముఁ జెప్పనేటికిన్. 49

వll అనుటయు నవ్వచనంబులు విని మంత్రిపుత్రుండగు బాహుతంత్రుండున్నయెడకుంజని యర్థపాలకు నడిగినట్ల యడిగిన నతండమ్మందారుతో నిట్లనియె. 50

శాll పాడున్ వీనులకింపుగాఁగ, నను దాఁబాడించు, జూదంబునా
తోడన్ వేడుక నాడు, నూతనకథాస్తోమంబు నాచే వినున్,
గ్రీడాపుష్పవిభూషణప్రకర మర్థిన్ నన్నుఁ జేయించు, నా
కై డక్కెన్ గమలాక్షి యేమిటికిఁ బె క్కాలాపముల్ నెచ్చెలీ! 51

1. చేసితివట నిజమా యనవుడు నతిశయ - ము
2. ఉన్నెడ ..... మానని - ము, యతిభంగం.



వll[1] అనియె నట్ల యొక్కసమయంబున దండధారునడిగిన నతండత్యాదరంబున నమ్మందారుతో నిట్లనియె. 52

కll పొరుగింటికి వచ్చు సితాం
బురుహేక్షణ యేను జెప్పిపుచ్చినయపుడె
[2]వ్వరివలననుండియైనను,
నెరవే నావలన నెయ్యమేటికి నడుగన్ 53

వll అని పలికిన విని యట్లు యింకొకనాఁడు పాతాళఖనికు నడిగినఁ బొంగుచు వాఁ [3]డచ్చతురికాసఖునితో నిట్లనియె. 54

కll ఏ నిద్రఁ జెందునంతకుఁ
[4]గానొల్లదు నిదురఁబొందఁగా నెపుడున్
మేను తన మేనితోడం
బెనుచుకొనుం దెఱవ కూర్మిపెంపేలడుగన్ 55

వll అనియె నట్లందర పలుకుల తెరంగులు సంతసంబులు నెఱింగి కొని తనలో నవ్వుచు మందారకుండొక్కనాఁడు రహస్యస్థానంబునఁ జతురికతోడ నిరర్గళ[5]స్వైరాలాపగోష్ఠి నడుపు సమయంబున నిట్లనియె. 56

కll నా కొక సందేహము గల
దోకోమలి నిన్నుఁ బొంది యుండెడి విటుల
స్తోకవివేకులు నలువురు
నీ కెవ్వరియందు వలపు నిక్కము చెపుమా 57

1. నావుడు మందారుండును నచ్చోటుఁగదలి యింకొక సమయంబున దండధారునింటికింబోయి వానినట్ల యడిగిన నతండిట్లనియె - ము,2. వ్వరుగాని బిలువగా వ.త్తురె యింటికి జెపుమ వారతోయజనేత్రల్, 3. దానొల్లదునిద్రదాల్పఁ దానప్పుడు నా.మేను తన మేనితోడం । బెనికొనుం దెఱవ కూర్మిపెంపేలడుగున్ - ము, 4. డమ్మందారుతో -ము, 5. క్రీడాలాప.

కII అనుటయుఁ జతురిక నీ వెఱు
గనివాఁడవ పోలె నడుఁగఁగాఁదగదందె
వ్వనియందు నేల తగులుదు
ధనముకొఱ కొనర్తుఁగాక దట్టపుఁబ్రియముల్. 58

వII అని మఱియు నిట్లనియె 59

సీII మిన్నక యొకనిపైఁ గన్నులు వొలయించి
యరగంట నొకని నెయ్యమునఁ జూచి
చెన్నార నొకనిపైఁ జిఱునవ్వు చిలికించి
యలరుచు నొకనిపైఁ బలుకు వైచి
యొకని నీ విటురాక యోర్వరమ్మని పుచ్చి
యొకనిఁగూటంబున నోలలార్చి
యొకనిఁ గూటమియాన ప్రకటించి నమ్మించి
[1] యాసమై నొకనికి బాసచేసి
గీII తన్ను వారందఱును జాలఁదగిలి యిచ్చుఁ
దమక తమక తక్కినదని తలఁచుకొనఁగ
నెవ్వరికిఁ దాను గూర్పక యెల్లభంగి
ధనమునక కూర్తు నిది వారవనిత చొప్పు 60

వIIఅనుటయు నమ్మందారుండట్టైన నర్థపాలునకెట్లు కూర్చితివని యతండు సానురాగుండై తనకుంజెప్పిన పలుకులుంచెప్పినం విని చతురిక యతనిచేఁ జఱచి నవ్వుచు నిట్లనియె. 61

కII మచ్చెక్కింపుదు వానిని
నిచ్చెన యిడి తొలఁగఁబుచ్చి నెమ్మదితోనే
ప్రుచ్చిలి క్రిందటి యిండ్లన్
విచ్చలవిడిఁ బిలుచుకొఱకు విటుల నితరులన్ 62

1.పాటించి యొకనికిఁబాస చేసి - ము.



గీII వాని పిలుపునాఁడు వరరత్నభూషణ
వ్రజము బూనుటెల్లవాఁడు రత్న
శుద్ధి యెఱుఁగునట్టి సొన్నారి కపటంబు
గాన వాని దాల్తు వానియొద్ద 63

కII అనుటయు నది కపటంబై
నను నయ్యెం గాక మంత్రినందనుతో నీ
వనురాగ విహారంబున
నెనయుటయది కూర్పకుండుటే యబ్జాక్షీ. 64

వII అని యతఁడు చెప్పిన పలుకులెఱింగించిన మందారునితోఁ జతురిక యిట్లనియె. 65

గీII వాఁడు ప్రోడ గాన వానిచే మేలైన
కళలు నేర్తు; నాకుఁగళల నేర్పు
గలుగు వానితోడఁ గవయనొల్లక ప్రొద్దు
జరుపుటకును నదియ వెరవు గాన 66

కII అనుటయు నది యగుఁ బో నీ
వనురాగాధీనవై పరాలయమునకున్
జనునదియుఁ గూర్పనిది యే
యని చెప్పెను దండధారు నాలాపంబుల్ 67

వII విని చతురిక యిట్లనియె. 68

ఉII చోరుఁడొకండు నా విటుఁడు సూడఁగ నచ్చట వాని మిత్రుల
చ్చోరకసాధనంబులను జూచినయప్పుడు దండధారుచే
దారుణదండపాత మగుఁదథ్యము గావున వాని మద్గృహ
ద్వారముఁదూఱనీక తలవాకిటి యిండ్లక పోదు నెప్పుడున్ 69

క॥ బలవంతుఁడైన మిండఁడు
నిలయములో నున్నవాఁడు నినుఁ గూడకయే
నిలువంగఁజాలనని చని
పలుమఱుఁబొరుగిండ్ల వాని [1]బసలం బఱుతున్. 70

వ॥ అనిన నది కార్యార్థకృత్యంబైనను నయ్యెంగాక యిది నిక్కంబు
నెయ్యంబు గాదే యని పాతాళఖనికుపలుకులు వినిపించిన నవ్వుచు
నమ్మందారుతోఁజతురిక యిట్లనియె. 71

ఉ॥ వానికి ముందఱే నిదుర వావిరిఁ బోయిన వాఁడు దొంగ కాఁ
డే నిలయంబులోని ధనమెల్లను [2]దేవుకపోఁడె మేనితో
మేనయి చుట్టుకొన్న మును మేల్కొని వాఁడు చరింపఁగాదు మే
ల్కొనగ నుపాయ మొండొకటి గల్గనె నాకిది గాక చెప్పుమా

వ॥ అనుటయు మందారుండివియున్నియు నిట్లగుంగాక
వారాంగనలయందుఁ గూరిమి యెవ్వరియందు లేదే యనినఁ
జతురిక యిట్లనియె. 73

క॥ కూరిమి లేదని పల్కుట
నేరమ యెవ్వారికైన నెయ్య మొకదెసన్
జేరక దక్కదు కపటపు
కూరిమి తఱచడగి యుండు కూరిమి యొకచోన్ 74

క॥ కలువని వలవని ప్రియునెడ
కలిగించు కొనంగ వెరవు కలిగినటులు లో
గలిగిన నెయ్యము ప్రియులకు
వెలిదోపగనీరు సూవె వెలఁదులు తాల్మిన్ 75

1.వచనముఁదీర్తున్ - ము. 2.దొంగిలకుండ మేనితో-ము,



వ॥ [1]అని యెఱింగించెఁ గావున 76

క॥ తనకొఱకై యా చతురిక
యొనరించిన పనులు కూర్మి యుపచారములై
కొని యర్థపాలనాదుల
మనముల నలరించె నేర్పు మఱిఁ దెలిసితివే. 77

క॥ కావున మనమును మనకొఱ
కై వేగమ చంద్రవర్మ కతిమిత్రులమై
యా విభుని కూతు నిచటికిఁ
దేవలయుం గార్య మిదియ ధీమత్ర్పవరా! 78

క॥ అని యిట్లు తనకు నల్లుఁడు
వినిపించిన నీతివాక్యవివరణ మెదఁ జే
[2]కొని మెచ్చు చెప్పి యతనిన్
బనిచెన్ దోడ్తేర లాటపతి కూర్మిసుతన్. 79

సీ॥ వాడును జని వేగ వానిఁ దోడ్తెచ్చిన
యక్కుమారికఁ దన యాలయమున
విడియించుకొని లాటవిభుఁడు పుత్తెంచుడు
నాతని సుతుఁడు మృగాంకవర్మ
చనుదెంచె నతఁడు మీ యనుజుండు గావున
వేఱొకతావున విడియుట నుచి
తంబని మా నివాసంబున విడియించు
కొన్నారమని దేవి కున్నతప్ర
గీ॥ మదముగాఁ జెప్పి పుచ్చి యమ్మంత్రివరుడు
దేవి పరిచారికలలోన దృఢవివేక
యగు కళావతి నాత్మకార్యానుకూల
భావ యగునట్లుగాఁ బొందుపడఘటించి 80

1.ఈ వచనంలేదు-ము, 2 కొని భాగురాయణుండును - ము.

వ॥ఆ మృగాంకావళి విధంబెఱింగించి యక్కన్నియకుంజెలియవై వర్తిల్లునట్లుగా బహుమానపూర్వకంబుగా నిలిపె నట్లక్కార్యంబు సమాధానంబగుటయు 81

ఉ॥ అంతటిలోన నొక్క మత మాత్మఁ దలంచి యపూర్వశిల్పధీ
మంతులఁజేయఁబంపె నసమానముగా నొకహర్మ్యరత్న మ
భ్యంతరమందిరంబునకు నావల దవ్వుల భాగురాయణుం
డెంతయుఁ గ్రొత్తలాగుగ మహీతలభర్తకుఁబవ్వళింపఁగన్. 82

వ॥ అది సుషిరకుడ్యస్తంభయంత్రంబగు గృహంబవ్విధంబు రాజు మొదలుగ నెవ్వరునెఱుంగరక్కాలంబున కాయితంబైన జగతీనాథుండభినవంబును మనోహరంబును నగుట నంద నిద్రించు చుండు నంతకొక్కనాఁడు. 83

గీ॥ రాజ్ఞి దాదికిఁ బుత్రియుఁ బ్రాణసఖియు
నైన మేఖల నర్మప్రధాన పుత్రి
రాజునెచ్చెలి యైన చారాయణాఖ్య
విప్రుతోఁ గలహించిన విధమెఱింగి. 84

క॥ మకరందికయును సుమతియు
సుకుమారియు ననఁగ రత్నసుందరి పరిచా
రికలు నగరిలో ముువ్వురు
నొకచో నేకాంతగోష్ఠి నుండియుఁదమలోన్. 85

వ॥ చారాయణ మేఖలా వివాదప్రసంగంబులగు మాటలాడుచుండ నందు సుమతి యిట్లనియె. 86

క॥ మొగమోటగరిమ మడఁకువ
తగ వుచితము తెలివి మెలపు తాలిమి యివిలో
నగు సుగుణంబులు వలవదె
నగళ్లలోఁదిరుగు పరిజనంబులకెల్లన్ 87



క॥ పోరఁదొడంగిరి కంటిరె
చారాయణమేఖలలు విచారింపరు ధా
త్రీరమణు నెదుటఁబడినను
[1]నే రూపయినఁ గినుక పుట్టదే యిరువురకున్ 88

క॥ నైజగుణంబగు తన మది
రాజసమప్పటికిఁ గప్పి ప్రజతో నయ్యై
యోజఁజరించిన యంతనె
రాజులు సాధులని తలఁపరా దెవ్వరికిన్ 89

క॥ చలమున సన్నపుఁగార్యం
బులకై తమలోనఁ బ్రజలు పోరినఁ బతియు
క్కలుఁడైనఁబడదె వాదం
బుల శశముఁ గపింజలంబుఁ[2]బోలిన భంగిన్ 90

## శశకపింజలముల కథ

వ॥అక్కథ యెట్లనిన 91

క॥ నర్మదతటమున హింసా
[3]కర్మం బొరులెఱుఁగఁ జేయకయ ప్రథితతపో
నర్మమునఁ జరించుఁగపట
ధార్మికమొక్క పులి యొక్క తరువు నెలవునన్ 92

వ॥ఇట్లు వర్తింపుచుండ నొక్కనాఁ డవ్వనంబున మృగంబు లెల్లఁ బెద్దయు నమ్మి తమ్ముఁ బరిపాలించుట వేడిన నదియును హింసా ధర్మంబున దండనంబొనరింపంగాని న్యాయాన్యాయంబులు నిర్ణయించి మిమ్ముఁ దగుభంగి శిక్షింపఁగలవాఁడననియె నవ్విధం బట్లు చెల్లుచుండ నొక్కనాఁడు. 93

1.నేరక యటు -ము, 2. బొలసిన - ము,3.కర్మంబొరులెరుగకుండ కాపురముండున్, ధర్మమున చరించు ...తరుకుంజమునన్ -ము.

కII ఒక్కయెడన్ దమలో నొక
బొక్కకు వా దడిచి శశకముఁ గపింజలమున్
గ్రక్కునఁ బఱతెంచి పులికి
మ్రొక్కుచుఁ జని వారి వాదములు చెప్పుటయున్ 94

వII ఆ వ్యాఘ్రంబు వానితోడ 95

గీII ముదిసినారము గావున మున్నువోలె
శ్రవణములు దూరమున విన శక్తి లేదు
కదియఁ జనుదెంచి చెప్పుఁడు కార్యమనుడు
నవియుఁదేకువమాలి డాయంగ నడువ. 96

కII ముందఱికాళ్లం గొని యా
[1]కుందేలుంగ్రైఁదుబట్టికొని గొంతుక గో
ళ్లందగివాని విఱచి భక్షించి య
మందప్రీతిఁ బులి శౌర్యమున నుండెన్ 97

వII కావున 98

కII అలఁతులగు కార్యములు ఘన
ములుసేసి చలంబుపేర్మిఁబోరఁగ నది రా
జుల చెవులఁబడిన నిరుదెఱఁ
గులవారికిఁ జాలఁగీడగుట సందియమే. 99

వIIఅని యిట్లు సుమతి యెఱింగించినకథవిని మకరందిక యిట్లనియె. 100

1. కుందేలుంగఱచి భక్షించి యమందప్రీతి బులిశౌర్యమతమై యుండెన్ -ము.



కII పో రొప్ప దెందు నల్పులు
పోరిన నది బలిసి యంత వోవక విపదా
ధారమగుఁ దొల్లి తొండలు
పోరిన జనులకును బాధ పుట్టినభంగిన్ 101

**తొండల కథ**

వII అక్కథ యెట్లనిన 102

సీII మాణిక్యసేననామకు డొక భూపతి
జైనుల దెస భక్తి చాలఁగలిగి
యడవికిఁ జొరుదల యగుచో నగాధ స
లిలమగు నొక తమ్మికొలనిపొంత
వారికి వసతులవ్వారిగానట సమీ
చీనంబులుగ నొప్పఁజేయఁబనిచి
సకలపదార్థసంచయములు నటఁబుచ్చి
యందు వారుండెడునట్లు చేసి
గీII తమ యనుష్ఠానములకది తగిన యేక
తంపునెలవు మనోహరస్థలమునగుట
వారు నిజదర్శనోచితవర్తనముల
నుల్లములు సమ్మదముఁ బొందియుండునంత 103

మII ఒకనాఁడచ్చటి నీరజాతవనతీరోపాంతకుంజంబునం
దొకచోఁ దొండలు కాటులాడుటయు నందొక్కందు విశ్రాంతికో
ర్వక యొక్కం దది వెంటరాఁ బఱచి యే వంకంజొరంజోటు గా
నక కాంతారమదేభ మా కొలనిలోనన్ గ్రుంగి కూలంబునన్

కII తిరుగాడుచుండఁగాఁ గని
కరము భయభ్రాంతమగుచుఁ గరివరకర్ణాం
తరవివరములోనికి నొక
తొరటముగతి సరటమంత దురదురఁదూఱెన్ 105

మII అది ఘీంకారముఁజేసి కే ల్విదిరుచుకొంచంభోజషండంబును
న్మదభంగిన్ బలుమ్రోఁతతో వెడల పల్మాఱున్ మహాఘీంకృతుల్
సెదరన్ వెండియుఁ దొండమున్ విదిరుచుచున్ శీఘ్రంబ పెన్మాకులుం
బొదలుం గూల్చుచు బాఱి జైననిలయంబుల్ సొచ్చె నుగ్రాకృతిన్

ఉII కొమ్ముల నూది కుడ్యములఁ గూలఁగఁ ద్రోచియుఁ గేల వీటతా
టమ్ముగ నీవలావలఁబడన్ సదనంబులు వైచియున్ మహో
గ్రమ్ముగ డాసి యున్న కరిఁగన్గొని గుండెలు జల్లనంగ హ
స్తమ్ములుఁ గుంచియల్ విడచి తల్లడమెక్కుడుగా వడంకుచున్

ఉII ఒండొరుఁ దాఁకి జైనముని యూథము కుత్తుకదాఁక వట్టి నో
ళ్లెండఁగఁ గాళ్లు తొట్రువడ నేదెసఁ బాఱఁగలేక కూయ వే
దండము సేరి కొమ్ములఁ బదంబులఁ దొండమునన్ వధించినన్
దండములయ్యెఁ బీనుగులు ధారుణిఁ గాలువలయ్యె నెత్తురుల్

గీII అట్లు జైనుల వధియించి యచటఁ గడమ
వడిన వసతులు వడఁద్రోచి వారణంబు
కొలను సొచ్చి సరోరుహకులము నెల్ల
[1]దారుణక్రీడ భంజించి దరికి వచ్చి 109

కII సరసీజలముల నిండన్
[2]గరమునఁబట్టి బలమారఁగా విదిరుచుటయున్
సరటంబల్లంతన పడెఁ
గరి పూర్వస్థితిని దగినగతి సుఖియించెన్ 110

1.మరల భగ్నముఁ గావించి - ము,2.గరమునబూరించియోరఁగాబడి చెవిలోఁ గురిపించిన దల్లడపడి। సరటము బైటపడెఁగరియు సమ్మదమందెన్,-ము,



గీII అల్పులొనరించు దుష్కలహంబుగూడఁ
జేరువైయున్న ఘనులకుఁ జేటు దెచ్చు
సరట కలహంబు చేరువై సమసినట్టి
వారణము జైనకులము కాసారమట్లు 111

కII పోరెడుసరటంబులకున్
జేరువయై యునికి బాధజెందిరి జైనుల్
వారణమును గాసారము
నారయఁ జేరంగఁ జనదు నట్టి కలహులన్ 112

కII కరమిడి యుండఁగ దాని వి
వరములయందొకటి భీతివశసంభ్రమతిన్
సరటంబు సొచ్చి వడి సిం
ధురము శిరంబునకునెక్కి దురదుర నరిగెన్ 113

వIIఅని మకరందిక యెఱింగించిన కథ గడుఁగొనియాడి సుకుమారిక
యిట్లనియె. 114

కII అలుకయు మదమును గర్వము
[1]నొలుకు నకారణవిరోధ మొందు జనుల చె
య్యుల నెక్కుడైన యాపద
మొలచును మధుబిందు [2]కలహముల చందమునన్ 115

వII అక్కథ యెట్లనిన

1.నొలుకునకారణమదమునూఁదుజనుల, మొలుచును మధుబిందుకలహమును బోలెడినిన్ - లి,2..కలహమును బోలెడినిన్-లి.

క॥ ధరణిపతి లాటనరపతి
పురిఁ దేనియ యమ్ముకొఱకు బోయల పల్లెం
జరియించుచుండువాఁ డొక
పురుషుండదియొక్క కలశమునఁ గొని కడఁకన్ 117

వ॥ అట్ల యా నగరంబున నొక సన్నపువీధియందు 118

ఉ॥ తేనియకుండ మోచికొనిదిక్కులు సర్వము బ్రాతిచేసి యే
మేనియుఁ జూచుకొంచుఁ జన నేనుగు కట్టెదురన్ మదాంధమై
రా నచటం దొలంగెడు పురంబు జనంబును జూచి భీతుఁడై
దానును దత్తరించుచుఁబదంబులు తొట్రుపడంగఁ బాఱుచున్ 119

గీ॥ వడఁకు మేనితోఁ ద్రొక్కిన యడుగు ద్రొక్కి
జాఱి మొగ్గి యాతఁడు దడఁపడఁ బాఱుటయును
నిండి మూపునఁ దాల్చిన కుండ తొలఁకి
యొలికె మధుబిందు లొకకొంత యుర్విమీఁద 120

సీ॥ ఆ తేనెబొట్టున కచట నీఁగలు [1]మూగ
వానిఁ బట్టంగ బిరాన డాయ
జేరె నచ్చటి కొక్క చెలఁది యా చెలఁది బ్రిం
గెను బల్లి నొక్క పిల్లి దినియె దాని
నా పిల్లిఁగఱవ రాజాధీన మగు వేఁట
కుక్క యొక్కటి దానిఁ గోప మడరఁ
బొడిచె, బిడాలంబు నొడయని నగరికు
క్కలవారు చంపిరి కడఁగి దాని

1.ముసిరినవాని బట్టంగనని కడంక – .



గీ॥ [1]వాడవారు వచ్చి వధియించి రా శున
కానుజీవి భయము నది యెఱింగి
నృపతి నగరిబలము వారలమీఁదఁ
బనిచె నదియు గదిసి యనికి మొనసె 121

వ॥ [2]అవ్విధంబు గన్గొని 122

మ॥ తగ వూహింపక యొక్క వాడ ప్రజలన్ దాఁజంపఁగాఁ బంచెనే
జగతీవల్లభుఁడైననేమి యని యుత్సాహించి సన్నద్ధులై
నగరం గొల్వనివార లొక్కదెసయై నానాయుధోపేతులై
తెగి భూపాలకసేనఁ దాఁకిరి మదోద్రేకంబుతో నార్చుచున్

ఉ॥ రెండు తెఱంగు మూఁకలును రీతకురిత్త చలంబు పెంపునన్
భండన ముగ్రభంగుల నొనర్పఁగ బెక్కులు ద్రెళ్లెఁ బీనుఁగుల్
గండలు ప్రేవులున్ గలిసెఁ గాలువలై వెసఁబాఱె రక్తముల్
కుండల చారుమస్తకములు గుంపులు గట్టెఁ బురంబు వీథులన్124

వ॥ అట్లగుటం జేసి 125

క॥ కడు చిన్నపుఁగార్యములకె
క్కుడు రోసముతోడఁ బెనఁగి కుమతులు మౌర్ఖ్యం
బుడుగక పెద్దయు సేగి
బడుదురు ధర లాటపతియుఁబౌరులు వోలెన్ 126

వ॥ అని చారాయణ మేఖలాకలహంబులుగ్గడించి కలహంబులెంతలేసి
యగురాయని లేసి యనుచు ముప్పురు నిజేచ్ఛంజని రంతనొక్కనాఁ
డు. 127

1.దాని వాడవారు తవిలి చంపించిరి। కుక్కనంత గినిసి కుక్కవేట। కాంద్రురందఱేగి కత సవిస్తారంబు । నృపతితోడఁజెప్ప నృపతి యలిగి – ము, 2. వచనం లేదు – ము.

సీ॥ లలితవివేక కళావతి భాగురా
యణుచేత నుపదిష్ట యగుచుఁ జెలిమిఁ
జారాయణునిచేత సంధించి మేఖలఁ
బరిభవింపంగ నుపాయ మొకటి
యెఱిగించె వాఁడు నయ్యింతి చెప్పిన యోజఁ
గదిసి మేఖలతోడఁ గపటసఖ్య
మొనరించి పురుషుఁడంచొక దాసితోడను
బెండిలిచేసిన పిదప నెఱిగి
గీ॥ భంగ [1]పాటునఁ జెడి యంతరంగ మెల్లఁ
గాల్ప [2]ముసుఁగు డగ్గఱ నిడి కదిసి రాజ
యుక్తమగు దేవి యడుగులయొద్ద వ్రాలి
పొగిలి పొగిలి యమ్మేఖల వగచి వగచి 128

వ॥ ఆ దుఃఖంబు గనుంగొని 129

గీ॥ పెండ్లికిని బంపఁదగు ననఁ బ్రియముతోడ
దగినవారిచేఁ బుచ్చితిఁ దలఁపు దగిలి
నిన్న రాతిరి పెండిలి నేఁడిదేమి
వచ్చె దీనికి నని దేవి వగచుచుండ 130

క॥ భూరమణుఁడు సన్నపునగ
వారు మొగముతోడఁదన్నునల్లము తోడన్
బూరితసంతోషుండై
చారాయణుఁడప్పు డధికసంభ్రముఁడగుచున్ 131

గీ॥ జోటి! పోయిన రేయిన శోభనంబు
[3]పచ్చి పెండిలికూతుర విచ్చనొచ్చి
నిన్నఁగట్టిన నీ త్రాడు నేలఁ బొరల
నిచట నడలంగఁ గారణ మేమి చెపుమ. 132

1. భంగపాటను శిఖి– ము, 2. చేలముసుంగిడి – ము,
3. వచ్చి పెండిలి యాడితి విచ్చమెచ్చి – ము,



క॥ పరిణయసంధానమునకు
దొరయుట చారాయణుండు దొరయని నరునిన్
[1]వరుఁగాఁ జేసెనె యేమీ
సరిగాఁడో నీ మగండు చామా నీకున్ 133

క॥ అని పలికి పెలుచ నవ్విన
జననాయక మహిషి యాత్మసఖితో నడలం
బని యేమి చెప్పు చయ్యన
ననవుడు నేర్పుడిగి లేచి యవనతముఖియై 134

వ॥ చారాయణుండు తనతోడం గపటసఖ్యంబొనరించి తన్ను దన బంధుజనంబుల సమ్ముఖంబున నుత్సవదర్శనకుతూహ లంబున వచ్చిన వారి యెదురను సభవారిముందఱఁ నొవ్వఁ బరిభవించిన తెఱంగు నీరెలుంగుతో వెక్కుచుం జెప్పి గ్రమ్మఱ గన్నీరు మొగంబున నించుచుండె 135

ఉ॥ అప్పుడు దేవిభంగము వయస్యకుఁ జేసిన రాజు మిత్రుపైఁ
దప్పు ధరాతలేశ్వరుని తప్పుగఁజూచి దరస్మితంబు తో
[2]నొప్పెడు మోము చేతుడిచి యోరగఁజేసి యపాంగభాగముల్
ఱెప్పలఁగప్పినన్ బుడమిఱేడు వడంకె మనంబులోపలన్ 136

వ॥ [3]అట్లుండి యాలోన 137

చ॥ వినయవివేకభూషణుఁ బవిత్రమహీసురవంశభూషణున్
గనకనగేంద్ర ధైర్యు నవికారనిరూఢగుణైకధుర్యు స
జ్జనసతతోపకారహరిచందను బాంధవచిత్తనందనున్
మనుజవిచిత్రభోగశతమన్యుని సర్వనరేంద్రమాన్యునిన్ 138

1. వరుజేసె పెండ్లియేమిట –ము, 2. జిప్పిలుమోము చేయొరగచేసి మొఱంగి – లి, 3. ఈవచనంలేదు – ము,

కII సుశ్రేయఃప్రారంభు జ
నశ్రితపౌరుషుని భావనారాయణ ది
వ్య శ్రీపాదసరోజా
[1]తాశ్రితనిజచిత్తషట్పదాన్వయనాథున్. 139

మాలిని॥ కవిజననుతకీర్తిన్ గామినీకామ్యమూర్తిన్
ప్రవిమలగుణహారున్ బ్రాజ్ఞ చేతోవిహారున్
వివిధసుఖసుయోగిన్ విష్ణుభక్తానురాగిన్
భువనహితచరిత్రున్ బోలమాంబాసుపుత్రున్ 140

వII ఇది సకలసుకవిజనవిధేయ మంచెననామధేయప్రణీతంబైన కేయూరబాహుచరిత్రంబునందు ద్వితీయాశ్వాసము

1. తాశ్రయనిజచిత్తషట్పదాన్వయు సుమతిన్ – ము.

# తృతీయాశ్వాసము

కII శ్రీరమణీకారుణ్య సు
ధారససరసీమరాళుఁదారక, వాణీ,
శారదనీరదనారద
హార నిభయశస్కు గుండనామాత్య [1]మణిన్ 1

వII కేయూరబాహుమహీనాథుం గటాక్షించి దృష్టి మరలఁ దిగిచి 2

చII తొంఱఁగుము వంత నీ విదివిదూషక మంత్రముచేతఁగాదు మా
కెఱుఁగఁగ వచ్చు నెల్లవియు నేటికి మాటలు వేయునంచుఁ గ్రొ
మ్మెఱుఁగులు గ్రమ్ము కేలఁగొని మేఖల [2]బాహుల నూఁది విత్తమున్
బిఱుఁదును నల్ల నల్లనఁ దఱింప మృగేక్షణ యేగె నల్కతోన్ 3

వII ఇట్లు దేవి నిజనివాసంబునకరుగఁ దత్పరిచారికలగు సుమతి సుకుమారికా మకరందిక లొకచోటికింగూడి రహస్యగోష్ఠి యొనరించు సమయంబున సుమతి యిట్లనియె. 4

కII చెలులార! కంటిరే మే
ఖల బేలుందనము మున్ను గానక వగతో
నలయింప నలిగి నెయ్యము
సలుపంగానేల పిదపఁ జారాయణుతోన్. 5

కII ద్రోహోక్తుల వైరానల
మూహింపక రాఁజఁబెట్టి యుక్తిరహితులై
స్నేహంబు, [3]విడువఁ జెల్లునయ
పోహంబున మందుఁడు గాక పోఁబాటగునే. 6

1.నిధిన్ –ము, 2. బాహువునూఁది – ము, 3.పిదపఁజనునె య॥ పోహంబుగ నుండుగాక పొనుబాటగునే – ము,

క॥ [1]బలవంతుండగువాఁడు
క్కలుఁ డనగాఁ జాలు పగఱ కపటోక్తులఁ దాఁ
కలయఁగ బంచిన బేల్వడి
కలపి కొనిరయేనిఁ గీడు కాకుండదిలన్ 7

క॥ నేరుపుమై మేఖలయెడఁ
జారాయణుచేఁత తొల్లి సర్పముఁ గపటా
ధారోక్తుల దర్దురములఁ
జేరి పిదప వాని కెగ్గుసేయుటఁ బోలెన్ 8

వ॥ అనుటయు నది యెట్లను తన సఖులతో నక్కడ నహి
భేకోపాఖ్యానంబు తత్తదాఖ్యాయికాసహితంబుగా వినిపించెద
వినుండని [2]సుమతితో యిట్లనియె. 9

ఉ॥ పూచిన తీఁగెలన్ మధురభూరిఫలంబుల వ్రేఁగునన్ మహిన్
మోచిన [3]కొమ్ములం గలిగి [4]మూఁకర గట్టిన పోఁకమ్రాఁకులన్
రాచిన వాల్మృగంబుల వినంబడి వర్ణన సేయ నొప్పు విం
ధ్యాచలపార్శ్వకానన మనన్యవనీవిభవోపమానమై. 10

వ॥ అట్లయ్యరణ్యం [5]బభిధానగర్వంబై పరగుచున్నంత 11

క॥ తొల్లి యుగసంధి నొకతఱి
నెల్లెడఁ బొడ వడఁగఁ దాప మెక్కుడుగా సం
ధిల్లె నొక వఱపు ప్రాణులు
తల్లడిలఁగ నిడివి యగుచు ధరణి [6]నలంచెన్ 12

వ॥ అక్కాలంబున 13

1. బలవంతుఁడు బగవాఁడును। ఖలుఁడనఁగాజాలువాడు గపటోక్తులఁదాఁ। గలయఁగవచ్చిన బేల్వడి–ము 2. సఖులతో నిట్లనియె 3. కొమ్మలం, 4. మూఁకలు– మె, 5. బభిరామగమ్యం. 6. తలంకన్ –ము,



సీ॥ పసిమి యెచ్చట లేక పాడగుటకుఁ దోడు
పాతాళమునదాఁకఁబగిలె నేల
బలములు వ్రయ్యలై [1]యలిమి లేమికిఁ దోడు
హీనజంతువులెల్ల నివికె నెండఁ
జండాతపముచేత నెండిపోకకుఁదోడు
ద్రుమములఁ బెనుగాలి తుమురు చేసె
ఆకలి నీరువట్టను చిచ్చునకుఁ దోడు
కార్చిచ్చు మృగములఁ గాల్పఁ దొడఁగె
గీ॥ ఆపదలమీఁద నాపద లావహిల్లె
వట్టిపోయిన డొక్కలు వాములయ్యె
నివుఱు బొగ్గులప్రోవులు నిఖిలదిశల
నఖిలదుస్సహమయ్యె నయ్యడవియందు 14

క॥ పరిపూర్ణోదకమై కడు
నిరవగు నొక కూపమున ననేకంబులు ద
ర్దురముల [2]లఘుమాంసంబులు
పరగు సుహృద్భ్రాతృపుత్రపౌత్రయుతముగాన్ 15

వ॥ ఇట్లన్నియుం దమకు మహావేగుండను నొక చిక్కని మండూకంబు
రాజుగా నిలుపుకొని సుఖంబుండునంత. 16

క॥ ప్రియబంధు లెల్లవారును
లయమందినఁ దాను జాల లావఱి పుచ్ఛా
శ్రయజీవనమై తిరుగుచు
భయదర్శక మనఁగఁ బరఁగు పా మచ్చోటన్ 17

1. నెలవు –ము, 2. బహువర్ణంబులు – ము.

కII మండూకనినాదము విని
నిండిన సంతసముతోడ నీరుండనిచో
నుండవివి యచట నుదకము
లుండంబోలునని మేన నుమ్మఁగలూరన్ 18

మII కదియం జయ్యన వచ్చి నాగమచటం గాంభీర్యసంపత్తికం
గుదురైయుండెడు నుయ్యిఁగాంచి మదిఁగోర్కుల్ నేఁడు నేకూఱెఁ బా
పుడుఁ దృష్ణాతిభరంబు నేను మఱియున్ బుత్తున్ మహావగ్రహా
స్పద దుష్కాల దినంబు లెల్ల నిచటన్ సమ్యక్సుఖావాప్తిగన్ 19

కII చౌర వెడలఁ దెరువు గానక
దరినుండుచు లోన నున్న దర్దురనాథున్
బరిమితపరిజనపరివృతు
నిరవున నున్నతనిఁ జూచి యిట్లని పలికెన్ 20

శాII దేవా! భేకకులాధినాథ! కరుణాదృష్టిన్ననుం జూడవే
జీవం బుండదు నీరువట్టుకతనన్ శీఘ్రుంబ నిన్గొల్వరాఁ
ద్రో వే దిక్కునఁ గాననేర, మదిలో దుఃఖంబునం బొందెదన్
నీవారిన్ గలయంగ రాఁబనిచి మన్నింపంగదే వేడుకన్ 21

కII మా పెద్దలెఱుక సాలక
మీ పెద్దల కెగ్గుసేసి మెలఁగుట యెల్లం
బాపికొనవలయు నను నీ
శ్రీపాదసమీప మిపుడు చేరిచికొనవే 22

గీII ఉరగసంఘంబునకుఁ గప్ప లోడుటెల్ల
నీవు పుట్టకమును గాక నీ ప్రతాప
మెఱిఁగి నీవారి దిక్కు రా వెఱచుఁ జూవె
చారుతరమూర్తి! మండూకచక్రవర్తి 23



కII హనుమంతునిం బ్లవంగం
బని పిల్తురు నిన్ను బిల్తు రా పేరనె యిం
ద్రుని హరియందురు హరి యని
నినుఁ [1]జెప్పుదు రనిన వినుతి నీకుందగదే. 24

కII అని తన్ను నిట్లు వొగడిన
విని యొడలుబ్బంగ భేకవిభుఁడయ్యాహి కి
[2]ట్లనియె విను నాదు మంత్రుల
యనుమతి రప్పింతు నిలువుమంతకు నిచటన్ 25

చII అని తన యిష్టమంత్రుల రయంబునఁ బిల్వఁగ బంచి వారి క
ప్పని యెఱిఁగించినన్ వశమె పాములపొత్తు మనంగ దీనినే
మని యొకవింత కార్యముక్రియన్ దలపోసెదవన్న వెండియున్
మనమున సర్పబాంధవము మానని యేలిక మోము చూచుచున్ 26

వII శ్వేతుండనుదర్దురంబిట్లనియె. 27

కII తనకు నెడరైనయెడ మా
లని కంటెన్ గీడువడు నలజ్జత వా
సినయపుడ మఱచి కుజనుఁడు
తను బట్టపురాజు గాఁగఁదలఁచు మనమునన్ 28

కII చెలిమి శిలాక్షర మెప్పుడు
నలుక జలాక్షరము సుజనులగు వారలకున్
జెలిమి జలాక్షర మెప్పుడు
నలుక శిలాక్షరము కుజనులగు వారలకున్. 29

వII [3]అనియెఁ దదనంతరంబ [4]కృష్ణరూపియగు మండూకం బిట్లనియె. 30

1.జెప్పుదు రనఁగ – ము, 2. ట్లను నా మంత్రులయనుమత ।
మున నినురప్పింతు నిలువు ముదముననచటన్– ము.3. విదవఁ
4.గృష్ణరూవంబగు,

మ॥ అరయన్ దుష్టజనుల్ స్వదుశ్చరణ జాత్యంధుల్ నిజాచారధీ
గరిమాదిస్తుతిమంతు లాత్మధనరక్షా [1]జాగరూకక్షముల్
పరదోషేక్షణ దివ్యచక్షు లితరప్రజ్ఞాప్రశంసా నిరం
తరమౌనివ్రతు లన్యవిత్తహరణ ధ్యానక్రియా నైష్ఠికుల్. 31

క॥ చేరఁదగని దుర్జనులం
[2]జేరంగా నిచ్చిరేని సేగియు నిడుమల్
కూరుదురు తొల్లి కాకము
సేరిన నంచలకు నైన చేటు వినమొకో 32

క॥ అనవుడు [3]మండూకేంద్రుఁడు
విన మెన్నఁడు నంచ లేమివిధమునఁ గాకం
బునకు నిరవిచ్చె నెవ్విధ
మున వానికిఁ బిదపఁ గీడు పొందెం జెపుమా. 33

వ॥అనిన నా కథ వినుమని యా కృష్ణరూపి యిట్లనియె. 34

సీ॥ ఒక పర్వతముమీఁద నొప్పెడు కొలనిలో
నంచలు గొన్ని యిచ్ఛానువృత్తిఁ
బగలెల్ల విహరించి భానుఁడు గ్రుంకంగఁ
బాపాత్ములకుఁ జేరఁబ్రాఁకరాని
యున్నతోన్నతమగు నొక గండశిలమీఁద
రేలెల్ల సుఖనిద్రఁ గ్రాలుచుండ
నట్లుండఁ దద్గ్రహణాపేక్ష నొక బోయ
తెంకి పట్టరసియుఁ దేఱిచూడ
గీ॥ లేక యరిగిన నొకనాఁడు కాకమొకఁడు
ప్రొద్దు గ్రుంకంగ నచటుగాఁ బోయిపోయి

1.జాగరూకేక్షణుల్ 2. చేరంగదగనిదుర్జను, జేరంగా నిచ్చిరేని – ము,
3.మండూకేశుఁడు .



ఖగనినాదంబు విని వానిఁగదియవచ్చి
యుండుటయుఁ దానిఁగని హంసయూథమెల్ల 35

ఉ॥ ఎచ్చటినుండి యెచ్చటికి నేగెద వేమి ప్రయోజనార్థమై
యిచ్చట నిల్చి తీ వనిన నేఱితినంజని కుక్షినిండఁగాఁ
జెచ్చెర నుక్కిపట్టునకుఁ జేరఁగ బోవగఁ బ్రొద్దులేమి నా
కిచ్చట నిల్వఁగా వలసె నిట్టిది నా విధమంచుఁ జెప్పినన్. 36

క॥ అగుఁగాక నిలువుమని హం
సగణంబంతయును బలుక సంకటపడుచున్
సుగుణుఁడు మతిమంతుండనుఁ
తగవెఱిగెడు నంచ యొకటి దా నిట్లనియెన్ 37

గీ॥ సబము నెంగిళ్లు దీని భోజనము క్రూర
మిట్టి యెగ్గులు వేయును నేల చెప్ప
ఖగములందుఁ జండాలుఁడు కాక మనుట
కడుఁ బ్రసిద్ధంబు గాదె యా నొడువు వినరె. 38

క॥ వల [1]దీ రేయిన్ మనయెడ
నిలిచినఁ గీడొందు మనకు నేడెల్లిటి లో
పలఁ జేయకున్నఁ గాలము
తలనైనను జేయునింత తథ్యము సుండీ 39

వ॥ అనుటయుఁ గార్యంబెఱుగని యితరమరాళములు కొన్ని
యమ్మతిమంతు నుద్దేశించి. 40

1.దీరే యిది మనకడ – ము.

గీ॥ [1]ఇట్టి నిర్దయత్వ మేల యుండెడునది
యొక్క రాతిరిచట నున్నమాత్రఁ
గీడు సేరుననుచుఁ గీనుపుకొట్టుట యిది
వెఱపు పెంపుగాక యెఱుక యగునె. 41

క॥ పెక్కులు బుద్ధులు గఱచిన
నెక్కుడు భయ మనుట నిక్కమింక బహూక్తుల్
తక్కు మిదియుఁగా కిది తా
నెక్కడికిం బోవుఁ దిమిర మిప్పుడు రాఁగాన్. 42

క॥ అని పలికి దాని నుండం
బనిచి యభీష్టంబు లైన ఫలములు దద్భో
జనమొనరించియు నుండఁగ
దన యిమ్ముల వాయసమ్ము దగ [2]వసియించెన్. 43

వ॥ ఇట్లు వసియించి 44

గీ॥ అచట రిట్టఁ బెట్టి యర్కోదయముగాఁగఁ
దడయకరిగె నంత దాని రిట్ట
శిలల సంధిఁబొంద మొలచె నందొక వట
భూజఫలములోని బీజముండి. 45

మ॥ అది నానాటికిఁ బేర్చి శాఖల విహాయస్పర్శ మై యుండఁగాఁ
బదియేండ్లన్ జనునంత నూడలు కడుం బల్వారి వర్ధిల్లుచుం
గదియన్ వచ్చె [3]నధిత్యకాస్థలము వీఁకన్ ప్రాన దాఁ బ్రాకి య
భ్యుదితానంది కిరాతుఁ డొడ్డె నరులా భూజంబునందెల్లెడన్.
46

1.ఇంత వల్దు వాదవీ కాకియొక్కటి - ము, 2.నివసించెన్ -ము,
3.తలమువంకన్ ప్రానఁ దాఁబ్రాకి -ము.



చ॥ ఉరులు కుజంబునం గలయ నొగ్గి నిషాదుఁడు చన్నమీఁద భా
స్కరుఁడపరాద్రిఁ జేరె జలజాతవనంబులఁ గ్రీడ మాని స
త్వరగతి మఱ్ఱిమీఁదికి సితచ్ఛదముల్ చనుదెంచి మూఁగ వా
గురికలఁ జిక్కి యన్నియును గుందుతఱిన్ మతిమంతుఁ డిట్లనెన్

మ॥ మన కీ పాటులు వచ్చెఁ జూచితిరె నా మాటల్ వృథాహంకృతిన్
వినఁగా నొల్లక యల్లరాత్రియిచటన్ వీరెల్ల వాదాడి యుం
చిన యా కాకము రెట్టలో మొలిచి హెచ్చెంజూవె యీ మఱ్ఱి డి
గ్గిన యా యూడలఁ బ్రాఁకి సూవె మన కొగ్గెం బోయఁడీ జాలమున్

క॥ [1]తగువారి పలుకు సేయుట
తగ వెఱుఁగక యడచి పడమి తమవారలతో
నగుణత్వము గొను టుత్తము
ల గుణము లటుగామి యరయ నధమగుణంబుల్ 49

చ॥ అనుటయు నంచలిట్లను మహాత్మ భవత్ప్రతిభావిలంఘునం
బున మన కిట్టి కీ డిపుడు పుట్టె నుపాయముకల్మి దీనిఁ బా
ప నలివియేనిఁ బాపి హితబంధుల నిన్నును గాచికొమ్ము నీ
పనిచినయట్ల చేసి భటభావముఁ బొందెద మెల్లవారమున్ 50

వ॥ అనుటయు మతిమంతుం డిట్లనియె 51

క॥ తమలో నన్యోన్యవశ
త్వము గలిగిన బంధు లాపదలనెల్ల నుపా
యముమైఁ బాయుదు రారయఁ
గమతంబులు గరుడబాధ గడచిన భంగిన్ 52

వ॥ కాన భయంబు వలవ దొక కథ వినుండని యిట్లనియె. 53

1.ఈ పద్యము మొదటిపాదమే 'లి' లోనిది. మిగిలినది 'ము' ప్రతిలోనిది.

కు॥ అంబుధితీరంబునఁ గూ
ర్మంబులు చరియించుచుండుఁ బ్రతిదినమును దా
నింబట్టి తనకు నాహా
రంబుగఁ గొనుచుండుఁ బక్షిరా జుగ్రుండై 54

వ॥ అట్లు చెల్లించుచుండ నొక్కనాఁడు 55

చ॥ వననిధి నీట నిల్చి ఖగవల్లభుతో నొక కూర్మముఖ్యుఁ డి
ట్లనియె మదీయబంధునివహంబు భవత్కృత బాధఁ గ్రుంగ నే
న నిలిచినాఁడ నిప్పటికి నాకుఁ దొలంగినఁ బోదు నీకు నా
కును నొక పన్నిదంబు సమకూరునె యాలము మాని చెప్పుమా

కు॥ అనుటయు నవ్వుచు వినతా
తనయుండది యేమి పన్నిదము సెప్పవయా
యనవుడు నలుగక చిత్తం
బున నించుక యవధరింపుము మహావిహగా 57

మ॥ ఉడువీథిన్ [1]వెసవాఱ నీవు జవసత్త్వోత్సాహ యంభోధిలోఁ
గడువంబాఱెద నిన్ను నేను మిగులంగాఁ జాలినట్లైన నె
న్నడు భక్షింపకు మమ్ము నోడినటులైనన్ మా కులంబెల్ల నె
ప్పుడు నాహారముగొమ్ము నీవు వినతాపుత్రా మహాధార్మికా

వ॥ ఇవ్విధంబు సేయందలంపుగలిగెనేని నొక్కనాఁడిచటికి విజయంచేయుండనిన నువర్ణుండట్లు సేయుదునని యొడంబడిపోయిన 59

కు॥ తన చుట్టల నెల్లం జ
య్యన నొక పట్టునకుఁగూర్చి యా కూర్మము తా
ర్క్ష్యునితోఁ దా నొడఁబడి వ
చ్చిన చందము వారితోడఁ జెప్పుడు వారున్ 60

1. వెస నీవు వాఱ -ము,



కు॥ నిను గడచిన మతిమంతులు
మనలోపలఁగలరె పంపు మము నేపనియై
నను జేయుదు మనవుడు నది
మన మలరఁగఁ జెపుదు వినుడు మన మందఱమున్ 61

కు॥ ఆమడ యెడఁ బదిపదిగా
సాముద్రతటంబు నీరఁ జనియుండి ఖగ
స్వామి పఱవంగ నాతని
కా ముందటివాఁడు చూపునది పొడ యనుడున్. 62

వ॥ అని యోచన చేసికొని విహగవల్లభుతోడఁదాను మాటలాడిన యెడన యా కచ్ఛపంబు నిలిచె నచ్చటు మొదలుకొని యనేక యోజనంబులుదాఁక తక్కినవియు నట్ల యుండ మరునాఁడు సనుదెంచి. 63

కు॥ గరుడుం దవ్వలనికి స
త్వరగతిఁ గూర్మంబుఁ బిలిచి వారిధిపై నం
బరవీథిఁ బెద్దయును ద
వ్వరుగుచు నది చిక్కనోపునని చీఱుటయున్ 64

కు॥ ఓ యని పలుకుచు ముందఱ
తోయధిలోఁ గచ్ఛపంబు దోఁచిన మఱియున్
వాయుగతిఁ బఱచి చీరిన
[1]నా యెడఁగమఠంబు లెల్ల నట్ల యెసంగెన్. 65

వ॥ అవ్విధంబుఁ గని యచ్చెరు వందుచు 66

1. నా యెడ నగ్రమున గమఠమల్లన నెగసెన్ - ము.

క॥ అందుండి మగుడఁ బఱచుచు
[1]ముందటియట్లాఁగఁ బిలిచి మొగినట్టుల యం
తం దోఁచుచు నవి పిఱుదులు
ముందఱగాఁ జేసి పక్షిముఖ్యుని గెలచెన్ 67

క॥ అతఁడు తన యోటమిని ల
జ్జితుఁడై మీ కెందు నెగ్గు సేయన్ బ్రమద
స్థితి నుండుఁడనుచుఁ బోయిన
నతి సంతోషమునఁగచ్ఛపావళి యుండెన్ 68

వ॥ అట్లగుట పరస్పరవశ్యులగు బంధువులకాపదలం గడవవచ్చు నింకనైన మదీయవచనంబు లంగీకరించెదరేని వినుండని మఱియు మతిమంతుండిట్లనియె. 69

సీ॥ కంఠమూలంబునఁగదిసిన యీ యురు
లూడిచికొనిపోవు యుక్తి లేదు.
గాని చావకయుండఁగలదుపాయం బైక
మత్యంబు గలగిన మనకునెల్ల
నెట్లన్న నిజ్జాల మిచ్చుట నొగ్గిన
వేఁటకాఁడేతెంచు వేగఁతడవ
కప్పుడు మీరెల్ల నపగతప్రాణుల
కరణినుండినఁ జాలు నురులఁ బాపి
గీ॥ చచ్చినవియె మున్నని తాను జంపుటుడిగి
వటముక్రింద నన్నిటి వైచు వాఁడు
డిగ్గి చనుదెంచు తఱిఁగని దిగ్గనంగఁ
బాఱిపోద మెవ్వరమును బట్టుపడక 70

1.ముందటియట్లట్లపిలువ ముందఱనంతం - ము,



వ॥ అనుటయు సంతసిల్లి మరాళము లన్నియు నిది లెస్స మతంబని నిశ్చయించి యమ్మతిమంతు నుపదేశంబున నట్ల యున్నంత 71

గీ॥ వేగుటయు వచ్చి యబ్బోయ విహగయూథ
మున్న చందంబు గనుగొని యుల్ల మలర
గెడసినవి పుల్గు లురులచే మెడలు బిగిసి
యనుచు వటమెక్కి దిగవైచె నంతవట్టు 72

క॥ ఒకఁ డొకఁడు డిగ్గవై వగ
సకలంబును బ్రోవు గట్టి సంభ్రమమున ని
ల్వక చనె మతిమంతుండొక్కఁడు
నొక కడపటి శాఖయందు నురి నుండంగన్ 73

గీ॥ అతని రాక దలంపక యధికభీతిఁ
[1]బోవుటయు ఱిచ్చపడియుండఁ బులుఁగు లకట
మోసపుచ్చినవని బోయ డాసి వచ్చి
బిట్టు మతిమంతుమెడ బిగ్గఁ నులిచి చంపె. 74

క॥ మతిధృతి లేని వెడఁగుల కు
మతి గఱపిన సుమతికిం బ్రమాదము వచ్చెన్
మతి గఱపిన మతిమంతుఁడు
సితచ్ఛదోత్కరముచేతఁ జెడ్డవిధమునన్ 75

క॥ మతిమంతుండవ్విధమున
హతుఁడయ్యెం దక్కుఁగలుగు హంసలు దుఃఖా
యతనంబు లయ్యెఁదముఁ గు
త్సితకాకం బొక్కరేయి సేరిన కతనన్ 76

1.బోవుటయు ఱిచ్చపడి ముండవులుఁగు లకట మోసపుచ్చిర నన్నని డాయ బోయి - ము.

కII కావున నీ సర్పము మన
యావాసముఁజేరె నేని నతిశయబహుదుఃఖం
బీవశత వచ్చు దీనికిఁ
ద్రోవ యెఱింగించు తలఁపు దొఱఁగుము బుద్ధిన్ 77

కII నీ వుపకారం బితనికిఁ
గావింపం జూచె దధికకరుణామతి వై
యా విధము సేయుచుండియు
భావింపందగు నపాత్రపాత్రతలెందున్ 78

కII క్రూరులగు జనులు ప్రత్యుప
కారంబులు సేయఁ జాలకయ సుజనులపై
నారోపింతురు తప్పులు
కారండవచయము నీరుఁగాకులు వోలెన్ 79

వII అక్కథ యెట్లనినం బూర్వకాలంబున 80

కII కోసలదేశంబున ధా
రాసనుఁ డనఁగాఁ గలండు రాజతఁడు నయ
వ్యాసంగము ధర్మంబును
[1]బాసి చరింపుచును నుండెఁ బ్రజలు దలంకన్ 81

కII ఆ రాజు సేయునెగ్గులు
కారణముగ భూమియందుఁ గఱవగుటయు ము
న్నారాష్ట్రమందుఁ దమకా
ధారమ్ముగనుండుఁ గాకతండం బెల్లన్ 82

వII ఒకయెడం గూడుకొని 83

1.బాసి చరింపంగఁదొడగె - ము.



కII ముంగిళ్ల నెండువులు గా
నంగఁ బడవు గలుగుపట్టునం గాపు ఘనం
బెంగిలిమెతుకులు చల్లుట
యుం గలుగదు మున్నవోలె నుర్విఁ దఱుచుగన్ 84

కII కడు బలు లిడలే రిచ్చటి
వెడమాయపుటాసలెల్ల వేగవిడచి యెం
డెడకరిగి నేరిచిన క్రియఁ
గడుపులు రక్షించు కొనుట కార్యము మనకున్. 85

మII అని కాకుల్ తమ దేశము న్విడిచి భుక్త్యాకాంక్ష నెందేనియున్
జనుచో దవ్వులఁ ద్రోవ నొక్కయెడఁ గాసారంబులోనుండి గ
న్గొని మోదంబున నీరుఁగాకులను పక్షుల్ పక్షిజాతిత్వ మా
త్రనిబంధం బగు బాంధవంబలరఁ జేరన్ బోయి ప్రార్థించుచున్

ఉII తోఁకొని వచ్చినం దొలుతఁ దోయజషండముఁదన్పు తియ్యనీ
రేఁకట వోవ గ్రోలి తమ కిమ్మగు చెట్టులనీడ నుండఁగాఁ
బ్రోఁకలు గట్టి వారి ఖగముల్ తమముందటఁబెట్టు మీలఁబే
రాఁకలి యల్లఁదీర్చికొని యచ్చట నద్దినరాత్ర ముండుచున్ 87

సీII కదలి వేకొన నేగఁ గదలుచో నప్పుడు
నీరుకాకులు వచ్చి మీరలేమి
పనికి నెచ్చోటికిఁజనియెదరనిన మా
వసియించు దేశ మవగ్రహమున
నలఁగిన నాహారములు లేక యిందఱుఁ
బండిన భూముల కొండుకడకు
నరిగెద మనిన వాయసములఁ గారండ
వము లట్టిదేని నేవలను నేల

గీ॥ యిచట నిలువుఁ డింక దీ కొల నెన్నఁడు
జలచరములు నిండుఁ గలవు జాలఁ
ననుడుఁ [1]గాకు లబ్బ వామిషంబులు మాకు
గామి మాకు వెరవు లేమిఁజేసి 88

క॥ కావున నిచ్చట నుదరము
[2]నే విధమున బ్రోచికొందు మే మనుటయు మే
మీ విధ మెఱుఁగుచు నొండొక
తావునకుంబోవ నిచట తగునే మాకున్ 89

వ॥ అని మఱియును 90

క॥ కారండవమ్ము లనియెన్
మీ రూరక కొలని కఱుత నిలువుఁడు మీ కా
హారంబులుగా నిచ్చలు
వారిచరోత్కరముఁ బెట్టువారము తనియన్ 91

వ॥ అనుటయు నగుఁగాక యని నిలిచి 92

మ॥ జలపక్షుల్ వెలివైవఁ గ్రొవ్వుగల మత్స్యవ్రాతమున్ మ్రింగుచున్
జలజావాస సమీప కుంజ శిశిరచ్ఛాయా ప్రదేశంబులన్
లలిఁ గ్రీడించుచు లీల నట్లమితకాలం బచ్చటన్ బుచ్చె న
బ్బలిపుష్టంబులు పుష్టదేహములతోఁ బ్రహ్లాదముంజెందుచున్ 93

వ॥ అంత 94

క॥ తమ దేశంబున దుర్భి
క్షము వాయుట యరసి యెఱిఁగి చనుచో నపకా
రము సేయదొడగె నప్పుడు
[3]తమలో నన్నీచఖగవితానము లెల్లన్ 95

1.కాకు లెల్ల నతిభామిషంబున – లి, 2.నే వెరవునఁ – లి,3.తమలో నన్నియును – లి,



క॥ కారండవములు మన కుప
కారము చేసినవి వీనిఁ గన్ను మొఱఁగి పో
నేరక యుండిన బ్రత్యుప
కారము సేయంగ శక్తి కలదే పిదపన్ 96

వ॥ అను పలుకులు విని యందుఁ గొన్ని యిట్లనియె. 97

క॥ వీరికిఁ జెప్పక పోయినఁ
జోరత్వము వచ్చుఁ జెప్పి సులభప్రీతిన్
వీరనుపఁ జనినఁ బ్రత్యుప
కారం బొకయపుడు సేయఁగావలయుఁ దుదిన్. 98

వ॥ అట్లగుటం జేసి 99

క॥ వీరు మనకుఁ జేసిన యుప
కారం[1]బప్పేల నిట్లు కైకొని పోవన్
వీరిపయిందప్పొక్కటి
యారోపింపుదముగాక యది యెల్లఁజెడన్ 100

క॥ అనవుడు వీరలమీదను
నొనరింపఁగ దోసమొకటి యొనర మనకుఁగ
ల్గునె యనుచు వెదకి కొఱతలు
గనుఁగొని యన్నియును జలఖగంబులకడకున్ 101

వ॥ చని వాని నుద్దేశించి 102

క॥ చిరజీవము మా నామము
సరకే మా కొకటి యిష్టసంచారము మై
నరుగగ మీరిట నాపినఁ
[2]బరిభవమున నాపి పోవఁబడి మీ చేతన్ 103

1.బప్పుగ నిదేల – ము, 2.పరిభవములబొంద నావఁబడితిమి మీచేన్ – ము,

చ॥ నెల పది[1]ప్రొద్దు లేమిచట నిల్చినమాత్రము నిందు మాకు నెం
గిలి తినిపించి యుండితిరి కిల్బిషవర్తనులార యక్కఱల్
కలుగవె యెట్టి వారికి జగంబున నోడల బండ్లు బండ్లు నో
డలుఁ జనుదెంచునంట యకటా విసరే యిటుఁ జేయఁగూడునే. 104

వ॥అదియునుం గాక 105

క॥ పుచ్ఛంబు లెత్తి మీవగు
పుచ్ఛంబుల క్రిందు మాకుఁ బొరిఁ జూపుచు న
స్వచ్ఛులయి నీరఁ గ్రుంకెడు
తుచ్ఛులు మిముఁ దిట్టఁబోవుదుమె యెందైనన్ 106

గీ॥ వ్రతులు మాలోన సగ ముంద్రు వారలిచటఁ
జేరు టాదిగ నొల్ల రాహార మెపుడు
సరసిఁ గ్రుంకుచు మీరు పుచ్ఛముల క్రిందుఁ
జూపఁ జూచుచు రోఁతలు చుట్టుకొనగ 107

వ॥ అని పలికి 108

క॥ మీ కొఱగాములు సర్వము
మీ కుండుంగాక యనుచు మింటఁగనుఁగొనన్
గాకా యని యఱచుచు వెసఁ
[2]గాకంబులు పూర్వదేశగమనం బొందెన్ 109

వ॥ అట్లగుటం జేసి 110

క॥ ఉపకార ముత్తముఁడు తన
కృప మొక్కలమునఁ బొనర్పఁ గిల్బిషుఁడొకఁ డ్రబ
త్యుపకారముఁ [3]బొనరుప లే
కపకారము చేయునొండె నాపదఁ జేయున్ 111

1.పూఁట, 2.కాకులు పూర్వప్రదేశగమనము చెందెన్ - ము, 3. వెదుకండొకఁ యపకారమె రోయునొండె- ము.



క॥ అని కృష్ణరూపి చెప్పిన
[1]వినియును దుర్బుద్ధిఁ జేసి వెండియు నురగం
బున కిరవియ్యఁ దలంచిన
తన పతికి వృకోదరప్రధానుండనియెన్ 112

క॥ తులువకు నాపద మూడినఁ
జెలియై తగువాఁడు చక్కఁజేయుట యెల్లన్
బులికి నొక మ్రాని పోటుం
బులుఁగుపకారంబు [2]సేఁతపోలె నగుఁ దుదిన్ 113

వ॥ ఆ కథ యెట్లనినఁ దొల్లి యొక్క కాంతారంబున 114

శా॥ లీలానిర్జితసర్వజంతు వన నోలిన్ బేరుకొన్నట్టి శా
ర్దూలంబొక్క జరన్మృగంబు నొకచో దుర్దాంతమై వ్రేసి త
త్కీలాలంబది మున్ను గ్రోలి యుదరోద్దీవ్యద్బుభుక్షానల
జ్వాలల్ తన్నలపంగఁ దల్పె శితమాసంబొంది భక్షింపఁగన్ 115

ఉ॥ కోఱలసంది [3]నెమ్ముకలు గ్రుస్సిన నంత దినక్రమంబునన్
మీఱిన నొవ్వి భుక్తిఁగొననేరక యాననగహ్వరంబునన్
గాఱెడు లాలతోడఁ బులి గ్రచ్చఱిలోఁబడి యుండ మ్రానిపైఁ
గూఱి సుబుద్ధి యొక్క ద్రుమకుట్ట విహంగము దాని కిట్లనెన్ 116

ఉ॥ నొవ్వి యలంపఁ గూసెదవు నో రొకమాఱును మూయవేలొకో
తివ్వలు కాలఁ జుట్టినను దెంపఁగ లేవు తరక్షునాథ! నీ
కివ్విధమైన యాపదకు నేది కతంబు విధాత యక్కటా!
యెవ్వరి నెట్లు సేయఁడు విహీనదయన్ బ్రతికూలుఁడైనచోన్. 117

1.వినియును నప్పావ చెలిమి విడకతనమనంబునగల తలంపు మానని । తనపతికి వృకోదరప్రధానుండనియెన్ - ము, 2.సేయుపోల్కి - ము, 3.నెంపములు గ్రుంకిన - ము,

కII అనుటయు దానికిఁ జెప్పెం
దను బొందిన వేధ పులి యుదారోపాయం
బున దీనిఁ బుత్తునే మే
లొనరించెదనని విహంగ మొయ్యనఁ బలికెన్. 118

చII అనవుడు చిత్రకాయము ప్రియంబున నట్టిదయేని నీకు మే
లని మితిసేయ నేమిటికి నాప్తసఖుండుగ నిన్నుఁజేసి యే
వనమున నేమి జంతువు నవారణఁజంపిన మాంసమర్థముం
గొనుమని యిత్తు నేహితముఁ గోరినఁ జేయుదు నీకు నెచ్చెలీ. 119

కII నావుడు పెద్దయు విప్పుగ
నీ వదనముఁ దెఱవుమనుచు నియమించి దురం
తావిర్భావితసాహస
యై విహగం బందుఁ జొచ్చె నతినిపుణతతోన్ 120

గీII దంష్ట్రముల పాదమునఁ గొని తన్ని సంధి
బడిన యెమ్ముకఁ చంచునఁబట్టి యూది
పాపి కదిలిచి పెఱికి యా పక్షి యధిక
వేగమునఁ బులివాఁగడ వెడలిపోయి 121

కII ద్రుమశాఖ నెక్కి యెముకయు
నుమిసినఁ బులినోరు నొవ్వి యుడిగి మఱి దిన
క్రమమునఁబుండాఱిన [1]నొ
క్కొ మహామృగమును వధించికొని యొకచోటన్ 122

కII నమలంగా నచ్చోటికి
ద్రుమకుట్టము వచ్చి కట్టెదుర నిల్చి మృగో
త్తమ నా భుక్తికిఁదగుమాం
సము వెట్టుము పలుకు మృదువచనములు నాతోన్. 123

1. 4వ పాదం ‘ లి’లో లేదు.



వII అను పలుకులు విని వ్యాఘ్రంబు 124

కII నీ వెవ్వరు మాంసం బే
లా వలసెన్నీకు నేను లంచము వెట్టన్
నీవు పులుఁగవే మృగపతి
నా వచనమ్ములఁ బ్రయోజనము నీ కేలా 125

కII అనవుడు నెఱుఁగవె నన్ను వ
దన కుహరములోన సొచ్చి దౌడలయెడ నా
టిన శల్యముఁ బెఱికిన చెలిఁ
జనునే నను మఱవనీకు శార్దూలపతీ 126

వII అను పలుకులు విని నవ్వుచు నది యా ద్రుమకుట్టంబుతో
నిట్లనియె 127

గీII కాయ లుడివోయినట్టి వృక్షంబుఁ బాడి
యెల్లఁ గడచన్న ధేనువు నేఱుఁగడపె
నతఁడుఁగార్యము దీర్చిన యతఁడు నపుడ
గాని యాదరణీయులు కారు పిదప 128

వII అది యెట్టిదనిన వినుము 129

మII విపినాంతర్బహుసత్త్వఘాతుకుఁడనై విఖ్యాతకృత్యుండనై
కృప యొక్కించుక లేని నా వదనమున్ గ్రీడారతిం జొచ్చినా
గుపితత్వంబున [1]మ్రింగనైతి జన నీకుంగల్మి గావించితిన్
ఉపకారంబన నింతకంటె మఱి యింకొండెద్ది యూహింపుమా

వII అని యి ట్లా వ్యాఘ్రంబు ప్రలాపించిన నప్పటికిం జేయునది
లేక ద్రుమకుట్టంబు తొలఁగిపోయి యాత్మగతంబున 131

1. మ్రింగినం జనగ నీకుంగ్రమ్మరం గల్గనే – ము.,

కు॥ ఇలపైఁ బాదాహత మై
తలవట్టెడు ధూళి యెగసి తా నొకరునిచే
నలఁపఁబడి వానిఁదొడరం
[1]దలకిననప్పురటికంటెఁ దక్కువ కాఁడే 132

మ॥ అని చిత్తంబునఁ దెంపుచేసికొని రోషావిష్ట మై పొంచి కీ
డొనరింపం దటి వేచియుండి విహగంబొక్కండ యాలస్య మూ
నిన శార్దూలము కన్ను వోఁబొడిచి పూర్ణీభూతసంతోషమై
చని భూజాగ్రముఁబొంది [2]గర్వపటుహాసప్రీతి వాక్యంబులన్

కు॥ వింటే మృగమా పోయిన
కంటికి వగవకుము రెండు కన్నులు వొలయం
గొంట యుడుగుటకు నొక క
న్నుంటకు సంతసముఁ బొందు టుచితము నీకున్. 134

కు॥ అని పలికి యది నిజేచ్ఛం
జనుటయు నయనంబు నొవ్వి సైపక పులి య
వ్వన మద్రువన్ వాపోవుచు
[3]దన కానమివలనిచేతఁ దా హతమయ్యెన్ 135

వ॥ కావున 136

కు॥ బలహీనులగుచు ధీమం
తుల కెగ్గులు సేసి పొందుదురు కీడు మహా
బలులయ్యు ద్రమానుపోటుం
బులుఁగుఁ బరిభవించి తొల్లి పులి చెడ్డక్రియన్ 137

వ॥ అనుటయు నర్భేకంబుల నుద్దేశించి భయదర్శకం బిట్లనియె 138

1.దలకిననచ్చెనటికంటె తక్కువ కాడే - ము, 2. ంయిట్లనియె హాన్యప్రౌఢవాక్యంబులన్ - ము.3.తనదు కృతఘ్నత్వముసన తా హతమయ్యెన్- ము.



కు॥ ఏ నొక పుడిసెఁడు త్రావిన
నీ నూతిజలంబు పొలయునే యంతయు నా
తో నేల పోర నీళ్లకు
నై నిష్ఠురలోభమింత యగునే చేయన్. 139

కు॥ తగుకొలఁది గాని లోభము
మిగులఁగఁ జేయంగ రాదు మిక్కిలియగు లో
భగుణంబుకతనఁగాదే
మృగధూర్తుండొకఁడు తొల్లి మృత్యువునొందెన్ 140

వ॥ అది యెట్లనిన నక్కథ వినుండని యిట్లనియె. 141

సీ॥ విజయపురప్రాంతవిపినాంతరమునకు
బోయ యొక్కఁడు వేఁట పోయి యచట
వనహస్తిఁ గనుఁగొని వల్మీకమెక్క భ
ల్లమునఁ దొండముఁ ద్రుంచి సమయఁజేసె
వాని యెక్కినపుట్ట వడినాగ మొక్కటి
యక్కిరాతుఁగఱచె నంతలోన
వాఁడును మొలనున్న వాఁడి కుఠారంబు
గొని దాని వధియించఁగూలి యొర్గె
గీ॥ నచటి కొక్కనక్క యరుదెంచి ముదమంది
యేనుఁగాఱునెలలు మానవుండు
సప్తవాసరములు సర్పమొక దినంబు
పోవుఁబొమ్ము తనకు భుక్తి కనుచు 142

కు॥ నేఁటి కివి గంటి వెట్టఁగ
నేఁటికి నీ బోయవింట నిడ్డ నరము లీ
పూఁట గడపఁజాలవె యొక
నాఁటం బ్రాణంబు సనునె నవసినమాత్రన్. 143

కII అని తలఁచి యెక్కువెట్టిన
ధనువుఁ గదిసి దాని కొమ్ము తన గొంతుం గ్రో
లున మోచియుండఁజెలఁగుచు
గొనయంబు నరంబు లొయ్యఁగొఱకం దొడఁగెన్ 144

గీII నరము లొక్కఁ డొకఁడు నానిచి కొఱకఁగ
గొనయమెల్లఁ ద్రెవ్వి ధనువుకొమ్ము
మిడిసి గళమునాటి పెడతలఁ దాఁకినఁ
గూసికొనుచు నక్క కూలి గెడసె. 145

వII అట్లగుటంజేసి లోభంబొప్ప దను పలుకు ద్విజిహ్వపలుకు లాక్షేపించును నసారియను వారిలోభంబొప్పదేని యతివ్యయ శీలత్వంబు మేలె యని యిట్లనియె. 146

కII కలిమిఁ దరము గాని వ్యయం
బులు పేరెమ్ములకు జేసి పొలియరె దుర్బు
ద్ధులు నారికేళ బక మను
పులుఁగు దురైశ్వర్యమహిమఁ బొలిసినభంగిన్. 147

వII అది యెట్లనిన 148

గీII పెక్కు నీళులు లేనట్టి యొక్క కొలని
క్రేవ నున్నతమగు నారికేళ మొకటి
చీఁకుగొక్కెర యొకటి వసించు నచట
వారిబహుతరజలచరాహార మగుచు 149

కII అది యొకనాఁడంబరమునఁ
బదివేలు బకాదివారిపక్షులు సనఁగా
నదె నా కొలసాములు పో
యెదరని యడ్డముగఁబాఱి యెక్కుడు ప్రియముల్ 150



కII కావించి మీర లూరక
పోవుట దగ దల్ల భూజమున నిలువు మదీ
యావాసమునకు మీరలు
రావలయును బాంధవాభిరంజన మెసఁగన్ 151

వIIఅని తన వసియించు నారికేళంబును జూపి ప్రార్థించి మఱియు నిట్లనియె. 152

కII కొల నొక్కటి గల దిచ్చట
జలములు నాహారములు ప్రశస్తరుచులతోఁ
గలిగెడి నేటికి మాటలు
వెలయఁగఁ గొలమెల్లఁ బొగడ విందు నొనర్తున్ 153

వII అను పలుకులు విని బుద్ధిమంతంబులగు విహంగములు కొన్ని.

చII వలువదు మమ్ము [1]నాప గుణవంతుఁడ వీవు కొలంబువారిపైఁ
గలిగిన భక్తియున్ బ్రియముఁగన్గొని సంతసమయ్యె నిచ్చలున్
నిలిచినఁగాని కాదె గమకింపగ నిమ్మని పెక్కుభంగులన్
బలికినఁబోవకున్నఁ గని పక్షులలోపలఁగొన్ని దానితోన్

కII ఈ యూథ మిది యనంతము
[2]నీయిరవది యెడము లేదు నిలువఁగనైనన్
దోయంబుల నాహారము
మా యెఱుఁగనియదియె యల్పమాత్రములవియున్ 156

వII అట్లుంగాక 157

కII [3]కనుగొఱత బొందితివి మఱి
చననొండొకదెసకు నీవు చాలవు నీకొ

1.నాగ– ము, 2.నీ యిరవెడ లేదు నిలువ నీ చెప్పిన యా– ము,3. కనుకొలఁ కునందలివి – ము.

క్కనికైనను జలదాగమ
మున యంతకుఁ బోలమడుఁగు పోనీ మమ్మున్ 158

చ॥ అనుటయుఁ బొత్తువారికృప నన్నియుఁ గల్గెడు నన్నుఁ ద్రోచిపో
యినఁగులమెల్లఁ గన్గొనఁగ నిప్పుడ మేను దొరంగువాఁడ జుం
డనుడుఁ బతత్రికోటి మన కారడిఁ బాపముఁ బొందనేల యి
ట్లని యితఁడాడనంచుఁ జని రందఱుఁ గొక్కెరయింటి విందుకై 159

వ॥ అట్లు పోయి 160

మ॥మడువెల్లన్వెరఁజాడి మందుకయినన్ మత్స్యంబు లేకుండ న
ప్పుడ యొండొంటికి మున్న మ్రింగి విహగంబుల్ మాపు నిల్వంగ ని
క్కడ నిమ్మేమియుఁ జాలదంచుఁ జనినన్ గారించుఁ బేరాకటన్
మడిసెన్ గొక్కెర కొన్ని ప్రొద్దులకు హీనంబైన దేహంబుతోన్. 161

వ॥ అట్లగుటంజేసి 162

క॥ వ్యవసాయము కొలఁదియు, దే
శవిధముఁ, గాలంబుఁ, బూర్వసంచితమగు సొ
మ్ము, విచారింపక యుబ్బునఁ
దివిరి వ్యయము సేయునతఁడు దీనతఁబొందున్ 163

క॥ అమరఁగ నాయవ్యయముల
క్రమము జలము పెద్దవాతఁ గైకొని యది స
న్నముగ వెలార్చుచు నుండెడి
కమండలువుఁ జూచియైనఁ గాదే తెలియన్ 164

వ॥ అనుటయు భయదర్శకంబుచితలోభంబు కర్తవ్యంబు 165

క॥ అతిలోభ మొప్ప దతి లు
బ్ధతమై ధనగుప్తుఁడనఁగఁబరఁగిన వణిజుం
డతిశయ నిజవిత్తము భూ
పతి పాలుగఁ జేత వినఁగబడదే కథలన్ 166



వ॥అక్కథ యెట్లనిన 167

ఉ॥ ఉర్వికి భూషణంబయిన యుజ్జయినీనగరంబులోపలన్
గుర్వనురాగమూర్తి ధనగుప్తుఁడు పుణ్యుఁడు వర్ధమానుఁడున్
సర్వధనప్రపూర్ణులయి సఖ్యముఁబొంది వణిక్కులంబు లోఁ
బర్విన పెంపుతోడ ననపాయవిభూతి వహించియుండుచున్.

ఉ॥[1] సీనపుదీవి నిమ్మను బసిండియుఁ దుల్యము లన్న నచ్చటన్
వానియమాడఁబోదమని నావల వేఁకొకఁ డాయితంబుగా
బూని ఘటించి యందినుము పూర్ణముగాఁ నిడి శెట్టి లిద్దఱున్
ఫేనతరంగభంగురగభీరపయోనిధిలోన నావపైన్

చ॥ అరుగఁగ వర్ధమానుని మహాజ్వరమొందిన నేన చాలుదున్
శరనిధియాత్రకున్ వలదు చయ్యన నేగుము నీవు నీకు నే
నెరపి భవద్ధనంబుకెడనీకరసేయక యిత్తు నక్కటా
మరలుము నీవు గల్గిన సమస్తసుఖంబులు కల్గు నెచ్చెలీ 170

మ॥ అని వానిన్ మగిడించి తాన చని యిన్మాదీవి నెత్తొంటికిన్
గనకం బెత్తులు రెంటిలెక్కఁ దెగినం గైకొంచు నాల్గోడలన్
నినుపారంగ సువర్ణ మెత్తుకొని పూర్ణీభూతసానందసం
జనితోద్గర్వ మనస్కుఁడై మరలి యా సాముద్రమధ్యంబునన్. 171

క॥ చనుదెంచుచు ధనగుప్తుఁడు
మనమునఁ దలపోసి వర్ధమానుని యోడెం
[2]డినుమునకై రెండోడల
కనకము నా కెట్లొసంగగా నోపనగున్ 172

1 చీనపుదీవి – ము.2. రెండుపాదములు లిఖితములో లేవు.

కు॥ ఈ సొమ్ములలో నతనికి
వీసము నీఁజాల నేను వెనుక నతం డా
యాసపడి తాను గూర్చిన
నా సకలార్థంబు నాకు నరయొసఁగెడినే. 173

కు॥ ఎక్కడి చెలి తన మాతం
డెక్కడిచుట్టంబు నాకు నీ వననిధిలో
గ్రక్కున మునిగినయప్పుడు
చక్కంబెట్టెడినె యతని సఖ్యము నన్నున్ 174

వ॥ అని తలంచి యంబోధిలోనం బడి 175

ఉ॥ వచ్చుచు వర్ధమాను దెసవారల నందఱి నీరిలోపలం
జెచ్చెర ద్రోచి చంపి యొకచెంగటి తేవపురంబుఁజేరి తా
నచ్చట నాచతుష్కమగు నర్థముఁ బాఁతి దరిద్రతావిధం
బచ్చుపడంగఁ దాల్చికొని యాత్మనివాసముఁ బొందియుండగన్

గీ॥ వర్ధమానుఁడపుడు వచ్చి యన్యోన్య స
మాగమోచితంబులైనవాని
నడప యేను బీదవడితిఁబెక్కులు సేగు
లయ్యె ననుచు వీడనాడి మఱియు. 177

ఉ॥ సొమ్మఖిలంబుఁ బోయిన విశుద్ధచరిత్ర భవత్ప్రతి ప్రయా
ణమ్ము మనంబులో ననుదినంబును గోరఁగ రాక గల్గె మీ
కెమ్మెయి లాభముంబడసె యే క్రియ వచ్చితిరన్న లేని దుః
ఖమ్ములు చెప్పుచున్ సుకృతకారికి నా ధనగుప్తుఁడిట్లనున్. 178

శా॥అన్నా!యేమని చెప్పుదుం జెఱచె దయ్యం బీ ప్రమాదంబునన్
మున్నీరెల్లను దాఁటి యమ్మెడుపురంబుంజేరి యందొక్క నిం
ట న్నిండారఁగ బండమెల్లనిడి యుండంగం ద్రిరాత్రంబులో
విన్నంబొంకగునట్లు గాఁగ నెలుకల్ వే మ్రింగె నా లోహమున్ 179



కు॥ కొండంత యినుము దినియెను
ముండ యెలుక లేమి చెప్ప ముప్పాతిక యె
త్తుండంగని యేమచ్చట
నుండఁగ లజ్జించి మగుడ నుదధి గడచితిన్. 180

కు॥ పొలిసిరి తెవుళ్ల నీవా
రలు రోగము లచటఁ బెద్దరాఁబో నెడలై
యలజడిఁ బొందితిఁ బాపపుఁ
జెలిమికతమునన నిన్నుఁ జెఱచితిఁ జాలన్ 181

కు॥ అని పలికి వీడుకొలిపిన
ననయము నిది బొంకు పొసఁగ దాత్మధనము వం
చనఁ గొనియె నితండని తన
మనమునఁ దలఁచియును వర్ధమానుండచటన్. 182

వ॥ ఏమియుం బలుకక నిజగృహంబున కరిగి యిట్లని
తలంచుచు 183

గీ॥ నమ్మఁదగదు మొదల నమ్మి రాత్మకా
ర్యమున కొరులఁబనిచి యందు వార
లరయ సేసిరేని యడియాస మెఱుఁగక
విడువఁబడుట యెల్ల వెఱ్ఱితనము 184

కు॥ సొమ్ముల యెడ నెవ్వారల
నమ్మఁదగదు నమ్మకుండినను జరగదిలన్
సొమ్ము గలవారి నర్వులఁ
నమ్మఁగఁ గీడైన నేమి మనఁగలదు తుదిన్ 185

కు॥ తన దేహము నిత్యం బే
తన ధనమది సెప్పనేల తాను దన ధనం
[1]బును దైవధనంబులు తన
ధనములతడు పఱచినట్టు తగదే పడగన్ 186

1. 185 – లో చివరి రెండుపాదములు 'లి' లో చేరలేదు.

కII చెలితనమునఁదను జెఱచిన
తులువంగని తొలఁగిపోక తోరపుఁబ్రియముల్
పలుకుల తీపులు చూపుచుఁ
జెలియై వర్తించి గాని చెఱుపఁగ నగునే. 187

కII అని నిశ్చయించి యాతనిఁ
తనయెడ[1]నొకవేఱులేని దట్టపునెయ్యం
బొనర [2]న్నటించి యొకనాఁ
డనురాగియపోలె నతని యాత్మోద్భవునిన్. 188

కII లాలనము సేయుగతిఁ దన
యాలయమున కెత్తుకొని రయంబునఁ జని యే
కీలున నెవ్వరు నెఱుగఁగ
జాలని యెడ దాఁచి దుఃఖిచాడ్పున నుండెన్ 189

ఉII కొండొకసేపులోన ధనగుప్తునివారలు వచ్చి పాపనిం
దెండని పల్కినన్ వగచి తెక్కలి గృధ్రమొకండు నాదు చే
నుండఁగ బిడ్డనెత్తుకొని యుగ్రతఁబోయినదేమి సెప్పుదున్
నిండిన తీవ్రదుఃఖమున నీట మునింగినవాఁడు వోలెనై

ఉII సెట్టికిఁ జెప్పరా నచటఁ జేరఁగనోడెదనన్నఁబోయి యా
పట్టివిధంబువా రతనిపల్కిన యట్లన చెప్పినం బులిం
గొట్టిన యట్టు లల్గి ధనగుప్తుఁడు లోకములోన నెన్నఁడే
నిట్టివి వింటిరే యని మహీపతి కంతయు మెల్లఁ జెప్పినన్.

గీII వర్ధమానుని రప్పించి వసుమతీశుఁ
డింత దొరమానిసివి బొంక నిట్లు తగునె
బాలకుని గ్రద్ద యెత్తుక పాఱెననుట
యే విధంబున నెచ్చటనేని గలదె. 192

1. నొక వెఱవు లేక – ము, 2. నటియించి–ము.



వII అనిన వర్ధమానుఁడు ముకుళితకరకమలుండై యిట్లనియె 193

ఉII దేవర[1]పొందుగాదని మదిం బరికించితిరట్ల సర్వమున్
భావములో నెఱుంగఁదగు నావల రెంటి యయంబునెల్కలీ
భూవలయంబుపైఁ దినుట పోలగునే యిది సెట్టి సెప్పెదున్
నావెఁడు మద్ధనంబు గొని నా కిడనొల్లక శాఠ్యబుద్ధియై. 194

కII అనుటయు జనపతి యిది యె
ట్లని యా ధనగుప్తుఁజూచి యడిగిన నా యా
తని పొత్తున జీవనమునకు
నిను మోడల రెంటఁ గొంచు నేగితి నధిపా 195

కII కొనిపోయిన యినుమంతయుఁ
దనదు నభాగ్యమున నెలుక తండము భక్షిం
చిన నా యిను మోడెంటికిఁ
[2]గనకము దెమ్మనుచు నన్నుఁ గల్లలె నడపెన్ 196

వII అనిన వర్ధమానుండప్పలుకులు దెలియ నవధరింపుండని రాజు
నుద్దేశించి 197

కII రెండోడ లినుము మూషిక
కాండము భక్షించె ననుట కల్లపలుకు గా
కుండినయట్టై గృధ్ర మొ
కం డొక బాలు గొనిపోక కడుననుచితమే 198

చII అనవుడు రాజు నవ్వి సచివావళి జూచుచు నంతమేటి బొం
కున కిది పోలునంచు ధనగుప్తుఁగనుంగొని యేటి మాటలే
యినుము భుజించునే యెలుక లింతటి మానిసి విట్లు పల్కినన్
విని ప్రజనవ్వరే యితని విత్తము నీతని కిమ్ము నావుడున్

1. పొందుగామిని–లి, 2. కనకంబోడెదని నన్నుగల్లలెనపెడున్ – లి.

కll ధనగుప్తుండితఁడిచ్చిన
యినుమునకే యినుము గాక యేలా యిత్తున్
గనకంబనుటయు భూపతి
కనలుచుఁ దనయొద్దఁ జనవుగల లెంకలలోన్ 200

వll [1] కొందఱం బిలచి 201

కll ఓరీ! కోమటి ముక్కున
నీరెత్తుఁడు మేముకనియ నేరక యున్నన్
నోరికి వచ్చినయట్టున
వారణ యొక్కింత లేక వాదులఱచెడిన్ 202

మll అనినన్ లెంకలు ద్రోచికొంచుఁ జనఁగా నయ్యా కడున్ బొంకితిన్
గనకం బోడెఁడు కల్గె గాని మిగులంగా లేదు నీ యాన నీ
తనికందర్థము వెట్టఁబంపుఁడనుచున్ దథ్యంబుగా దిప్పుఁడీ
తని పల్కంచు విభుండు పల్కుటయు బాధంబెట్టఁగా నత్తఱిన్.

చll ఇనుమున కబ్ధిలోఁ బసిడి యిబ్బడి గల్గుట నాలుగోడలం
గనకముఁ దెచ్చికొంట చెలికాని భటప్రకరంబుఁగ్రూరతన్
వనధిని ద్రోచిచంపుట సువర్ణము పాతిన చోటు సర్వమున్
గొనములప్రోక యైన ధనగుప్తుఁడు సెప్పిన రాజు నవ్వుచున్

మll ధనమెల్లన్ గడుఁవేగఁ దేఁబనిచి చేతఃప్రీతితో వర్ధమా
నుని కొప్పించిన దేవ!నా ధనము నన్నుం జేరినంజాలు నం
చు నతండర్థము గొన్న మెచ్చుచు మహీశుండందుకున్ శిక్షగా
ధనగుప్తార్జిత సర్వవిత్తచయమున్ దాఁగొంచు నుగ్రాకృతిన్

1. ఈవచనంలేదు -ము.



కll ఇల పురమును దేశంబు
[1]న్వెలువడఁ ద్రోపించుటయును నెలఁతుల్ బి
డ్డలు దాముం దిరిసికొంటన
యిలపై ధనగుప్తుఁ డిట్టి యిడుమలఁబడియెన్ 206

కll కలమెండినుమునకై యిరు
కలముల హేమంబు తనకుఁ గలిగిన యపుడున్
వలను గలిగి ధనగుప్తుఁడు
మెలగంగా నేర డల్పమేధత్వమునన్ 207

కll లోభంబున ధనగుప్తుని
ప్రాభవమట్లడఁగె నాదు పలుకులు విని మీ
లోభం బుడుగుఁడు నీఘల
కై భూమి నిట్టిలోభ మగునే చేయన్ 208

వll అని పలికి యవ్వర్షాభూవల్లభు మున్నవోలె బహువిధంబుల
స్తుతియించి భయదర్శకంబు మఱియు నిట్లనియె. 209

గీll చిఱుత నాఁటఁగోలె జీవహింస యొనర్ప
దాని వ్రతము గాఁగఁ దడవనేల
జీవహింసఁజేయు జీవులు బొంకిన
గాలి సోకఁ దనకుఁ గల్మషమగు. 210

వll అనుటయు నప్పలుకులుద్దేశించి యభిజ్ఞుండనుప్లవంగంబు దన
పతికిట్లనియె. 211

కll అతినిష్ఠ యనాచారం
బతిశౌచ మశౌచభంగి యతినింద యతి
స్తుతి యివి ధూర్తుల గుణములు
గతి మఱి నైచ్యంబు దుష్టకపటము దెలియన్ 212

1. వెలువడ....నెలఁతుల్ - ము, యతిభంగం అని-ము, కాని న్వె-నె, యతి కుదురును.

వ॥ అది యెట్లనిన 213

గీ॥ ప్రాయమునఁ బెద్దవాఁడొక బ్రాహ్మణుండు
లక్షణజ్ఞుండు సంగీతలక్షణాంగి
నొక్క కన్నియఁబెండ్లియై యొరుల గోష్ఠి
మరగకుండంగ సఖి నేలమాలెఁ బెట్టి 214

క॥ పెనుపఁగ నంద పెరిగి నా
వనితయు యౌవనవిలాసవైభవములు దా
ల్చిన ఋతుకాలంబన విని
చనుదెంచెను విప్రుఁడొక నిశాసమయమునన్ 215

గీ॥ వచ్చి యాలి రూపవతి నోరకన్నులఁ
జూచి బిట్టబిఱ్ఱు సురతమునకు
వేగపడిన నచట వెలిగెడి దీపంబుఁ
జూచి యిట్టులనియె సుదతి పతికి 216

క॥ అనలుఁడు పురుషుఁడు దీపం
బనలుఁడు పరపురుషుఁడైన యనలుని నేఁజూ
చినఁ దప్పకాక నన్నితఁ
డనవరతము [1]చూచుచుండుటర్హంబగునే 217

క॥ కావునఁ దమ ప్రాణేశుల
దీవియలుండంగఁ గవయుతెఱవల శీలం
బే వెలితిగఁదలఁతు ననుచు
దీవియదించి సుఖకేలిఁ దేల్చె నిజేశున్. 218

చ॥ అతఁడును సౌఖ్యమొంది తన యంగన యాడిన సాదుమాట హృ
ద్గతముగ దాని శీలవతిగా మది నమ్మి నిజేచ్ఛ నున్నచోఁ
గతిపయమాసముల్ చనిన గర్భిణియై యొకనాటిరాత్రి యే
కతమున నాథుతోఁ బ్రసవకాలము దగ్గఱియుండ నిట్లనున్

1.జూచుచుండ నర్హుండగునే- లి.



ఉ॥ నా కుదయించు బిడ్డ యిది నాతుక గాక సుతుండయేని న
స్తోకవివేక!యన్యపురుషుండనఁగాఁబడుఁగాన వాని నా
లోకన సేయకున్నఁబరలోకము నొందెదు పుణ్యకామినీ
లోకము నాథుఁదక్క నవలోకనమొండొకమర్త్యుఁ జేసినన్ 220

గీ॥ ఇతరపురుషుని విన్నప్పు డేమి చెప్పఁ
జెవులు రెండును బుండ్లగు జీవితేశ
నిన్ను వినఁజూడ వీనులు గన్నుదోయి
కలిగి తక్కినయెడ నవి వలవదందు 221

మ॥అని తత్సన్నిధి నేత్రపట్టము దృఢంబైయుండ నయ్యింతి తా
ల్చిన నాతందును నమ్మి భూగృహనివాసిత్వంబు మాన్పించి యా
త్మ నివాసంబున నిడ్డఁ బుత్రవతియై తత్పుత్రు నెన్నండుఁ జూ
డని యాచారముతోడఁ బెంచెఁ దన నైష్ఠ్యంబెల్లవారున్నగన్ 222

క॥ అంత నొక దివసమున గ్రా
మాంతరముననుండి వచ్చె నా గృహపతిపై
నెంతయుఁ గూరిమిగల మతి
మంతుఁడు తజ్జనకుభ్రాత మనుమనిఁజూడన్. 223

ఉ॥ వచ్చి తదీయమందిరము వర్తనమెల్ల నెఱింగి యక్కటా
సచ్చరితంబు గల్గు సతిచాడ్పున ముద్దఱికంబు చూపుచు
న్నమ్మచ్చిలి రాత్రు లీ జరభి మూఁడు జగంబులు మ్రింగుచుండె వా
పుచ్చకయున్న నా కొడుకు బోదఁడెఱుంగునె దీని చెయ్దముల్ 224

వ॥ అని మఱియు నాత్మగతంబున 225

సీ॥ మగనివారెవ్వరు మందిరంబున లేక
[1]జవ్వనంబునఁ దాన చనటియైన
నెల్లకాలము పుట్టినింటనె నిల్చిన
యాత్రోత్సవంబుల కరుగుచున్నఁ
బని లేక పొరుగిండ్లు పలుమాఱు ద్రొక్కిన
మగవానితో గోష్ఠి మానకున్నఁ
జెడ్డ యింతులతోడఁజెలిమి యొనర్చిన
వరుఁడు ప్రవాసైకనిరతుఁడైన
గీ॥ విభుఁడు కొనటివాఁడైనను వృద్ధుఁడైనఁ
దన్ను మెచ్చక యొక్కతెఁదగిలెనేని
బచనికాఁడేని నెప్పుడు బరుసనైనఁ
జెడక తక్కదు ధరనెట్టి పడఁతుకైన 226

వ॥ అట్లు గాక 227

క॥ వృద్ధునకుఁదరుణి యమృతము
వృద్ధుఁడు దరుణికి నసహ్యవిష మూహింపన్
వృద్ధకుఁదరుణుండమృతము
వృద్ధయుఁదరుణునకసహ్యవిష మూహింపన్ 228

క॥ అని తలపోయుచు నేకత
మున తానొకనాఁటి రేపు పుత్రుఁడు గ్రామం
బున పొంతచేని యొద్దకుఁ
జని యుండఁగ నచటికేగి సముచితభాషల్ 229

వ॥ కొన్ని యాడి తదనంతరం బిట్లనియె 230

క॥ నీ యంగన కపటాచా
రాయత్తము మాకు వెడలనాడుట తగదే

1.జవ్వనంబున దన చనవయైన – ము.



మీ యున్న రాత్రులంద త
దీయవ్యాపారమెల్లఁ దెలిసితి మనినన్ 231

క॥ కడు నమ్మక[1]యుండిన నె
క్కుడు నమ్మినఁజెడుట నిజము గోతులఁ జిన్న
ప్పుడు నమ్మక భూగృహమున
నిడనేటికి నిప్పుడేల యిటుగా నమ్మన్. 232

క॥ పొడమదు చేయని కార్యము
పొడమక యుండంగఁ గప్పిపుచ్చెద మన నె
న్నఁడు రాదు సేయుకార్యము
వెడమాయపు మనుజులేల వేల్పుల కైనన్. 233

క॥ అతులైశ్వర్యఘనుఁడు సం
తత యజనుఁడుఁ గామరూపతా ఘనుఁడు బృహ
స్పతిసఖుఁడన వెలయు దివ
స్పతి జారత్వమును బయలఁబడియెన కాదే. 234

క॥ పుత్రస్నేహమునట్టి క
ళత్రముపై గూర్మియును దలంపక దానం
బాత్రము చేయము కినుకకు
[2]గోత్రమునకు మాట వచ్చుకొఱకే భార్యల్ 235

వ॥ అని యిట్లు పలికి 236

క॥ ఊరికిఁ బోయెదమేమని
పూరితబాష్పాక్షుఁడగుచుఁ బోయిన విప్రుం
దూరక యొకవడి నిలిచి య
గారంబున కేగి లజ్జ గదరిన మదితోన్ 237

1.యున్నను –ము,2.గోత్రము వోనాటవచ్చుకొఱకే భార్యల్ –ము,

కII దూరగ్రామం బని దగఁ
బే రొక్కటి చెప్పి కపటపేశలమృదు భా
షారసమున నూరార్చుచు
దారను వీడుకొనిపోయి తగునొక వంకన్ 238

మII పగలెల్లన్ వెలి నిల్చి రాతి రరుదౌ భంగిన్ స్వగేహంబున
ట్టుగ మీఁదన్ వసియించి భార్యపయి దృష్టుల్ నిల్చియుండగఁ బ్రొ
ద్దగుడుం గంజి మడుంగు పేర రజకుండత్యాస్థ నేతించినన్
[1] న్మృగశాబేక్షణ లోచనావరణము న్వేగంబునం బుచ్చుచున్.

కII తలతలుపు దానె వెసఁజని
బలువుగ నిడి వచ్చి యింటఁబ్రభువే వంకన్
మెలఁగునొకో యను తలఁపున
నలుదిక్కులు చూచి జారనాతుక ప్రీతిన్. 240

కII కదియఁ జనుదెంచి కౌఁగిటఁ
గదియఁగ నందంద పేర్చి కామాతురయై
సదనములోనికి రమ్మని
తుద చేదిగిచికొని వానితో నిట్లనియెన్. 241

ఉII నీ కొడు కూర లేఁదు మది నిర్భయ మందుము వాఁడు గ్రమ్మఱన్
రాకయునచ్చుటంబదిదినంబులు వోయినఁగానిలేదు రా
గాకులచిత్తనైన నను నక్కఱవో రతికేళిఁదేల్తు ర
మ్మా కుదువంగ నీకు నని యట్టులు వండినదాన వేఁడిగాన్. 242

కII అని భోజ్యంబులు శీఘ్రం
బున నిడి తనయర్ఘ్య పళ్యమున నిద్దఱుఁబొ

1. మృగరాజేక్షణ..... మోదంబుతో 'ము' యతిభంగము.



త్తునఁగుడువఁజూచి విస్మయ
ఘనలజ్జాక్రోధ దుఃఖగతమానసుఁడై. 243

గీII బ్రాహ్మణుఁడు మందిరాంతరప్రాప్తమైన
యచటి యట్టువు దిగి వెస యంగణంబు
వెడలి యారెకులను దెచ్చి వేగఁబట్టఁ
బనిచి యిద్దఱ నొప్పించె జనవిభునకు 244

కII ఊరి ప్రజలెల్ల నత్యా
చారంబున మెలఁగు కులటచరితము లహహా
యారూఢతఁజెప్పంగా
భూరమణుండర్హదండమున నుగ్రుండై 245

కII ఇరువుర దండించె మహీ
సురుఁడును దన యాలి చెయ్వు సొలయుచు భార్యాం
తర మొల్లనొంద కెంతయు
విరతుండై యరిగెఁదాను వెస నిష్కాస్థన్. 246

వII అట్లగుటం జేసి 247

కII అత్యాచారపు మాటలు
నత్యంతస్తుతులు కల్లలగుట వినవె సాం
గత్యాన కేల నమ్మెదు
ప్రత్యక్ష క్రూరమైన పాము వచనముల్. 248

కII మా వాక్యంబులు వొందవు
నీ వీనులఁ దగినవారి నీతివచనముల్
భావింపని వారలపై
దైవంబును నలుగునింత తథ్యము చుమ్మీ. 249

కII అని పలికి యభిజ్ఞుఁడు మౌ
ననియతుఁడై యూరకుండినన్ దక్కిన వా
రును నట్ల నిలువ వెండియుఁ
దనుఁ బొగడిన మేనువొంగి తత్క్షణమాత్రన్. 250

కII ఉరగంబునకచ్చటు సొరఁ
దెర [1]విచ్చుటయును జొచ్చి తెలినీళులు చె
చ్చెరఁ గ్రోలియుఁ జిఱుకప్పల
నెరగొనియును లావువొంది యిచ్ఛానిరతిన్ 251

మII భయదాకారముఁ బేర్చి దర్దురములన్ భక్షింప నానాటికి
న్లయమై పోయి దశాంశశేషమగు సేనం జూచుచు న్మంత్రులున్
బ్రియులుం జుట్టలు నుండి దూఱ వినుచున్ భేకాధినాథుండు ని
శ్చయహీనాధికచింత నొందుచును బశ్చాత్తాపసంతప్తుఁడై 252

కII [2]ఉండియు నురగము గన్గొని
మండూకకులంబునెల్ల మడియించితి మి
త్రుండనఁగ నుండి తగునే
యొండొరులకుఁ గీడుసేయు టుచితమె మనలోన్. 253

చII అన విని నవ్వుచున్ భుజగ మాతని కిట్లను నీ ప్రధాను లె
ల్లను గడుపాపకర్ములు చలంబున నిన్నును నన్నుఁ బొందనీ
కనయవిహీనబంధులయి కల్లలు ప్రేలిరిగాన వీంద్రురన్
మనిచిన నీకు నాకుఁ గల మైత్రి హరింతురు వక్రభాషలన్. 254

కII అని పలికి వారి యెదురునఁ
దనుఁజొరనీ కడ్డవడిన తన్మంత్రుల నె
ల్లను ద్రుంచి యంత నిలువక
దినములలో మ్రింగె నొకడు ద్రిక్కక యుండున్. 255

వII అప్పుడు 256

మII తనవారెల్లరు బోవ నొంటిపడి భీతస్వాంతుఁడై బ్రొక్క మా
టున మోమర్ధము దోఁపనున్నతని మండూకాధిపుం జేరి యి

1. వెరగించుటయు -ము, 2. ఉండిభుజంగము - ము.



ట్లనుఁబామక్కట యేను నూతిదరి దాహంబొంది కూపెట్టఁగా
నను రప్పింపని నీకు రాజ్యమదగర్వంబైన చిత్తంబుతోన్. 257

కII ఈ జలము పట్టిచూడ మ
హాజగమది కప్పప్రువ్వులట యందుఁబ్రజల్
పూజింపవారి కెల్ల
న్రాజట యొక కప్ప యిట్టి నగవులు గలవే. 258

వII అని యిట్లు సాహసంబుగాఁబలికి యాభయదర్శకంబు మఱియు
నిట్లనియె. 259

కII నీ పెరిమలు మా కిప్పుడు
సూపెదవే నగరిలోను జొచ్చి యనుచు నా
టోపముతో భేకంబును
వాపోవఁగఁ గఱచి చంపి వడి గ్రసియించెన్. 260

వII కావున 261

కII బలియుండగు పగతున కెడ
గలిగి చనఁగవలయు వాఁడు కార్యముకొఱకై
కలయఁగ వచ్చిన నల్పుడి
కలసికొనఁగవలదు బుద్ధి గల మనుజులకున్ 262

కII అని యిట్లు సుమతి యెఱిఁగిం
చిన కథ విని చాల సంతసిల్లి యిరువురుం
గొనియాడి రప్పు డా సఖిఁ
గనుఁగొని సుకుమారి కనియెఁగదునెయ్యమునన్. 263

కII ఏకాధివాస మైత్రిన్
జేకొని మేఖలకు హితవు చెప్పు తలఁపునన్
బోకుము నీ వెన్నఁడు నది
గైకొనదు హితోక్తి తెలియఁగాలేదు మదిన్ 264

కII అపగతవివేకులకు హిత
ముపదేశించుటయు వారినొందుటయును నీ
తిపరుల కొప్పదు విహగము
కపి సహవాసమునఁబడిన కాఱియ వచ్చున్. 265

వII అక్కథ యెట్లనిన 266

కII కాననమొక్కట బహుఫల
సూనక మొకమ్రాన నొక్క సూచీముఖమ
న్వానరముం దమలోపల
నూనిన నెయ్యమున నుండ నొకనాఁటి నిశన్. 267

కII మిన్నెల్ల నీలమేఘ
చ్ఛన్నంబగునొక్కవాన సాంద్రజలంబై
మున్ను గురిసెఁదుద నీదయు
సన్నపుఁ జినుకులును విపినచరబాధలుగాన్ 268

వIIఎడపకయున్న సమయంబున వానరంబు చెలియగు నగ్గిజిగాఁడు

చIIమిడుఁగుఱుఁ బుర్వు [1]మున్ను తగు మృత్తిక [2]తోదుదయంటఁ జేసియు
క్కెడ [3]నట లోన నుండ నది యిమ్ములఁగ్రాలెడు [4]దీపరేఖగాఁ
దడియని గూటిలోనఁ బ్రియదారయుఁ దానును నుండి సీతునం
[5]గొడఁగర వోయి యున్న సఖి [6]గొంతిఁ గనుంగొని చాలఁగుందుచున్

వII నీడద్వారంబునకుం జనుదెంచి యతనితోడ 271

కII [7]వడఁకెదు గదయ్య వానకుఁ
కుడువగలేదయ్యొ రాత్రి కుందుదు గాకె
న్నడు వేగు నెవ్విధంబున
నుడుపుదు నీ బాధ యెట్టులూరక నిలుతున్ 272

1.వెన్ను, 2.పాదున, 3.నఱలోన నిడ్డ 4.రూపరేఖ, 5.గొడుగుర, 6.క్రోతి – ముద్రితాల్లోని పాఠాలు, 7.వడకెడుగదయ్య వానకు। నుడుకువ లేదయ్యొ రాత్రి యుగమునుగాకె।న్నడు వేగునె యెవ్విధమున। నుడుగున్నీబాధ యెట్టు లూరక నిలుతున్ –ము.



కII ఎడ లేదు నిన్ను రమ్మనఁ
గడుసన్నము నా గృహంబు కపివర పెక్కా
డెడిదేమి యిట్టి పుట్టువు
వడసిన యెడ కాదె నాదు పౌరుషమడఁగెన్ 273

ఉII మచ్చిక రెట్టిగాఁగఁదన మందిర మొంది యభీష్టవస్తువుల్
నెచ్చెలు లెల్లప్రొద్దు సుఖలీల జరింపఁగఁ జేయలేమి లోన్
వెచ్చని యూర్పు నించి కడు విన్నదనంబును నూని నెవ్వగ
న్విచ్చినయట్లు సజ్జనుఁడు వేఱొక దుర్దశచేత నొచ్చునే. 274

కII ఓర్వండెఱుఁగక యుండఁగ
నోర్వం డెఱుగంగఁ జూడకుండఁగ నోర్వం
డోర్వఁడు సూడఁగ సుజనుం
దుర్విం దనవారికైన యొప్పము లెందున్. 275

వII అని తగుమాటలాడి పెద్దయు వగచి మఱియు నప్పక్షి యిట్లనియె.

గీII కాలఁజేతఁబేదగాని నీయట్టి వాఁ
డకట యుండఁగల్గు నాలయంబు
మున్ను జేసికొనని మోసాన నీ పాట్లఁ
పడఁగవలసె నిపుడు నడియు రేయి 277

కII అని పక్షి హితము సెప్పిన
విని వెంగలియైన క్రోఁతి వీఁడిరవున నా
లును దాను నుండి నన్నొక
పినుఁగుంగాఁ దలఁచి కాదె ప్రేలఁ దొడంగెన్. 278

కII తన యింట దివియ యుండఁగ
నను గాయు మనందు నెగడి నాతోఁగొఱమా
లిన మాటల నిసుమంతయు
గొనకుండఁగ నాఁడె నిట్టి కుటిలుఁడు గలఁడే. 279

చ॥ తన కటె యిల్లు గల్గెనటె తాదొర నా కటె యిల్లు లేదు న
 న్నునఁగదుఁ గ్రొవ్వె నీ పులుఁగు పుచ్చెద దీని మదంబటంచు
 బెల్లనఁదరుశాఖ విర్చి కపి యచ్చటి చేరువఁబల్వలోదకం
 బునఁబడవైచె నంత వెఱముట్టి ఖగాంగన గూయుచుండఁగన్

వ॥అప్పుడు 281

క॥ తడిసిన యెఱకలు నీళ్లం
 బడి బెగడిన మనసు గలఁగఁబ్రాణేశ్వరి న
 [1]య్యెడరు విడిపించి మఱి యొం
 డెడకుం గొని పోయి పక్షి యిమ్ముల నుంచెన్. 282

క॥ కావున వివేక హీనుల
 త్రోవంబోవలదు వారితోడి చెలిమి దా
 నేవెంటనైన నాపద
 గావింపక పోదు సుమతి కలితుల కైనన్. 283

క॥ ధర దుష్టసఖుల గుణములు
 వెరవున నేమేని జేయ వేచుట తప్పుల్
 పరి గొలుపుట మర్మాంతర
 పరిహాసము సేయుచునికి పంకజవదనా. 284

వ॥ అని సుకుమారిక యెఱింగించిన కథ యిరువురుం గొనియాడి
 రప్పుడు మకరందిక యిట్లనియె. 285

క॥ ఇమ్ముగ జెలిమి యొనర్చినఁ
 గుమ్మరి పుర్వుల విధంబు కుజనులు చూడన్
 సొమ్మిత్తురు తుది ముట్టినఁ
 దమ్మిత్తురు నీతిపరులు తగు మిత్రులకున్ 286

1.య్యెడనుడిపి తెచ్చి యొండొక । యెడకుంగొని యేగి పక్షి యిమ్ముల నుండెన్ – ము



వ॥ అని మఱియు నిట్లనియె. 287

గీ॥ బుద్ధి మాలిన యొకకపి భూమిపాలుఁ
 జంపి హితుఁడయ్యు; నొకదొంగ శత్రుఁడయ్యు
 విప్రు నొక్కరుఁ గాచె వివేకి యగుట
 సుమతి పగమేలు విమతి నెయ్యమున కంటె 288

వ॥ అది యెట్లనిన 289

క॥ మందరపురిఁ గాంతా జన
 కందర్పుఁడు గలఁడు రాజు గజవృత్తి సమా
 ఖ్యం దనరి బుద్ధిమంతులఁ
 జెందఁడు సాక్షరుఁడు గాఁడు శిశుకాలమునన్. 290

క॥ గర్వోద్ధతచాపలమున
 దుర్వర్తనుఁడైన నృపసుతుని చేయిడుముల్
 సర్వముగని తన్మంత్రులు
 దుర్వారాసహ్యబహుళదుఃఖాన్వితు లై. 291

వ॥ ఆత్మగతంబున. 292

సీ॥ అక్షరజ్ఞుఁడు గాని యతనికి శాస్త్ర పు
 రాణాగమాదులు రావు దెలియ
 గ్రంథాధిగమశక్తి గలుగక శుద్ధవి
 వేకంబు లేదు వివేకబుద్ధి
 కలుగక కర్తవ్యకర్మంబు లెఱుగఁడు
 కర్తవ్య మెఱుఁగక కడఁగి చేయు
 క్రియల నీగఁగ రాని కిల్బిషంబులఁబొందుఁ
 బాపుండు నరకకూపమునఁదెళ్లు.

గీ॥ నరకవాసి పేద నరుఁడగుఁ బేదయై
కడుపుకొఱకుఁబాతకములు చేసి
రౌరవమునఁగూలుఁగ్రమ్మఱ నట్టు లా
పదలకెల్లఁగుదురు చదువు లేమి 293

వ॥ అని చింతించుచుండ నక్కాలంబున 294

సీ॥ ఎలుక వేఁటలపేర నేగి పట్టణములోఁ
బ్రజల యిండులు కూలఁదవ్వఁబంపు
జెలఁగి దేగలకుఁదొండల నేయఁ బోయి ద్రా
క్షామంటపంబులు గాసిసేయుఁ
గోడిపోరుల పేదవాడలఁ దిరుగుచుఁ
బొడఁగన్న కడవలఁ బొలియవైచు
వేఁటకుక్కలఁ దెచ్చి విడిచి మందలలోని
మేఁకల కుసికొల్పి మెచ్చి యార్చుఁ
గీ॥ గాలకింకరులట్టి కింకరులతోడఁ
గూడి రాఁగూడి ప్రొద్దునఁగుడుపు దొరఁగు
వెడఁగుఁదనముఁ బ్రబల్లదమును వేనవేలు
[1]గ్రమము నందును జేయు రాకొమరుఁడిట్లు 295

కు॥ ఉరులును బోనులు గూళ్లను
బరుసని చెయ్దములు గాలిపడగలు బొరిగిం
కరులం బొడిపించెడి యా
సరభసములు దక్క నొండు సైప వతనికిన్ 296

కు॥ ఆ నరపతి వనమున నొక
వానరపోతంబుఁ దెచ్చి వాత్సల్యముతో
దానిఁ బెనిచి యాయుధ వి
ద్యానైపుణిఁ నొందఁ జేసె యది వర్ధిలుడున్ 297

1. మదముతోఁజేయుచును రాకుమారుఁడిట్లు – ము



కు॥ కంచుకము దొడిగి కుండల
చంచత్కటకాది వేషచయమిడి శితఖ
డ్గాంచిత రూపముతోఁ దన
కంచుకి యై యుండఁబనిచెఁ గదలక యుండన్ 298

సీ॥ ఆ రాజు మందిరోద్యానంబునకు నేగి
యొకనాఁడు తాను బయోజముఖులుఁ
దడవుగాఁ గ్రీడించి యొడలు నిద్రాలసం
బగుటయు నందఱ నచట నచట
వసియింపుఁడని పంపి వనచర మొక్కండు
తోడరా దట్టంపు నీడ నిలిచి
పరిమళమృదుశీతపవనంబు నెలవైన
గురువెందపందిరి గుజ్జు సెజ్జ
గీ॥ సుప్తుఁడగుచుండి వానరుఁజూచి నన్ను
డాయ వచ్చిన జీవుల వేయు ఖడ్గ
ధారఁదునియంగ నని చెప్పి కూడె నిద్రఁ
గపియుఁబనిపూని భూపతిఁ గాచియుండె 299

వ॥ ఆ సమయంబున. 300

మ॥ సుమనోదామము రాజు కంధరమునన్ శోభిల్ల నత్తావికై
భ్రమరం బొక్కటి మూఁగ దానిఁగని కోపవ్యగ్రమై క్రోఁతి ఖ
డ్గమున న్వేసినఁదేటితోన ధరణీకాంతావతంసంబు కం
ఠము రెండయ్యెననీతియైన పతిచేష్టల్ చేటు దేకుండునే. 301

వ॥ వివేకియైన చోరుండు శత్రుండయ్యును విప్రుంగాచిన విధంబెట్లనిన.

గీ॥ నందినీనామనగరంబునందుఁ గలఁడు
బంధుకుండనియెడు నొక బ్రాహ్మణుండు
ధనికుఁడట తొల్లి యవిలంఘ్య దైవఘటన
బిన్నలై పుత్రులుండంగఁ బేదవడియె 303

వ॥ అప్పుడు 304

మ॥ కటిబద్ధాంబరఖండ మృత్పుటలికా క్రాంతస్తనోపాంతికన్
జటిలాపింగళ కేశపాశ బ్రణతోష్ఠ ద్వంద్వ దీనాననన్
కటకస్థాన పరీత రజ్జు వలయం గాత్రస్థమాలిన్య ను
త్కట బాష్పాక్షఁడు జూచె బంధుకుఁడు దుఃఖవ్యాపినిన్ గేహినిన్ 305

వ॥ అట్లు చూచుచు నాత్మగతంబుగ 306

మ॥ బలవద్దైన్యము వక్త్రగహ్వరముగా బల్చోటులంగొన్న య
ప్పులు మైచారలు గాఁగ బాలరుదితంబుల్ మ్రోగుట ల్గాఁగ దు
ర్నిలయారణ్యములో భయప్రకటమూర్తి క్రూరమై యుండఁగాఁ
దలమే వెల్వడఁ జేయ లావుకలిమిన్ దారిద్ర్యశార్దూలమున్ 307

ఉ॥ ఐనను దీనిఁ బాపఁదగు యత్నము చేసెదగాక చిత్రప
ర్ణినగరంబునం గుణగరిష్ఠుఁడు పూర్ణధనుండునై మదీ
యానుజుఁడున్నవాఁడు విపులాఖ్యుఁడువానికి సొమ్ము గల్గఁగా
నేనిటు బీదనైన విధమిచ్చ నెఱింగిన వాఁడు కుందఁడే 308

వ॥ అతండొసంగు కనకము గొని వచ్చి యిచటం గర్షకుండనయ్యెద. 309

సీ॥ ఈ లోకమింతయు నాలుగు పాళులిం
దొకట భిక్షుకులు సోమరులు నొక్క
పాలు సేవావృత్తి బ్రదికెడువారు వి
ద్యోపజీవితులుగా నొక్కపాలు
వ్యవహార మాడెడువారుఁదస్కరులుగా



నొకపాలు కర్షకు లొక్కపాలు
మొదటిపాళులు మూఁడుఁబిదపటి పాలిన
యనవరతంబును నపహరించు

గీ॥ నపహరించియు నంతంత కవి నశించు
నపహతంబయ్యు నభివృద్ధి నందుచుండుఁ
గానఁదగురాజు గలిగినఁగరిసనంపు
జీవనముఁబోల దొండొక జీవనంబు 310

క॥ అని తలఁచి కదలి కతిపయ
దినముల ననుజపురి చేరి తెరువున డస్సెన్
దనువు మును బేదయై నలి
గిన మానముకంటె మిగులఁ గృశమై యుండన్ 311

మ॥ అనుజాగారముఁ జేరవచ్చిన నతం డల్లంతఁరా నగ్రజుం
గని సందేహము వొందియుంగమన రేఖామాత్ర శోధించి క
[1] న్గొని కన్నీళులఁ బాదముల్ గడిగి సన్మోదమ్ముతో నెత్తి దీ
వన దగ్గుత్తిక డింద నాతఁ డదిమెన్ వక్షంబుతో దమ్మునిన్. 312

వ॥ తదనంతరంబ 313

క॥ విపులుం డగ్రజునకుఁ దగు
నుపచారంబులు ప్రమోదముత్కటముగ ని
ష్కపుభక్తిఁ జలిపి యాతఁడు
విపన్నుఁ డగు టతనిచేత విని దుఃఖితుఁడై. 314

వ॥ నిజపుత్ర కళత్ర సహితంబుగా నాతని నిష్టదేవతా నిర్విశేషంబుగా నారాధించుచుండ నొక్కమాసంబు చనిన నబ్బంధుకుండు తమ్మునితో నొకనాటిరాత్రి యెల్లి నవశ్యంబునుం మమ్ముఁ

---

1. న్గొని కన్నీళుల.... నమ్మోదమ్ము - ము, యతిభంగమగును, న్గొ-న్మో, అయినచో ఛందోభంగము కాదు.

బయనంబు సేయవలయు నని నిర్బంధించి పలికిన నర్ధరాత్ర సమయంబున నవ్విపులుండు తన యంగణంబున(కడగడచి నడవ వికచప్రసూన)నతపరిసాంద్ర మాధవీలతాచ్ఛన్నంబగు చూతకుజంబు క్రిందికిం బూర్వజుందోడ్కొని యేగి వేకువన నతనికిం బయనం బగుటఁ దన్నిమిత్తంబులగు మాటలాడి. 315

కః కొనిపోవరాదు తెరవునఁ
గనకము తెక్కలి ఘనంబు గాకున్నను మో
వనురాదు దవ్వుహేమం
బని యన్నకుఁ జెప్పి విపులుఁడకుటిలమతియై 316

వః అనేక నిష్కసహస్రమూల్యంబగు నొక్క మాణిక్యం బతనికి మ్రింగనిచ్చి మీరు ప్రభాతకాలంబున జీర్ణమలినాంబరధారులై యరుగునది యని చెప్పి యిరువురు శయనస్థానంబులకుం జనుటయు. 317

కః వారల పలుకులుఁ దద్వ్యా
పారంబులుఁ దెలియ నెఱిఁగి ప్రమదహృదయుఁడై
చోరుండొకరుండట మును
భూరుహముననుండి వారు పోయిన పిదపన్ 318

ఉః కన్నముపెట్టఁజన్న నొక కంచముఁ జీరయుఁగాని యబ్బ వా
సన్న బహుప్రమాద మది చాలఁగ లాభము చేరె నాకు నే
నిన్నిశి వుచ్చి వేగుటయు నిప్పటి విప్రుని గూడి యేగుచున్
గ్రన్ననతో వధించి మణిఁగైకొని ధన్యుఁడనై చరించెదన్. 319

వః అని నిశ్చయించి యచ్చటువాసిపోయి ప్రభాతం బగుటయు 320

గీః పయనమై యేగు బ్రాహ్మణు పజ్జఁదగిలి
సాధువోలె నాతనితోడ సముచితంపు
భాషలాడుచుఁదన చేయుపనికి ననువు
తలఁచికొనిపోవు చోరుండు తన మనమున. 321



కః నడుమ నలవడదు ముందటి
యడవిం దెగఁజూతు నితని నని తలఁచుచు న
య్యడవి దరిసి యరుగఁగ న
క్కడఁ దెక్కలివారు వచ్చి కడురౌద్రమునన్ 322

కః ఇరువురఁగట్టియుఁగొట్టియుఁ
బరిభవములు పెట్టఁ బేదపన్నల మనుచున్
గరుణమునఁబలుకఁగాఁగృప
యొరగిన చిత్తముల వార లొండొరుతోడన్. 323

కః ఈ యొడళుల కీ కోకలు
వేయైనను దగవు కపటవేషము లివి యీ
మాయలకు నేది మనకు ను
పాయము చీరుదము వీరిఁబట్టి యుదరముల్. 324

వః అనుచుండ నందు ముఖ్యులగువారు 325

గీః ప్రత్త మొకని కడుపు ప్రయ్యంగ నందులోఁ
బసిఁడి లేకయున్నఁ బరుని బ్రదికి
యరుగ విత్త ముండినట్టైన నాతని
ప్రత్త మదియె కార్యవృత్త మనుచు 326

వః అని నిశ్చయించి తమ యిరువురిలో కలనొకని వధియింప నుద్యుక్తులగు సమయంబునఁ జోరుండాత్మగతంబున. 327

కః ఏ నేమి తలఁచి వచ్చినఁ
దా నేమి దలంచె నిచట దైవంబవురా
తా నొక్కటి తలఁపఁగ విధి
తా నొక్కటి తలఁచు ననుట తథ్యం బయ్యెన్. 328

కII పావనుఁడు బ్రాహ్మణుండని
భావింప కకారణముగఁబాపాత్ముఁడనై
యీ విప్రుఁజంపఁదలఁచితి
నా విధి యిట్లుండ నాకునట్లే లబ్బున్. 329

ఉII ఒప్పమి సేయఁడేనిఁ దగు నుత్తమవంశజుఁడేని నేరికిం
దప్పొనరింపఁడేని నతిధార్మికుఁడేని దురాత్ములైన వా
రప్పురుషావతంసమున కాఱడి యెగ్గొనరింపఁ బూనినం
దప్పునె చేటు వారలకు దైవము కన్నులు పుట్టుఁజీకులే. 330

గీII ఇతని కడుపు వ్రచ్చి యిందు రత్నముఁబొడఁ
గాంచి రేనిఁ దనదు కడుపు వ్రత్తు
రొండె తొలుత వ్రత్తు రూరక విడువరు
కడుపు వ్రచ్చు టెట్లు గట్టి తనకు 331

వII అయినను 332

కII తన కడుపు మున్ను వ్రచ్చినఁ
గనకము లేకున్న నతనిఁ కడుపు దలయు నె
ట్లునుఁదను విడువక బహుచిం
తనములఁ బనియేల కాచెదంగా కితనిన్ 333

వII అట్లుంగాక 334

కII క్షీణకరుణచే బ్రాహ్మణు
ప్రాణముఁ గొనఁదలఁచినట్టి పాపము మగుడం
బ్రాణంబుఁ గాచి యతనికిఁ
బ్రాణం బీకున్న నెట్లు పాయఁగవచ్చున్ 335

వII అని కృతనిశ్చయుండై. 336



కII తన కడుపు మున్ను వ్రచ్చుం
దనుటయు నటుఁజేసి వారలందేమియుఁ గా
ననివారై యీతని వ్ర
చ్చిన నట్టుల కాదె యేల చెనఁటిగఁ జంపన్ 337

వII అనుచు నవ్విప్రు బంధవిముక్తునింజేసి నిజేచ్ఛంజను
మనుటయు 338

కII క్రూరులచే విడివడి సుత
దారాదులఁగలిసి యతఁడు ధన్యుండయ్యెన్
చోరుఁడు వివేకమానస
చోరుఁడు నాకమున కరిగి సుఖియై యుండెన్. 339

కII అవివేకి చరితమట్టిది
వివేకి చారిత్రమిట్టి విధమగు నందున్
సవివేకహీను సంగతి
దవులగవల దాపదలకుఁ దప్పఁ దలచినన్ 340

వII అని మకరందిక యెఱింగించిన కథఁ గొనియాడి రిట్లు సుఖగోష్ఠి
యొనరించి యమ్మువ్వురు సముచిత వ్యాపారంబులకుం జనిరంత నిక్కడ

శాII దేవీరత్నము కిన్కతోఁజనిన ధాత్రీనాథుఁడుల్లంబుతో
నావిర్భూతమనోజతాపదహితుం డయ్యెం బరీహాస భా
షావిన్యాసముచే దినంబు గడపం జారాయణుండేగి ని
ద్రావాసంబు భజించె రాజు కృతసంధ్యాముఖ్యకర్తవ్యుఁడై.

ఉII అచ్చట నుండి నేర్పుగలయట్టి యనుంగులమైన యింతులం
బుచ్చిన రాక దేవి తన బోఁటికిఁ దెల్లమి గాఁగ నిల్చినన్
వెచ్చని యూర్పు నించుచును వేదనఁబొందుచుఁగన్ను మోడ్చుచు
న్వెచ్చుచు సజ్జపైఁదనువు వెమ్మగ వేచుచు నీల్గి లేచుచున్.

సీ॥ ఉండె నంతకుమున్న యుర్వీశ్వరుని మీఁద
దేవి తప్పులువెట్టి పోవుటయును
రాత్రి దా సజ్జకు రాకుండుటయును జె
ప్పిన గళావతి నతిప్రీతితోడఁ
బసదనం బొసఁగి యా భాగురాయణుఁడు లా
టేశ్వరుపుత్రిక నెసకమెసఁగఁ
గైసేయఁ బనిచి యక్కన్యాశిరోమణి
నదియుఁదోడ్కొని యేగునట్లు చేసి.

గీ॥ వలయు బుద్ధులు చెప్పిన నెలమి నదియు
నీ మృగాంకావలియు ( మున్న యెఱిగి) కొనిన
నెయ్యముల కల్మి నోర్తోర్తు దియ్యమెక్కఁ
గూడికొని రహస్య క్రియా కుశలలగుచు. 344

ఉ॥ వర్జితలోభుఁడాదిసచివప్రభుపాత్రుఁడు సద్వదాన్యతా
నిర్జితసూర్యసూనుఁడు మనీషిజనస్తుతధర్మవర్తనుం
డూర్జితసంపదాఢ్యుఁడు పయోనిధిసప్తక బంధుకీర్తిని
ర్గర్జితదానవృష్టి కవిగాయకపోషకదృష్టి యిమ్మహిన్. 345

క॥ ఆజన్మవదాన్యుఁడు బహు
రాజసభావినుతకీర్తిరమణీరమణుం
డోజఃప్రధానకాంతి
భ్రాజిత మృదుమధురకావ్య పరిణతుఁ డెందున్ 346

మాలిని॥ సరససుకవిగోష్ఠీ సంభవానందచేత
స్సరసిజుఁడు కళావిజ్ఞాతసంగీతవిద్యా
భిరతుఁడు ధృఢవిద్యాభీమనామాత్య పుణ్యో
దరశరనిధి సంభూతాప్రపూర్ణేందుఁడుర్విన్. 347

గద్యం॥ ఇది సకలసుకవిజనవిధేయ మంచననామధేయ ప్రణీతంబైన కేయూరబాహుచరిత్రమునందుఁ దృతీయాశ్వాసము.

# చతుర్థాశ్వాసము

క॥ శ్రీ వనితావాణీ సత
తా వాసితకృతవిలోచనాననపద్మం
డావిష్కృత సుస్థిర ధ
ర్మావర్తనుఁడెలమి గుండనామాత్యుఁడిలన్ 1

వ॥ భాగురాయణుఁడు మఱునాఁడు మఱియునుం దన లోఁగిటినుండి రాజమందిరోద్యానంబు చక్కటి కటమున్న యాయతంబు సేసిన దిడ్డి తెరువునందుఁ బ్రవేశించి యరిగి వసుధావల్లభు శయనగృహంబు స్తంభ కుడ్యంబులలోపల బయలైన యంత్రవిశేషంబులం గలయది యగుటయు నందలి యంత్ర కీలకంబులు దొలంగించి కదియించు విధంబులు సన్నికేతనంబునఁ బ్రవేశ నిర్గమనస్థానంబులనందు చరియించు విధంబులును యంతకుమున్న మంత్రిముఖ్యునిచేత విన్నయది యగుటం గళావతియుందానును నక్కన్యారత్నంబును నయ్యంత్రంబున నక్కుడ్యంబు లోపలఁ జొచ్చి యొకస్తంభంబు నొద్దకుం జని యందు కేయూరబాహు నిద్రాగారంబగుటయు నందు నిద్రించువాఁడతఁ డగుటయుఁ జెప్పి యేను నిన్ను స్తంభంబు పార్శ్వంబు వెలువరింప వెడలిపోయి యన్నిలయంబులోపల నన్నరేంద్ర మన్మథుండు మేలుకొనునంతకు ననతిదూరంబున నుండి, యతఁడు బోధంబునందినప్పుడు నిన్నవలోకింప భవదభీష్టంబు సిద్ధించు. నీ మనంబున నితనిం బ్రసవశరుఁగాఁ దలంచి నిన్ను రతీదేవిగా నిరూపించుకొని యఱుతనున్న యిత్తారహారంబు నమస్కృతి వచనపూర్వంబుగాఁ దత్కంఠంబునం బెట్టినఁ గరగ్రహణంబు సేయ నర్థించెనేనియు నీవు రత్నసుందరికి వెఱతువని పలికి తప్పించుకొని యతిత్వరితగతి నేతెంచి యిచ్చటు సొచ్చునది యని తెలియ నెఱింగించి యా సదనాభ్యంతరంబునం బొందునట్లుగా వెలువరించిన- 2

గీ॥ మెలుపుమై నాతితోఁ బొలయలుక గూరి
కను మొఱఁగి వచ్చి నిద్ర యేకతమ చేయు
చున్న ప్రద్యుమ్నుచాడ్పున నొప్పువాని
సుప్తుఁ గేయూరబాహుని జూచెఁ గన్య 3

చ॥ వినుకలి మున్న గీల్కొనిన వేడుక చూపుల కర్థి చేయఁగాఁ
గనుగొని యన్నరేంద్రవరకన్యక నిద్రితుఁడైన భూపతిం
గనుఁగవ అెప్పవెట్టని వికాసము నెక్కుడు వేడ్కతోడ నె
మ్మనమునఁ జోద్యముం బొదల మన్మథుఁ డుద్ధతిఁ జాపమెక్కిడన్ 4

ఉ॥ ఆ రమణీ లలామహృదయంబున నాదటలంతకంతకుం
బేరఁగ నింపు సంతసముఁ బెంపు వహింపఁగ అెప్పవెట్టఁగా
నేరుపు లేక వేడుకలు [1]నిట్టుల ద్రోసెడు వాలుఁ గన్నులన్
వారణ లేక క్రోలె జనవల్లభసుందరు మేనిచెల్వమున్ 5

వ॥ అట్లు [2]చూచుచు నాత్మగతంబున 6

సీ॥ ఈ అెప్పపొది విచ్చి యించుక చూచిన
నొప్పారుకన్ను లెట్లుండునొక్కొ
యీ బొమలల్లార్చి యెత్తి నటించిన
నలిక మే సొబగునఁ బొలుచునొక్కొ
యీ ముఖాంబుజమున నెలనవ్వు మొలచిన
నరుణాధరంబెంత యమరునొక్కొ
యీ [3]వాయి తెఱచి యేమేనియుఁ బలికిన
మృదుభాష లెట్టివై మెఱయునొక్కొ
గీ॥ అనుచు నరనాథపుత్రిక మనములోన
మదనవికృతులంతంతకు నుదిలకొనఁగ
వేడుకలు మెచ్చులును జోడుగూడి పొదల
ధరణినాయకు చెలువంబుఁదగిలి పొగడె. 7

1. నిట్టల గొట్టెడు- లి, 2.చూచి-లి, 3.యీ వాక్కు-లి



వ॥ మఱియును 8

సీ॥ పూర్ణలలాట సముల్లాసవదనంబు
నాననాంబుజముతో నంటజేయ
సామజకుంభసంస్ఫాలనకర్కశ
హస్తంబు చన్నులనలఁదికొనఁగ
జ్యాకిణవ్యాయితచారుబాహులు కాంక్ష
రెట్టిగా గళమునఁ జుట్టికొనఁగ
రాజ్యలక్ష్మీమందిరప్రాంగణంబైన
వక్షఃస్థలంబున వ్రాలి సొగియ
గీ॥ నప్పళింపఁ దివురు నజ్జాడు దుఃఖించు
మాన మూని తన్నుఁ దాన మగుడఁ
దిగుచు రాజకన్య జగదీశ సుందరుం
జూచి చూచి కాముఁడేఁచి యలఁప 9

వ॥ తదనంతరంబ 10

చ॥ ధరణితలేశ్వరుండు వెడతాల్చిన నిద్రఁ దొఱంగి కన్ను దో
యర విరియంగ లాటవసుధాధిపపుత్రికఁ జూచి రత్నసుం
దరి చనుదెంచెఁగాఁ కనుచు తప్పక కన్గొని కాకయున్న న
చ్చెరువును సందియంబుఁ దన చిత్తములోపల సందడింపఁగన్ 11

చ॥ ప్రకటితదేహదీప్తులు విభాసితభూషణ దత్తదీధితి
ప్రకరము మీఁద కిన్నెగసి పార్శ్వములం బ్రసరించి చుట్టుఁ బ
ర్వికొని వెలుంగుచుండఁ బరివేషములోపలఁ జంద్రబింబ రే
ఖకు సరియైన లాటనృపకన్యకఁగాంచె విభుండు భ్రాంతితోన్. 12

ఉ॥ చూపులు మేన నంతటనుఁ సోకినచోటనె నిల్చిఁ జెల్వపుం
దీపులు గ్రోలఁ గోరికలు దీఱిన, వీనులు,[1] మంజుకోమలా
లాప రసామృతంబును దలంపఁగ నింపుల కాససేయు న
భ్భూపతి లాటభూమిపతిపుత్రిక యొప్పునఁ జిక్కెఁ దద్దయున్. 13

క॥ నిగుడుచు మగుడుచునుండెడు
మగువ మెఱఁగుఁజూపుగములు మగుడక పదిలం
బుగ నందు విభుని చూడ్కుల
తగులై యొండొరుల మీఁదఁ దలముగఁ బర్వెన్ 14

వ॥ ఆ సమయంబున 15

చ॥ అసదృశ తారమౌక్తికసమంచిత నాయకరత్నమై సమం
జస రుచిపుంజమై తన కుచంబులమీఁద వెలుంగు హారముం
బిసరుహహస్త పుచ్చుకొని పెట్టెఁ బ్రియంబునఁ జేరి "తే నమః
ప్రసవశరాసనాయ" యని పల్కుచు భూపతి కంధరంబునన్..16

వ॥అప్పుడు 17

మ॥ కరమూలంబులు మించుఁ బొంచులిడి కాంక్షుగ్రోలుఁగప్పారు ముం
గురులర్థిం గబళించు వాతెర మెఱుంగు ల్దొద్దలాడుం బయో
ధరకుంభంబుల నెక్క డిగ్గు మెలుపొంద న్నీవికల్ వ్రాల సుం
దరి నాభీ నవదీర్ఘికన్ మునుఁగు నద్ధాత్రీశు చూడ్కు ల్వెసన్. 18

చ॥ ఎలుఁగు వినంగఁ గల్గి కమలేక్షణ చేతుల చోకుగాంచి స
ల్లలిత శుభాంగకంబుల విలాసము లాదట వోవఁ గ్రోలి దే
[2] హలతికగంధమూని యిటు లన్నియుఁ బందువు సేయ నింద్రియం
బులు రసనేంద్రియం బొకడ భూపతికేఁకటుఁ బొందుచుండఁ గన్ 19

1. గోరిదాని సల్లాప - లి, 2.హలతినందమూని-లి.



క॥ ఆ సమయంబునఁ బుష్పశ
రాసనుచే నలఁగి తగువు [1]నవుల జరుపుచున్
దా సజ్జ డిగ్గి ధైర్య
వ్యాసంగంబెడలి నృపతి యతివఁగవయుచున్. 20

ఉ॥ ఎవ్వరిదానవీవు హరిణేక్షణ యెయ్యది నీదు పేరు ని
న్నెవ్వతె తెచ్చెఁ జెప్పు మిట యేర్పడ బంటుగ నన్నునేలు మం
చవ్వసుధేశుఁ డింతి వరహస్తము వట్టిన ధైర్యమూలముల్
ద్రవ్వెడు కన్నులంగొని [2]యదల్చి వదల్చెఁ గరంబు సయ్యనన్. 21

వ॥ ఆలోన మఱియును 22

గీ॥ రత్నసుందరిఁ గోరుదు రాజవీవు
వలదు నన్నేల పట్టెదు తొలఁగు మనుచుఁ
గంబమది సొచ్చి జంత్రంబుఁ గదియఁదిగిచి
యబ్జవదన యదృశ్యమై యట్టు వోయె. 23

క॥ అప్పుడు నరపతి యిప్పటి
యప్పడఁతుక యెందుఁబోయె నాశ్చర్యం బీ
చొప్పు కదియ నిజమొ యని
లెప్పంబయ్యెను మదను[3]శిలీముఖములకున్ 24

వ॥ అంత. 25

సీ॥ లెక్కింప జులకనై చుక్క లాకసమునఁ
బ్రాఁత ముత్తియముల పగిది నుండ
నొదవెడు కెంజాయ నుదయాచలముమీఁద
మాణిక్యవేదితో మచ్చరింప
నాకాశనది క్రేవ నమృతభానుఁడు మేని
మించుఁ గోల్పడి ముదియంచఁబోలఁ

1.లావు, 2. యదల్చినుడల్చె - లి, 3. శిలీముఖమో యనున్ - లి.

జలిగాలి సోకునఁ దెలిసి కొండొక వడి
కవలెల్లఁ జక్కవకవలఁ బెరయ
గీ॥ వెలరు వాఱుచు గృహదీపవితతి బర్వ
విరులపై నళులు గోరంట విరుల దొరయ
నలినములు కల్వలును నవ్వ నలుదెసలను
జాల వెలయంగఁ బ్రత్యూషవేళ యయ్యె 26

చ॥ జలజవనంబు కూర్మి చెలి జక్కవదోయి ముదంబు నిక్కుచు
క్కలకును దాడికాఁడు త్రిజగంబుల మ్రొక్కుల యిక్కవేదము
ల్మొలచిన పాఁదు, యోగులకు మోక్షమువాకిలి, ప్రాణికోటికి
న్వెలుఁగన నొప్పు నవ్వెలుగుఁ వేగమ తూర్పునఁ దోఁచె నత్తఱిన్ 27

వ॥ త్వరితకృత ప్రాతర్వర్తనుండై యేకతంబ యుండి 28

క॥ భయభక్తి సమేతంబుగ
[1]జయజయశబ్దంబు గాఁగఁ జనుదెంచిన యా
ప్రియసఖుఁ డగు చారాయణు
నయనము లారంగఁ జూచి నరపతి పలికెన్ 29

క॥ ఈ రేయి వేగుఁబోకటఁ
జారాయణ! యేమి చెప్ప జనులెప్పుడు నె
వ్వారును నెచ్చుటఁ గానఁగ
నేరని చోద్యంబుఁ గంటి నిక్కము వినుమా. 30

సీ॥ చైతన్యమొదవిన చక్కని చిత్రంబు
చిఱునవ్వు గరచిన చిగురుబొమ్మ
నడపాడ నేర్చిన నవకంపునునుదీఁగ
మురిపెంబుఁ బూచిన విరుల యెత్తు

1. జయజయశబ్దము మున్నుగాగ -ము



వంక వాయఁగఁ బెట్టి వచ్చిన క్రొన్నెల
పలుకభ్యసించిన పసిడి ప్రతిమ
నిలుకడ వడసిన తొలుకారు మెఱుఁగర్థిఁ
గైసేసి వచ్చిన కామునలుగు
గీ॥ నాఁగ నభిరామమగు నెలనాఁగ యొకతె
మానవాంగనసదృశంబు గానిరూపు
మహిమగల యది నా సుప్తిమందిరమున
కేకతమ వచ్చియుండఁగ నేను గంటి 31

క॥ తరుణప్రవాళరుచిరా
ధర నవమాణిక్యపాదతల వజ్రలస
చ్చరణనఖ నీలకచ య
ప్పురంధ్రి కడునొప్పు రత్నపుత్రిక వోలెన్ 32

చ॥ మెలపున దాఁటి యాడు మగమీల విలాసము దోలివ్రాలు[1] క్రొం
దలనపుఁజాయ మీఱి వెలిదామర రేకుల దెల్వి నవ్వుచున్
గలువల కాంతి గైకొనక కాఱుమెరుంగులఁబోలె నేత్రముల్
చెలువకునొప్పు ముత్తియపుఁజిప్పల పోలిక నింత పెద్దలై 33

క॥ కమలానన కన్నులు ని
క్కమునకు దొనలోనఁ బొలుచు కాముని శితబా
ణములగున ట్లాకర్ణాం
తములును భ్రూచాపసంశ్రితంబులు నగుటన్. 34

ఉ॥ ఇంచుక నాపయిం బొలసె నిందుకరావళి ముంచి తెచ్చి పై
వంచినపోల్కిఁ బువ్వవల వైచినచాడ్పునఁ గల్వదండ సా
రించినలీలఁ దమ్మివిరిఁ ద్రిప్పిన పోల్కి మెఱుంగుఁదీఁగె గం
పించిన భంగి వాలు జళిపించినకైవడి నింతి నేత్రముల్ 35

1. కొందలవపుఁజాయ -ము,

వ॥ ఆ సమయంబున శయనతలంబున నాసీనుండనై యున్న నన్నుఁ గదియఁ జనుదెంచి 36

చ॥ జలరుహగంధి దా మధురచారుసుధారసమర్థి నాదు వీ
నులఁ జిలికించుచున్ దన చనుంగవమీఁద వెలుంగు నొక్క యు
జ్జ్వలతరహారవల్లి గరువంబున నా మెడఁ జేరి పెట్టెఁ గో
మలకరపల్లవద్యుతి సమాజము మత్తనువెల్లఁ బర్వఁగన్. 37

వ॥ [1]అయ్యవసరంబున. 38

చ॥ తను నెఱుగందలంచి ప్రమదంబునఁబాణి సరోరుహంబు వ
ట్టినఁ గని రత్నసుందరికి డెందములో వెఱతంచుఁ గోమల
ధ్వని ననుఁబల్కి కన్నుల నదల్చుచు నాదు మనంబుతోన గ్ర
క్కునఁ దన హస్తముం దిగిచికొంచరిగెన్ లలితాంగి మెల్పునన్ 39

క॥ అత్తటి వెనువెనుకన చన
నత్తరుణి యదృశ్యమయ్యె నచ్చెరువు వయ
స్యోత్తమ! యప్పటనుండియుఁ
జిత్తంబున సందియంబు జీఁకటిఁబడితిన్. 40

చ॥ కల యగునొక్కొ యొండె కల గాదిది నిక్కమ యొక్కొ నిక్కముం
గలయునుఁ బొత్తునం గలయఁ గ్రాఁగినచందమొకో నిజంబు గాఁ
గల యగునేని నున్నదిదె కంఠముహారము నిక్కమైన య
క్కలికి మెఱుంగువాలుఁదెలిగన్నుల సుందరి యెద్ది ముందటన్

1. ఈ వచనము – 'ము' లో లేదు.



వ॥ అని యిట్లు మదనవికారపూర్ణ స్వాంతుండైన మేదినీకాంతుం గనుంగొని సంతసిలుచు రత్నసుందరీ సౌభాగ్య గర్వాపహరణ క్రియాచింతనైకపరుండైన చారాయణుండాత్మగతంబున. 42

క॥ కానిమ్ము రత్నసుందరి
పై నిలిచిన మనము కొంత పాతు గదలె నిం
కీ నరనాథుని నొండొక
[1]మానిని దెసనైన నేను మారు ఘటింతున్ 43

వ॥ అని తలంచుచు నతనితో నిట్లనియె. 44

మ॥ జగతీనాయక! చింత యేమిటికి నీ సౌభాగ్యసౌందర్యమున్
దగులంబడ్డది దేవకాంతయయినన్ ధైర్యంబు పొందేది లో
మగుడన్ వచ్చుటకేమి సందియమె నా మాటల్మదిన్నమ్ము మా
మగువం జూపెద నీకుఁ దత్కులభసంబంధంబు సంధించెదన్. 45

వ॥ అని యిట్లచ్చట నివ్విధంబు చెల్లుచుండ నావల రత్నసుందరికి మేఖలకుం బ్రియంబుసేయుకొఱకు రాజు చారాయణద్వితీయుండై యునికి విని యా విదూషకునిమీఁది యలుక యటుపోవక సపరివారయై [2]నిజనివాసంబున నిలిచెనట యద్దేవి యాగ్రహంబ యనుగ్రహంబుగా సంతసిలుచు భూవల్లభుండు సఖుండును దానును మందిరారామంబునకుఁ జనియె నటమున్న వసంతాగమసమయంబగుటయు. 46

క॥ ఎడలెంగారాకులకై
వడియై సూనములు పల్లవముల విధంబై
యెడరెను రాగము పడఁతుల
యొడళులు లతలఁబురుడించుటుచితమె యనఁగన్. 47

1. మానినిదెస నెట్టులైన మరగ ఘటింతున్ – ము, 2. నిజమందిరంబున– లి

చ॥ వననివహంబు లెల్ల మృదువల్లుల, నా మృదువల్లులెల్ల లేఁ
గొనలఁ దనర్చు లేఁగొనలు గుత్తుల, గుత్తులు లోచిగుళ్ల లో
పొనరుచిగుళ్లు క్రొవ్విరులఁ బొందగు క్రొవ్విరు లెల్లఁ దేఁటులన్
మునుకొను తేఁటు లెల్ల నునుప్రోఁతల నెంతయు నొప్పె నామనిన్

సీ॥ మృదు వేడికంటి[1]కొవ్వణపంగఁ జాలిన
కందర్పు మాఱట బొంది యనఁగ
నెలదీగ లనియెడు నెలనాగలకుఁ బ్రీతి
వర్తనంబులు సూపు నటుఁడనంగఁ
గళికల పరువంపు గన్నెఱికంబులు
వెరవుతో వెడలించు విటుఁడనంగ
వనములఁగ్రీడించు వల్లభారమణుల
సురతాంతమునఁ గోరు సురటి యనఁగ
గీ॥ నామనికిఁ బ్రాణమనఁగ నుద్యానములకు
సొబగనంగఁ గొలంకుల చుట్టమనఁగ
నచ్చవెన్నెల నెచ్చెలి యనఁగఁ బొలసెఁ
జందనపుఁగొండఁ బుట్టిన చల్లగాలి. 49

చ॥ సరసరతిశ్రమాన్విత భుజంగమ నూతనపానకేళి జ
ర్ఝరితములైన యమ్మలయశైలసముద్భవగంధవాహముల్
విరహిజనాననాబ్జముల వెల్వడు తోరపుటూర్పు గాడ్పులున్
బొరిఁబొరి నంతనంతఁ దముఁబొందఁగ దట్టములయ్యెఁగ్రమ్మఱన్

వ॥ మఱియుం దత్కాలంబున వికచారవింద వాసితగండూషజలంబు లొండొంటికిచ్చు శుండాల మిథునంబునకుం[2] గ్రీడాలవాలంబులనం గలిగిన కూలంబులుం గలిగి పెరిగిన యెలదూండ్లు నఱికి చవిపట్టి ప్రియుల కొసఁగు చక్రవాకంబుల భాగ్యపరిపాకంబులుం బోని

1. క్రొవ్వుడుపంగ – ము, 2. వాలంబులనంగలిగిన –లి



పద్మాకరంబులును, నెడవెలుపు లేని పూఁదేనియ జడిందోఁగి యసమకాల పర్జన్యకాలశంక మత్తిల్లి నృత్యంబు సలుపు మత్తకేకిలోకంబుల కలకలంబుల కోడు భుజంగ కుటుంబంబును వలసలు వోయిన కతంబున రిత్తలైన గుప్తప్రేమభరిత తృప్తంబులగు వనకేళిలోలబాలికాజనంబులకుం బరిరంభణ యోగ్యంబులగు చందన తరుసందోహంబులును, గుత్తులయెడ చిగుళ్లు వలవంత వేడిమిం బొరలు కాంతల యిగురుపాన్పులకు బోటికత్తియలు పుడికినందేఁటి దాటునకు నొఱ లేకుండ నొడికంబుగా వడివట్టిన తావికుప్పలుం బోలెనొప్పి పూచిన యశోక భూజాతపోతంబులును సహకారకోరకాంకురములు గప్పునంగమిచి మేసి క్రొవ్వునం బెచ్చు బెరిగి నోరంగొలందుల కూయు కోకిలదంపతుల సందడికిఁ దొలఁగి మధురపుష్ప ఫలరసంబులం బరితృప్తంబులై యెలమావి ప్రాఁకులమీఁద మూఁకలు గొనఁ బ్రాఁకిన గురువింద పందిరుల గొందుల సందు వెడలి పూరేకుల పాన్పులఁ గలుగు నీరంబులలోనఁ బ్రాణేశ్వరుల యెఱకల యిఱుకులం బారవశ్యంబునఁ జంచులు నంచుల మీఁద నిడి నిద్రించు రాచిలుక రాణివాసంబులు నగుచు నత్యంత మనోహరంబగుచుండ 51

సీ॥ వలరాజు విజయకాహళనాదముల భంగి
నెలిఁగించు గండుఁకోయిలల క్రందు
చిత్తజుచాపశింజినులకైవడి మ్రోయు
చంచరీకంబుల సందడియును
నంగసంభవుసేన యార్పులవిధమగు
కలికి రాచిలుకల కలకలంబు
రతిపతిబలపదోత్థిత ధూళిచాడ్పున
దెసలెల్లఁ గప్పెడి కుసుమరజము
గీ॥ పచ్చవిలుతుని బలములపగిది యైన
యలరు మావిడిమోఁకల చెలువుపెంపు

నెమ్మనంబునఁ దాపంబు నిగుడఁజేయ
సఖునిఁ జూచుచు నిట్లనె జనవిభుండు 52

మ॥ కలయంబూచి వెలుంగు కింశుకము లంగారప్రతానంబు కో
మలసాంద్రాంకురభాసి చూతలతికల్ మంటల్ నభోవీధి న
గ్గలమై క్రాలుచుఁ దూలుచుం దిరుగు భృంగశ్రేణి ధూమంబుగా
బొలిచెన్ పుష్పశరప్రతాప దహనంబో నాఁగ నిత్తోఁట దాన్ 53

వ॥ అనుచునందు విహరింపంజాలక యొక్క రమణీయ లతామందిరంబు సొచ్చి యందలి చంద్రకాంత వేదిమీఁదం దనువు వైచి పొరలుచు నుండి కొండొకసేపునకాసీనుండై 54

మ॥ తన కంఠంబునఁ గాంత మున్నిడిన ముక్తాహారముంబుచ్చి చే
త నమర్చుం గడుఁబ్రీతిఁగన్గొనుఁ గరద్వంద్వంబునంజేర్చు మో
మున నొత్తుం బలుమాఱు డెందమున మోపుం గ్రమ్మఱం గంధరం
బున బూనుంబరిరంభబుద్ధి మెయిఁ గప్పున్ ధైర్యగస్వస్తికన్ 55

వ॥ ఇట్లతి బహుఫలంబులగు కోరికలకు నెలవగుచుం దన మనంబులోన యిట్లని తలపోయుచు 56

ఉ॥ ఏపున మున్ను వేడ్క సుఖియించి సముద్ధతయై యభీష్ట కే
ళీపరిణామమొందియును నీదు మనఃపరిభోగసౌఖ్యమున్
జూపుల వేడుచున్ మధురచుంబనమెన్నడు చేయునొక్కొ జం
ఘా పరిభోగచుంబి శిఖరాయతలంబిత కేశపాశయై. 57

వ॥ అనుచు ననేక మనోరథంబులం దేలుచు మదన వికారంబులకు నెలవగుచుండ నచ్చోటు వాపికొని పోవందలంచి చారాయణుండిట్లనియె. 58



క॥ మర్మస్పర్శనఁబరగు ము
హుర్ముహురాగత వినోదయోగ్యముల మెయిం
బేర్మిఁ జరింతురు క్రీడా
నిర్మాల్యము లేల మేదినీనాథులకున్ 59

వ॥ వనవిహారంబొక్కటియ యేల ద్యూతక్రీడ యొనర్తుగాక నివాసహర్మ్యంబునకు విజయంచేయుమని తోడ్కొని చని యచ్చట రసాంతరంబు వుట్ట వినోదంబులును నీతిగర్భితంబులునగు కథావిశేషంబులు వినిపింప దలంచి యిట్లనియె. 60

గీ॥ దేవి మేఖల నెప్పుడు నీ విధమునఁ
జాల మన్నించి నీదు మత్సరము బుద్ధి
నయవిధిజ్ఞ కళావతి నన్నుఁ బంచి
భంగపెట్టించె దాని భూపాల కంటె 61

క॥ మతిమంతులు నిజశత్రుల
నితరులఁ గొని యేనిఁ జెఱతు రెల్లవిధములన్
సుతహంత యగు కిరాతుని
మృతుఁడుగ శుకి చేసెఁ దనదు మేధాశక్తిన్ 62

వ॥ అనుటయు నది యెట్లనుఁడు నమ్మహీనాథుఁనకుం జారాయణుండిట్లనియె. 63

చ॥ ఒక పెనుగానలో నొక మహోన్నత భూజమునందు బాలశా
బకముల నప్పుట ప్రబలపక్షములం గలవానిఁ బ్రోచుకొం
చొక శుకి యుండు నత్తరువునొద్దన చిక్కని పెద్ద ప్రానియం
దొక ఫణినాయకుండు గరళోల్బణుడుండొక కోటరంబునన్ 64

వ॥ అట్లు రెండును నుండు నంత నొక్కనాఁడు 65

క॥ తొల్లియు నచ్చోటన తన
పిల్లలఁగొని చన్న బోయ పెద్దయుఁ గ్రూరుం

డుల్ల మలర నబ్బూరుహా
మల్లన నెక్కి తన కూర్చు నాత్మజయుగమున్ 66

కII [1]చంచులు దెఱచుచు నఱవఁగ
నించుక కృప లేక పట్టుటేర్పడఁగని కో
పించుచు నాతనికిందుకు
లంచ మిదుదు నని చిలుకవెలఁది యిట్లనియెన్. 67

కII అన్నన్న వినవె పక్షులు
కన్నులు తెఱవ వివి వీనిఁ గలయదె చవి నా
మన్నిఁగొననేల విడువఁగ
దన్న యకట చంపఁగూడునయ్య శిశువులన్ 68

చII అనవుడు బోయ యిట్లను శుకాంగనతో నడలంగనేల నీ
తనయులఁ జంప నేను బిశితంబులు భ్రాంతియె నాకు వీనిఁగై
కొని వెలవెట్టు వారికడకుం జని యమ్ముదు విల్చి వారునున్
బెనుతురుగాని[2] వాని కొక పీడ యొనర్పరు నమ్ము నెమ్మదిన్. 69

కII అనవుడు విని యక్కీరాం
గన సంపఁగ నొల్లవేనిఁ గనకముపైఁ గాం
క్షన పట్టితేని విడు నా
తనయుల నీ కేను జూపెదను హేమంబున్. 70

వII అది యెక్కడిదంటేని 71

మII ప్రకటశ్రీయుతుఁ డొక్కఁడీ యడవిలోఁ బాటచ్చర శ్రేణి బా
ధకు నుల్లంబున నోడి మొన్న దన యర్థం బొక్కచో డాఁచెద
ప్పక యేఁ జూచితి నున్న దా పసిఁడిఁ జూపంజాలుదు న్నన్నుఁబు
త్రకులం గాచెద నెల్లనాఁడు నని పంతంబాడి రక్షింపుమా. 72

1.నించుక కృప లేక పట్టుటేర్పడగని శో। కించుచు రోదించుచు పల। వించుచు నాతనికి చిలుకవెలఁది యిటులనియెన్ – ము, 2.వీని.



మII అనినం బెన్నిధి [1]యప్పుడే గనిన యట్లా నందముం బొంది యే
నిను నమ్మించెదనంచు శాబకముల న్నీడంబులోఁ బెట్టి చ
య్యన నా భూజము డిగ్గి బోయ వినతుండై యొక్కచో నిల్చి యు
ర్లను బోనుల్ వెసముట్టి నమ్మఁదగుపల్కుల్ పల్కె నిర్వంచనన్ 73

వIIఅప్పుడు కీరవనిత వానితో నిట్లనియె 74

కII నమ్మికలు వేయు నేటికిఁ
గ్రమ్మఱ వచ్చెదవె నీవు ఖగమృగబహుదుః
ఖమ్ములకును నా చూపెదు
సొమ్ములపై జేయి వెట్టి సుఖివైన తుదిన్ 75

వII అని పలికి యిటు రమ్మని తోడ్కొని చని 76

గీII పూనుఁగాఁడి యంత భుజగంబు లోనున్న
వెలఁగ మ్రాని వెడదతొఱట సూసి
దీనఁ జేయి వెట్టు లోనున్న యది సవి
శేషహేమ మనుచుఁ జిలుక చెప్పె. 77

ఉII చెప్పిన వెట్టి బోయ వలచే యటు సొన్పుడు నందుఁ గన్నులన్
నిప్పులు రాలుచున్న మహనీయగళోజ్జ్వలభీషణోరగం
బుప్పలవాయిఁ దిన్న విషముగ్రత నెక్కుడు దృష్టి చీఁకటుల్
గప్పఁగ నోరఁ బెన్నురువు గ్రమ్మ మృతుండయి కూలె మేదినిన్. 78

గీII ఆస పాపజాతి యఖిలంబుపైఁ బాఱుఁ
బసిఁడిమీఁద నేల పాఱకుండు
పసిఁడిమీఁద నాసపాటిన మానిసి
తనకు వచ్చు కీడు తలఁపఁగలఁడె 79

3.ఎన్నడెనంగని.

కII తనచే నసాధ్యుఁడగు శ
త్రుని నన్యునిచేతనైనఁ ద్రుంగునటులుగా
నొనరింపవలయుఁ దా నెఱుఁ
గనివాఁడునుబోలె నీతికౌశల మెసఁగన్ 80

వII అని చెప్పి చారాయణుండు మఱియు నిట్లనియె. 81

కII పగవాఁడనైన నాయెడ
మొగమోడి మదీయవాక్యములు నమ్మి నిజం
బుగ నరయడయ్యెఁగార్యము
మిగులఁగ దుర్బుద్ధి గాదె మేఖల యధిపా. 82

కII మొగమోడవలయు నైనను
మొగమోటకుఁ గొలఁది కలదు మొగమోట ఘనం
బుగ నొప్ప దాలి కెక్కుడు
మొగమోడిన యక్షుఁడొకఁడు మును హతుఁడయ్యెన్ 83

వII అది యెట్లనిన 84

కII యక్షపురంబునఁగలఁడొక
యక్షుఁడు ప్రియభాషుఁడనఁగ నతని వనిత ప
ద్మాక్షి నిపుణిక యనంగల
దక్షుద్రస్నేహుఁడాతఁడయ్యతివయెడన్ 85

కII ఆ రమణి గర్భభరశ్రం
గారంబున నొప్పెఁ బౌరగణ మెల్లఁదగన్
క్షీరాబ్ధినాథు నుత్సవ
మారూఢంబగుటఁ జూడనని యేగుటయున్ 86

వII ప్రియభాషుఁడు నిపుణికతోడ 87



ఉII కొండికదాన వెన్నఁడును గ్రొత్త వినోదముఁజూడ వింటఁగా
పుండెద నేను[1] నీవు నను ముత్సవమొప్పగ జూడనన్న నీ
వుండఁగ నొంటి నేఁ జనుట యుక్తమె కాదని పల్కితేని నీ
నిండిన చూలు మోచికొని నేర్తునె యెచ్చటికైనఁ బోవఁగన్. 88

కII అనుటయు నీ వటఁ జని యిటఁ
జనుదెంచిన యంతదాఁకఁ జామా నీ దా
ల్చిన గర్భముఁదాల్చెదనని
తన కుక్షిం జూలు నించి తరుణింబంపెన్. 89

చII పనిచినఁ బోయి చూడ్కులకుఁబండువనందగు నుత్సవంబు నిం
పెనయగఁ జూచి వారుఁ దమ యిక్కలకుం జనఁగా రసాంతరం
బున మనమూది యింటి దెస వోవుట మాని విభుండు మున్నుఁజే
సిన యుపకారమున్ మఱచి చేడియ చింతయొనర్చె నాత్మలోన్ 90

ఉII ఇంటికి నేను బోఁదడవ యెప్పటి గర్భమునిచ్చువాఁడు నా
కంటికి నిద్రలేక యది క్రమ్మఱ మోవఁగనేల వానిచేఁ
గొంటినొ తింటినొ యతని కుత్సితబీజము వానిమీఁదనే
త్రుంటితినింత నా కొరుల దూఱు బొగడ్తయుఁజూడ నేటికిన్

ఉII చూలు వహించి [2]వెక్కుచును స్రుక్కుచు నుండి ప్రసూతివేదనం
జూలఁ[3]నలంగి యాపదను జడ్డపడంగను నాకునేల నా
పాలిటి దయ్యమద్దొసఁగు వాపినఁ గ్రమ్మఱ నేల పోదు నం
చా లలితాంగి వేఱ యొక యక్షునిఁగూడి నిజేచ్ఛనేగినన్ 92

---

1. నీవు సనుమొప్పగ జూడ – లి, 2. మిక్కిలియు,
3.గలంగి యా పడుచు – లి,

వ॥ అంత నిట 93

క॥ కడు నధికముగాఁ బెరిగిన
వెడ మోయంగాను నూర్పు వెడలక యాలిం
గడుఁ దలచి వలవరించుచు
వెడఁగగు యక్షుండు ప్రాణవిరహితుఁడయ్యెన్. 94

క॥ తగ దొరుల నమ్మనెప్పుడుఁ
దగువారల నమ్మిరేనిఁ దగుఁగాక మహిం
బగవారి నమ్మవలవదు
పగవారలకంటె వలదు భామలనమ్మన్ 95

క॥ బలుపున మెలపునఁ గేళిన
కులభామిని వెఱచుఁగూర్చుఁగుమతిత్వమునన్
దలనెక్కించుకొనం బతి
కులమును బ్రాణంబు సొమ్ము కోమలి చెఱచున్ 96

క॥ దాక్షిణ్యగుణంబుత్తమ
[1]లక్షణమని సజ్జనులు దలంతురు తమకుం
దాక్షిణ్యముసేసిన నధి
కక్షుద్రులు మోసపోకగాఁజూతు రిలన్ 97

క॥ నమ్మక పోరా దను తఱి
నమ్మి రిపుని గలిసి నమ్మ నడచుట యొప్పున్
బిమ్మట నేమఱక తొలఁగి
నమ్మక యుండంగవలయు నరవర వానిన్ 98

1.లక్షణమని మనసులో దలంతురు నమతుక



వ॥ ఈ యర్థంబు దెలుపు నహిమూషకోపాఖ్యానంబు నెఱింగింతు
నవధరింపుమని చారాయణుం డిట్లనియె. 99

క॥ క్రూరోరగ గ్రహణ విష
హారి యనంబరఁగు నొక్కఁడతిశయ విష దు
ర్వారము నొక సర్పంబు న
భీరుండై పట్టి వెదురుఁబెట్టియఁబెట్టెన్. 100

గీ॥ పెట్టి దానికి నెరగాఁగఁ బట్టి యొక్క
మూషికము వైచిపెట్టియు మున్నవోలె
గట్టిడించిన నురగంబు గఱవ రాఁగ
నెలుక బెదరక దానితో నిట్టులనియె 101

క॥ నీ కుపకారము సేసెద
నా కభయంబిచ్చి కావు నా కార్యంబున్
నీ కార్యంబును మేలై
చేకుఱు నాతోడఁ జెలిమి చేసితి వేనిన్ 102

గీ॥ వాఁడు పట్టినపుడ వానిచే నైనను
జావవలయుఁ [1]నాకు జావు నిజము
చచ్చియున్న నన్ను జంపి చావని నీకుఁ
జెఱన యుండఁదలఁచు టెఱుక యగునె 103

క॥ ఏ నధికబలుఁడ నా చే
గానిది యీ యెలుకచేతఁ గానోపెడునే
తా నాచెఱ యేవిధమున
మానుచు నిది కల్ల యనుచు మదిఁ దలఁపకుమీ 104

1.తనకు– లి

క॥ విను మెవ్వాఁడేకార్యం
బున నిపుణుఁడు దానియందుఁ బూజ్యుఁడు హీనుం
డనవలదు సూది నయ్యెడు
పని చిక్కని కఱుత జేయ [1]బాగైయున్నే 105

ఉ॥ చాల నభీష్టముల్ తన వశంబుగఁ జేయు నయోగ్యుఁడైన న
మ్మేలుఁ దలంచి దానియెడ మిక్కిలి వేడుకసేఁత యొప్పగుం
గాలపు వేఁటకాఁడు ఝషకాంక్షన దా నుదకంబు మీఁదటన్
దేలెడుబెండుపై నిలుపు దృష్టియుఁ జిత్తము నాదరంబునన్ 106

క॥ తన కార్యముకొఱకై హీ
నుని యొద్దకు నైనఁ బోఁజను మహిం జండా
లుని యింటి కుపశ్రుతి కై
చనుగాదే స్వార్థ మూది సద్విజుఁడైనన్. 107

క॥ నా చెప్పినట్లు చేసిన
నీ చెఱ విడు నట్లుఁగాక నిలుపోపక నీ
వే చంపి నన్ను నోరను
వైచికొనిన మానునే భవత్క్షుత్తెల్లన్ 108

మ॥ చెఱయేఁ బాపిన [2]నిష్టమైనవలనం జెన్నొందఁ గ్రీడించుచున్
జిఱుగప్పల్చవి [3]మీలుబల్లు లెలుకల్ చిట్టెల్కలాహారముల్
వఱలన్ గుత్తుకబంటి తెమ్మెరలఁ గ్రోలం [4]భామతో నిష్టముల్
నెఱియన్ భోగము సుట్టునుం గలుగు నీ వీక్షింపుమా నెమ్మదిన్109

క॥ అనవుడు నురగము సంతస
మున నాఖువుతోడ స్వప్నమున నైనను గీ

1.బాగే యెందున్ –లి, 2.నప్పు డిష్టమయినన్ –లి, 3. మీలపల్ల –లి, 4. బెట్టపెంబాముతో –లి.



డొనిరంప నీవు నా చెలి
వనుమానముఁదక్కి నమ్ము మానందముతోన్ 110

వ॥ ఇక్కరండ నిగ్రహ మెట్లుడిపెద వుడుపుమనుటయు. 111

క॥ ఏ నొక మంత్రము నీతల
పై నుండి జపించి జపము పారముఁబొందన్
గా నినుఁ బిలిచెద గదలక
నీ నయనయుగంబు మూసి నిలుమందాఁకన్ 112

చ॥ అని నియమించి దాని శిర మంజక యెక్కి కరండభేదనం
బనువుగఁ జేసి మూషకము నప్పుడ పోయె ననంతరంబు లో
చనములు విచ్చి చూచి మదిసంతసమున్ వగపుందలిర్ప నా
కుమనఁ దాను నేగి భుజగం బొక బొక్క వసించి యాత్మలోన్ 113

క॥ ఎలుక కపటమున నా క
న్నులు మూసెను మ్రింగ లేద నో రెరియఁ గటా
తొలఁగెద ని కేది బ్రతుకని
తలఁచె దురాత్మకులకెందుఁ దగవులు గలవే 114

క॥ కెలనికి మేలుగఁదనకుం
గలిగెడి నింద్రత్వమైనఁ గాదనుఁదుదిఁదాఁ
బొలిసిన మేలని తలంచును
ఖలుఁడొకనికి గీడుసేయఁ గలిగినఁజాలున్ 115

వ॥ ఇట్లుండి దాని బిలద్వారంబెఱింగి యయ్యాశీవిషం
బమ్మూషకమ్మునకు దోషంబాపాదించు నభిలాషంబున 116

గీ॥ దాని బొక్కకడకుఁ దా నేగి నా ప్రాణ
సఖుఁడ యేగుదెమ్ము సత్వరముగ

నొక్కచోటనుండి యుచితసల్లాపముల్
సేయవలె నటంచుఁ జీరుటయును. 117

కు॥ లాఁగలు పెక్కులు లోపల
బాగై తను ముట్టినపుడ పట్టువడక లో
డాఁగి చని వెలికి వెలువడి
పోఁ గనుమలు గలుగునట్టి బొక్క యెదిరికిన్. 118

వ॥ వచ్చి మృద్బద్ధంబైన బిలద్వారంబున నిల్చి యా ద్విజిహ్వాంబుతో నిట్లనియె. 119.

కు॥ నన్నుఁ దొలుతీవు గాచితి
నిన్నుం జెఱ యేను వాపి నిలిపితి నాపై
మున్ను గల కరుణ మరువకు
మన్నింపుము నాకు నంతమాత్రము చాలున్ 120

గీ॥ వియ్యమందఁ బోక కయ్యమొనర్చుట
చెలిమిసేఁత తమకుఁదలము గాని
వారితోడఁ దగదు చేరి నీ చెలిమికి
నేను హీనతనుఁడ నెంతవాఁడ 121

కు॥ మున్నీవు నాకుఁ బగతువు
మిన్నక కార్యార్థమాత్ర మిత్రత్వమున
న్నన్ను సహింపుదువే చను
మిన్ని పలుకు లేల వెఱతునే నినుఁ జేరన్ 122

వ॥అనుటయు నయ్యహి సిగ్గుపడిపోయె నమ్మూషకంబును సుఖంబున నుండెనని చారాయణుండెఱింగించెఁ దనవలన మహీనాథవృత్తాంతంబు సమస్తంబు విని భాగురాయణుండు కఱపి పుత్తేరఁ గలావతి యొక్కనాఁడు రత్నసుందరి పసుపు నెపంబునఁ గేయూరబాహుభూధవుండు చారాయణసహితుండై యుండునెడ



కేతెంచి మ్రొక్కిన దేవీ ప్రేరితయై యది తన భావవృత్తి యరయ వచ్చినది గాఁదలంచి ప్రసంగవాక్యంబుల నింగితంబులం దీర్చికొని ధరణీశుండు దానింగారవించి యాసీనంగా నియమించిన నది యట్లచేసి వారి నుద్దేశించి సస్మితాననయై యిట్లనియె. 123

కు॥ మీ యాడెదునేకతమున
నాయతనము నృపతియఱుత హారంబిది నా
చేయార గ్రుచ్చినది మీ
రేయెడ మొఱగెదరు నన్ను నీ నేరుపులన్ 124

వ॥ అనుటయు ధాత్రీనాథుండాశ్చర్య సందేహసంతోషంబులు మనంబున ముప్పిరిగొనుచుండ నిట్లనియె. 125

కు॥ చారాయణుఁడును నీవును
నారయ సరి నాకు నిట్లయాడుదె నీకే
వారింతునె యేకత మీ
హారంబెవ్వరిది మొదలనంగన! చెపుమా 126

వ॥ అనుటయు నెఱింగించెద నవధరింపుమని యిట్లనియె. 127

కు॥ భూవర యొప్పును లాట
క్ష్మావల్లభపుత్రి నిఖిలజనలోచన సౌ
ఖ్యావహలావణ్య మృగాం
కావళి యను కన్య హృదయహారిణి యగుచున్ 128

వ॥ అను పలుకులు విని కేయూరబాహు మహీపాలుండు కళావతితో లాటేశ్వరుండగుచంద్రవర్మకు మృగాంకవర్మ యను పుత్రుం డొక్కరుండుగాక పుత్రి యొక్కడిది యనిన నది నగుచు నలుదిక్కులుం బరికించి యిది యొక్క యత్యంతరహస్యంబ యెవ్వరు నెఱుంగ కుండినది యవధరింపుమని యిట్లనియె.

కII ధాత్రీశ లాటపతి యొక
పుత్రింగని పుత్రనామమున వెలయించెన్
శత్రుకులసమీక రహ
స్య త్రాణప్రౌఢ నీతిసాహసుఁడగుచున్ 130

చII అతఁడు సుబుద్ధి గాన దన యన్వయపూర్వులు దొల్లి యేకసం
తతులయి దాము చెల్ల విదితం బగుటన్ దనయందుఁ బుత్ర హీ
నత ధరలోని రాజుల మనంబునఁ బుట్టకయుండనోపి ర
క్షితముగఁ జేసె మంత్రముఁ బ్రసిద్ధిగ వ్రాసె సుతత్వ మెల్లెడన్ 131

వII అయ్యపత్యంబునామంబు మృగాంకావళియై యుండ మృగాంక వర్మయని పుంస్త్వంబు దోఁపఁ దదభిధానంబునం బిలుచుచుందు రక్కన్నియఁ బొందినవానికి సార్వభౌమత్వంబు కలుగునని మహాపురుషాదేశంబు ఈ రహస్యంబు సమస్తంబు బుద్ధిమదగ్రేసరుండగు నీ మంత్రి భాగురాయణుండు భవదీయరాజ్యలక్ష్మీ ప్రవృద్ధి చింతానిరతాత్ముండగుట నక్కుమారీ రత్నంబును వరియించి దేవర సార్వభౌమత్వంబుఁ బొందవలయు నని యొక్క యుపాయంబున నా రాజపుత్రి నిప్పురంబునకు రప్పించి తన మందిరంబుననిడికొని రత్నసుందరియందు భయభక్తి సమేతుండగుట నద్దేవివలని దాక్షిణ్యవిశేషంబున నీ కెఱింగింప నేరక యున్నవాఁడు భవద్వల్లభ యెరుంగకుండ నమ్మహామంత్రి నియోగంబున నప్పురంధ్రీ భూషణంబునకు నెచ్చెలినై వర్తిల్లుదు. 132

ఉII ఆ మదిరాక్షి రూపవిభవాతిశయంబుల దృష్టి సోకినన్
సోమునినైన వేఱ యొక సోముఁడు నామనినైన వేఱ యొ
క్కామని కమ్మదెమ్మెరలనైనను వేఱొక కమ్మతెమ్మెరల్
కాముని నైన వేఱ యొక కాముఁడు నేచుదు రేమి చెప్పుదున్



మII వనితారత్నము నాసికాపద భుజద్వంద్వ శ్రవోలంకృతుల్
వనజామోదపుటూర్పులంచనడపుల్ పాణిద్యుతుల్ శాతలో
చన పార్శ్వంబులు దృష్టిదోషమున రక్షల్ నాకుఁ జూడంగ ద
ద్ఘనముక్తావళి యందియల్ వలయముల్ కల్యాణతాటంకముల్

మII కరపాదాంబురుహంబులున్ గుచరథాంగ ద్వంద్వముల్ మోముఁ జం
దురుతో దాయలు ఘ్రాణచంపకము శత్రుల్ కుంతలాళీంద్ర సం
కర మిట్లక్కట యా వధూసురుచిరాంగశ్రేణి కయ్యెం బర
స్పరవైరంబని కుంది డస్సెననగా సన్నంబు కౌ నింతికిన్.

కII నయనాద్యవయవములు మే
లయిన పదార్థములఁ జేసేనజుఁడవి వోఁగా
బయ లావటించి చేసిన
క్రియ నయ్యరవిందగంధి కిన్నడు మొప్పున్. 136

కII తొడవులకుఁదొడవు తనులత
తొడవులకుం దనులతకును దొడవులు నడుపుల్
తొడవులకును దనులతకును
నడపులకుం దొడవు లరయ నాతుక నుడువుల్. 137

సీII వాలుఁగన్నులుఁజారువదనంబు నుత్పల
వనజకాంతుల నుద్దివైచి కొనఁగ
మెఱుఁగుదంతములు వాతెఱయును మౌక్తిక
చూతపల్లవముల సూడువట్ట
భుజములు మృదుహస్తములును లేఁదూండ్లను
జెందొవరేకుల సిగ్గుపఱపఁ
జనుదోయి నలకలు జక్కవకవ పొందుఁ
దుమ్మెదచాయల దొద్దగొనఁగ

గీ॥ నలిక మఱచందురునితోడఁ జెలిమిసేయఁ
దియ్యపలుకులు దేనెలు వియ్యమొంద
[1]నడపురాయంచ కొజ్జతనంబు సేయఁ
గమలగంధి మనోహరాకార మలరె. 138

క॥ ఆ చేడియ సౌందర్యము
నాచేఁ జెప్పించుకొని వినఁగవలసి మదిం
జూచెదవు గాక ముందఱ
నీ చూడనియదియె మేదినీవర చెపుమా 139

వ॥ అది యెట్లనిన 140

చ॥ అసదృశతార మౌక్తికసమంచితనాయకరత్నమై సమం
జసరుచిపుంజమై తన కుచంబులమీఁద వెలుంగు హారమున్
బిసరుహహస్త పుచ్చుకొనిపెట్టదె వేడుకఁజేరి "తే నమః
ప్రసవశరాసనాయ" యని పల్కుచుఁ దావకకంధరంబునన్.

క॥ అను పలుకు లమృతముక్రియం
దన వీనులు సొచ్చిడిగి హృదయమంతయు నిం
డిన నొకవడిఁ దన్నెఱుఁగక
జనపతి పూర్ణానురాగశరనిధిఁ దేలెన్ 142

వ॥ చారాయణుండును బ్రమోదితహృదయుండగుచుం
గళావతిశిరంబక్కున నదిమి పెక్కుతెఱంగులం బ్రశంసించె
నప్పుడు మేదినీనాథుండు. 143

గీ॥ బహువిధంబులఁగొనియాడి బహుళరత్న
భూషణాంబరాదికము లపూర్వములుగ
నొసఁగి యరలేని చెలిమిఁ దీపెసఁగఁ దన్నుఁ
గలిపికొని కళావతిఁ దద్ద గారవించి 144

1.నడపులంచలఁ గొంచదనంబు సేయ -ము



వ॥ లాటరాజనందన యటమీఁదివృత్తాంతంబు విను కుతూహలంబుతో
నునికి యెఱింగి కళావతి యిట్లను నట్లు దేవరచే గృహీత యయ్యును
నటమున్న నాచే బోధిత యగుటంగులపాలికా సదనంబు గాన ధైర్యం
బవలంబించి యెట్టకేలకు విడిపించుకొని తదీయశయన గృహంబు
సుషిరస్తంభకుడ్యరచితంబు గావున నంత స్తంభాంతరితయైన
యంభోరుహవదనందోకొని చని తత్సదనంబుననునిచి
ప్రభాతంబగుచుండ నేనును మదాలయంబునకరిగి
యేకప్రహారంబుమాత్రంబు మసలి తన యున్నయెడకుంబోవ
నమ్మానవతియు నంతకమున్న బహువిధమన్మథ వికారమగ్న( మానస)
యగుచుండి తన యంతర్గతంబు సకలంబు నాకు వాపుచ్చిచెప్ప సిగ్గుపడి
పద్యత్రయంబుగా రచియించి యొక్క కేతకీ [1]పత్రంబునఁగస్తూరిని
లిఖియించి యేమరి పడవైచినదియుంబోలెఁ బానుపుమీఁద నొక్క దెస
వైచి నా రాక గనుంగొని మిథ్యానిద్రనభినయించి
యావలిమొగంబైయుండ నేనును గదియంజని యక్కేతకీ పత్రగతంబగు
పద్యత్రయంబు పఠించితి నది యెట్లనిన. 145

ఉ॥ తా డిడి పండుఁ దిన్నక్రియ దద్దయుఁ గాలము గోరుచుండగాఁ
జూడఁగ నబ్బె నా నృపతి సుందరునింకొకమాఱు గ్రమ్మఱన్
జూడఁగనైన నోఁతునొకొ చూడ్కిఁగళావతిదేవి కాత్మలో
నోడి ప్రమాదకార్యమిది యొప్పదు పొమ్మనునొక్కొ దైవమా

చ॥ ఇటనటఁ జూడరా దతనికింత యొకప్పుడు నాఁడు నిండ ముం
దటఁ జొలయంగ నీదిట ప్రధానుఁడు వల్కఁగఁజామ నన్ను నీ
చిటిపొటి పొన్నచుక్కలకుఁ జేతులుసాచుట గాదె యిట్టిదు
ర్ఘటనపుఁగూర్మికిన్ శరణుగల్గునె యెట్లు దలంచి చూచినన్

1. దళంబున గస్తూరిని-లి

ఉ॥ ఒంటిని నుండి ఱేయి విభుఁడుల్లమునం బ్రియమార నన్ను నీ
బంటుగ నేలికొమ్మనుచుఁ బట్టినయప్పుడ యేల యియ్య కో
కుంటి వృథాభిమానముననుంటిఁ గళావతి మాట లేమి గా
వింటిఁ బ్రసూనసాయకుని వింటి భరత్వముఁగంటి బేలనై. 148

వ॥ అని చదివితినని చెప్పిన సానందహృదయుండును సదయుండును సలజ్జావదనుండును నగు జగతీవల్లభు నవలోకించుచు నట మీఁద నవధరింపుమని కళావతి యిట్లనియె నే నప్పద్యంబులు చదివి యదరిపడి యక్కాంత వలవంతకునెంతయుం దల్లడిల్లుచుండ నప్పుడప్పుడ నిద్రతెలిసినదియుంబోలె నచ్చతుర నన్నుం గారవించుచుఁ బర్యంక తలంబు డిగ్గి భాగురాయణుని నిష్కుటంబులోనికిం బోవుతలంపునం బిలిచిన నేనును నెట్టైనం బ్రొద్దుగడుపుట కార్యంబని యనుమతించి యరుగ నందుఁ బ్రవేశించి. 149

సీ॥ ఎలదేటికదుపుల యెఱకలఁబడనెక్కి
పయిఁగ్రమ్ము పువ్వుఁదేనియల సొబగు
వలసినచోన కోకిలదంపతులకుఁ ద
ల్పములగు జిగురుజొంపముల పెంపు
బలుపురాచిలుకల పక్షానిలంబుల
నలుదెస రాలెడు ఫలచయంబుఁ
బుప్పొడితో రాలి పొదరిండుల బయళ్లఁ
బూరించు తిన్నని మారుతంబు
గీ॥ అంగజావేశ మంతంత కగ్గలముగఁ
జేయఁదలపోఁతలకుఁ జొచ్చి చిత్తమలయ
నిష్టసంచారకేళికి నెలయలేక
యబల యొక్క లతానిలయంబు సొచ్చి 150

వ॥ అల్లన నాసీనయై యత్తమిల్లి 151



ఉ॥ హారము వెట్టుచోట భవదంగము సోకిన యంగుళాగ్రముల్
భూరితపఃప్రభూత ఘనపుణ్యఫలంబులుగాఁ దలంచి యం
భోరుహనేత్ర రిత్తమెయిఁ బూసికొనుం బలుమారుఁ జూచు
స్మేరముఖారవిందమునఁ జేర్చుకొనుంబులకాంకితాంగియై 152

చ॥ విరహజవేదనాభరము వెమ్మఁగ డెందముమీఁదఁ గన్ను నీ
రురవుగనుండె ముద్దియ మహోగ్రమనోభవవహ్ని నంగముల్
దరికొని కాల్పనందు సకలంబును నార్పఁగ లావు లేమి జీ
వ రమణుఁడర్థి నుండెడు నివాసము చేకొని యార్చుకైవడిన్ 153

వ॥ మఱియును 154

శా॥ వాడెన్ మోము రసాలబాలలతికావాసంతికల్ సూడఁగా
నోడెన్ గన్నులు వెచ్చగాఁడొడఁగె నిట్టూర్పుల్ తనూవల్లికన్
గూడెం దాపము వీడుకోలు వడసెం గోష్ఠీవిహారంబు నూ
టాడెం దాలిమి మేను డస్సెఁ గడు నయ్యంభోజపత్రాక్షికిన్

వ॥ అట్లుండ నెట్టకేలకు దినంబు గడచి రాత్రి కొంత సనుటయు. 156

ఉ॥ చుక్కలు రాణివాసములు చుట్టలు గల్వకొలంకు లెల్లఁ బే
రెక్కినజోదుపూవిలుతుఁ డిష్టుఁడు వెన్నెలపుల్గు లాశ్రితుల్
జక్కవదోయి తామరలు శత్రులుగా విహరించు రాజు మి
న్నెక్కె మనోజతాపభరమెక్కె వియోగులకెల్ల నత్తఱిన్. 157

సీ॥ అంజనగిరి తన యద్రిఁ బోలుడు నీల
కంఠుండు తోరణకట్టఁబనుప
ననిమిషనది వెల్లి యని యగస్త్యాదులు
బయల నెచ్చటనైనఁ బారి గ్రుంక
వనజజగుహులు వాహనములు దడబడ్డ
నలిగి వాదడచి సత్వముల కెరుగ

విచికిల ప్రసవంబు వెదకెడు తేఁటి త
మాలపు విరియందమ సలుచుండఁ

గీ॥ బ్రీతి బిసనాళములఁగొని పీల్చఁగలిగి
తగిన దోయిళ్లలో నుంచి త్రావఁజాలి
ముట్టికుండలు నిండంగ ముంచఁగలిగి
నిఖిలదిక్కులఁ బండువెన్నెలలు వెలిఁగె 158

వ॥ అట్టి యెడ మూర్ఛితయైన లాటరాజపుత్రిని సేదఁదీర్చి నా చేయు వివిధోపచారంబుల మదనానలంబగ్గలించితి. 159

క॥ సుందరికిద్ద కుచాంతర
చందన మొప్పారెఁదాపసంతాపితమై
కందర్పవహ్ని నెరిసిన
డెందంబున నీరుకైవడికిఁబట్టగుచున్. 160

వ॥ అప్పుడేను దల్లడిల్లుచు నొక్క చెంగలువ [1]దండపయికెత్తి 161

సీ॥ పద్మాస్య యనియెడి పగ మాని చంద్ర యు
త్పలనేత్ర యని కృపపట్టికొలిపి
కచభారమున నీలకంఠాభ యని చూడ
కంగజ! రతిబోటి యని యెఱింగి
రామాభిధాన యీ కోమలి యనక పి
కాధిప !కలకంఠియగుట సూచి
చంపకనాసయన్ చలము మాని యళీంద్ర
కల్హారనిభగంధి గాఁగఁ దెలిసి

గీ॥ రమణ వెన్నెల చిచ్చు వేడిమికిఁ బాపి
ప్రసవసాయకముల పాలుపడఁగనీక
వాకు విసములు సల్లక వాడి ఝుంకృ
తుల నదల్పక దయఁగావఁ దలఁపుఁడయ్య. 162

1.తో గలుగానెత్తి – లి



వ॥ అని యిట్లు మొఱయిడుచున్న నన్నుం గనుంగొని మొగంబున దైన్యగర్భహాసంబు దెచ్చుకొని యా రాచూలి యిట్లనియె. 163

చ॥ సరసిజనేత్ర యేటి కిటు చందురుగిందురుఁ గాము గీము నా
తురపడి వేఁడె దింతటనె దోషమనస్కులె వారు చాల నీ
పరిభవ మొప్ప నీ యలరుఁబాన్పున వెన్నెల యింతఁ దెచ్చెనే
దరికొనఁ జేయుమంతఁబరితాపము గీపముఁజక్కనయ్యెడున్

వ॥ అనుచుండ నవ్వనంబు మదనస్థలంబు గావున నా లతాగృహంబులో [1]నున్న యావాసహర్మ్యంబునకుం గొంపోవం దలంచి యా బుద్ధిమతి కిట్లంటి. 165

చ॥ అలరులసెజ్జ యింతయును నంగజు దిద్దిన యంపప్రోవు కో
మలదళ [2]పుష్పవల్లికల మందమరుజ్జనకంబు లీ లతా
నిలయము [3]కానితావునను నిల్తురె యిచ్చట డాగఁబోయి యుం
దలవరియింటఁ డాగి రను తద్వచనంబది నిక్కువంబుగన్ 166

వ॥ అని [4]నివాసంబునకుందోడ్కొని యరిగితి నా త్రియామము సహస్రయామమయై కడచె నిది యజ్జోటి విధం బిటమీఁద నీవ యెఱుంగుదని పలికినం గళావతికి మఱియును బసదనం బొసంగి వీడుకొలిపి చారాయణుం జూచుచు నరపాలుండు.

మ॥ కలయో నిక్కమొ మున్నెఱుంగఁదుదినిక్కంబైన నే యింతి యో
తెలియంజాల సమస్తకార్యగతులుం దెల్లంబులై చేకుఱెన్
గులశీలాదులఁదుల్య యిట్టి సతి నాకుం జేర్చె దైవంబు నా
లలనాసమ్మతిఁ బెండ్లియాడ నవలీలంగల్గు టే భంగియో 168

1.అనిన నవ్వనంబట్టిద గావున నా స్థలంబు వాని నివాసహర్మ్యంబునకుం గొనిపోవందలంచి యా సుందరి కిట్లంటి –ము, 2.వీజనంబు –ము, 3.కాముతావకట–ము,4. నివాసహర్మ్యంబునకు– ము

వ॥ అని పలుకుచుండ భాగురాయణుండొక్క చతురోపాయంబు గఱపిపుచ్చ నొక్కనాఁటి రేపు కళావతి రత్నసుందరిం గొలువం జని మేఖలాద్వితీయయై యున్న యద్దేవితో నిట్లనియె. 169

క॥ మన రాజు విదూషకుఁగొని
మనమేఖల మోసపుచ్చె మనమిపుడును బా
పనిమాఱుసేఁత యిది యొక
పనియే వెల్వెట్ట వలదె పార్థివతిలకున్ 170

వ॥ అనుటయు నద్దేవి సంతసిలుచు నట్టైన మెచ్చుగలదది యేమి యుపాయంబు సెప్పు మనినం గళావతి యిట్లనియె. 171

సీ॥ మనరాజు భోగైకమగ్నుండు గావున
నేమి చెప్పిననమ్ము నెఱుఁగలేఁడు
చంద్రవర్మునికొక్క చక్కనిపుత్రి మృ
గాంక వర్ముని చెలియలు శుభాంగి
కల దా కుమారిక కరము వట్టినవాఁడు
సార్వభౌమత్వవిస్తారమహిమ
[1]మొందుట తొల్లి సిద్ధోపదేశంబని
మున్న యార్యులచేత విన్నదాన
గీ॥ నొరుఁడు సార్వభౌముండన నొప్పుచుండ
నీవు హీనుఁడవై యున్కి కేను సాల
దాని నీవ పెండిలి గమ్ము ధరణినాథ
సార్వభౌమత్వమది నీక జరుగవలయు 172

వ॥ అట్లైన నేను సార్వభౌమునగ్రమహిషి యన నఖిలనరేంద్ర వల్లభాభిమాన్యనై యుండుదుఁగులపాలికలకు నే యుపాయంబునంగాని నాధునభ్యుదయంబు గోరుటుచితంబుగాన

1.మందుట...సిద్ధోవ/ యతి? -ము., మందుట... సిద్ధాదేశ-ము



నస్మదీయ మానమధురంబును బరిణయవిసరం బగు కామభోగంబువలని ప్రియం బెట్టిది యట్లుండుఁగాక యా రాచకన్నియ మా పినతల్లి కూఁతురగుటను నిది నా కావించు పరిణయంబగుటను మానసంబున నీసు పుట్ట దివ్విధంబు చేయుటయు నా యభిమతంబులు సకలంబులుం జేయుట యిక్కార్యంబంగీకరింపకునికియ నాచనువు లెల్ల నంగీకరింపకునికి యని నరనాథునకుం జెప్పిపుచ్చి యొడంబడఁజేయునది యట మీఁద మృగాంకవర్మ యజాతశ్మశ్రుదయుం డగుట నతని కేను వనితాశృంగారంబులలవరించి తదీయానుజ యని ప్రోయించెద నిక్కపువివాహంబునక వోలె వివాహద్రవ్యంబులు సమస్తంబు సమకట్టుద మివ్విధంబున మాయలువన్ని యవ్వేడుకకాని మోసపుచ్చి చారాయణునకుం దల యెత్తరాకుండఁజేసి మేఖల భంగంబునీఁ గికొందమిది రాజును భేదింపలేఁడు నమ్మొదుఁ జూడుమనిన దేవి యది యట్టిద యని ముదితచిత్తయై కళావతింగౌఁగలించికొని. 173

గీ॥ పసదనంబిచ్చి బోటి యీ పని యభేద్య
ముగ రచింపఁగ నెవ్వరిఁ బుత్త మనిన
సుగుణనిలయ కళావతి తగినవారిఁ
బనుపవలెఁ గాన మేఖలఁబనుపుమనిన 174

వ॥ దేవి యొక్కయించుక విచారించి యిట్లనియె. 175

క॥ మేఖల యిక్కార్యంబున
రేఖపడం బలుకుపనికి నేరదు చెలియా!
నాఖేదము చారాయణ
శాఖామృగమదము నీవ చని పుచ్చఁదగున్ 176

వ॥ నాకు నీ పని సేయుమని కరంబులువట్టిన నది రాజునకు ముందు సెప్పిన వారి కథ యయ్యెనని నగుచు నట్ల చేయుదునని కదలి నృపతి సన్నిధికిఁ జని వినుతిపూర్వకంబుగాఁ బొడసూపిన గారవించి సమీపంబున నుంచికొని 177

క॥ భూవలయాధీశ్వరుఁడు క
ళావతి సంతోషజాత సలలితవచన
శ్రీవదనము చందముఁ గని
భావించుచు సఖుని కనియెఁ బ్రహ్లాదమునన్. 178

వ॥ కళావతి యపూర్వసంతోషవతియై యున్నయది యీ సంతసంబు మనకుందేఁబోలు వినవలతు ననిన నది యిట్లనియె. 179

క॥ సంతసములు కల్యాణపు
సంతసముల మిగులఁ గలవె జనులకనిన భూ
కాంతుని పెండ్లికి ముసలికి
సంతసములు కొఱఁతయే విచారింపంగన్ 180

వ॥ అను పలుకులు విని సందియంబుతో నించుకలరుచు మహీపాలుండు దాని కిట్లనియె. 181

చ॥ మొగిళులలోని యేకతము ముచ్చిలి పుచ్చుకొనంగఁజాలు దఁ
స్తగిరికిఁ దామ్రపర్ణికిని సంగమమైన ఘటింపనేర్తు నిన్
మిగిలినయట్టి బుద్ధిమతి మేదిని నెందును గాన నేమి క్రొ
త్త గలుగఁ జూచి పెండిలి ముదంబని యాడితి బోటి చెప్పుమా
182

వ॥ అనినంగళావతి భాగురాయణోపదేశంబునఁ దాను దేవిం బ్రబోధించిన ప్రకారంబు రాజును జారాయణుండు ననురాగించుచుండఁ బెద్దయు వగచుచుండ సర్వంబును సవిస్తరంబుగా వినిపించి యా పని ఘటింపంబూని తాన వచ్చుట



యెఱింగించినఁ బరమానందంబున ధరణీశ్వరుండక్కాంతకు నత్యాదరంబునంగట్టనిచ్చి దేవితోడ నీకుంజూడఁ బోలునట్లాడు మిటమీఁది కర్తవ్యంబును నీకు నెట్ల బుద్ధి యట్ల వర్తింపుమని వీడుకొల్పి భాగురాయణుబుద్ధివిశేషంబుఁ గొండొకవడిఁ గొనియాడి చారాయణుతోడ. 183

గీ॥ దేవి యిభ్భంగి దా మోసపోవునొక్కొ
[1]కార్యమిది యట్ల మీఁద విఘ్నంబు లేక
జరుగునొక్కొ లాటనృపకన్యచరిత మిచట
నొండునెవ్వరు వింట లేకుండునొక్కొ 184

వ॥ అనుచుండఁ జారాయణుండు దేవి నన్ను బేలువెట్టుదు నను తలంపున నెద్దియు నెఱుంగదటుసూడు మిది యవశ్యంబు సిద్ధించునని యూరడించె నటఁగళావతి వికసితాననయగుచు దేవికి మొక్కి 185

క॥ వనజానన! యొడఁబఱచితి
మనుజేంద్రుని నతని సఖుని మాయాజాలం
బునఁ గట్టితి మీఁదటి పని
యొనరింపు రహస్యభేద మొలయకయుండన్. 186

వ॥ అనుటయు సంతసిల్లి దానికి నభినవభూషణాంబరంబు లొసంగిన నది సని యవ్విధంబంతయు భాగురాయణునకు వినిపించి ప్రసాదంబువడసి మృగాంకావళికెఱింగించి మహానందంబునందేలు నా రాజనందనచేత మెచ్చుగొనియె నిట దేవి యప్పుడ ముహూర్తకుల రావించి వారిచేత నద్దినంబునఁ బూర్వాహ్ణంబున నతివిశిష్టంబగు లగ్నంబు గలుగుట విని యప్రౌఢ వివాహంబని క్రమ్మఱఁ గళావతిచేత రాజుకుఁ జెప్పిపుచ్చి

1. కార్యమిదియును నడుమ విఘ్నంబు లేక– ము

తదనుమతోత్తరంబునముదంబంది పురంబును, నగరును నలంకరింపవలయుపనికిఁ దత్తదుచితకర్మకారులఁబనిచి మృగాంక వర్మకుంగాంతాశృంగార మలవడఁజేయుమని కళావతి నతిప్రయత్నంబున నియోగించి, రాజుంగై సేయ నభినవ ప్రసాధన రచనానిపుణులగు చతురులకానతిచ్చిన నాప్రొద్ద సర్వంబు ననుష్ఠితంబైన లగ్నంబాసన్నంబగుటయు. 187

సీ॥ సల్లలితాశ్వత్థ పల్లవమిశ్రిత
చారుపల్లవరత్నతోరణంబు
నసదృశకుంకుమరసలిప్తతలపరి
వసిత ముక్తారంగవల్లికంబు
ఫలపుష్పశుక్తిజప్రాలంబ[1] మాలికా
ధార విచిత్ర వితానకంబు
రమణీయమంగళద్రవ్యకాంచనపాత్రి
కా కరపుణ్యాంగనాకరంబు
గీ॥ విశద[2]వేదఘోషణపూర్ణవిప్రగణము
దీప్త మణికాంతి కల్పిత దీపచయము
నగుచుఁ బరిణయమండపమ మరియుండ
రాజ్ఞి పనుపున రాజును రాజసుతయు 188

ఉ॥ చూడ్కులు చూపఅన్ మొఱఁగి చొచ్చి కృతార్థత చెందుచుండగా
వేడ్కలు నిక్క నూరటలు వేగము నుల్లము సందియంబులన్
వీడ్కొలుపం బ్రమోదరసనీరధి దా నిరుమేనులైన య
మ్మాడ్కి వహించి చేసిరి సమంత్రకకృత్యములంగ్రమంబునన్ 189

వ॥అనంతరంబ వేదికాతలంబునకు వచ్చి హోమంబొనరించుచుండ దేవియు నాప్తపరిచారికలును హాసోద్యోగులగు సమయంబున

1.మాలికోధార – ము, 2. వేదఘోషా – ము



భాగురాయణుండు నను దెంచి రత్నసుందరి సేయించు నుపచారంబులంగైకొని యుచిత ప్రకారంబుననాసీనుండై యాయమ నుద్దేశించి యిట్లనియె. 190

గీ॥ చంద్రవర్మమహారాజు సతి సుధామ
దేవి నీ పేర లేఖఁ బుత్తెంచె ననుచు
నగరిమొగసాల నౌకరుఁడున్నాఁడు వానిఁ
బిలిచి తేరంగ నిప్పుడ వలయుఁ బనుప 191

వ॥ అనుటయు దేవిచేత ననుజ్ఞాతయై యొక్క సతి చని తోడ్తేర వచ్చిన వాఁడును దండప్రణామంబాచరించి హరిద్రాభద్రంబైన తన చేతి లేఖయిచ్చినంజదివించె నది యెట్లనిన. 192

సీ॥ స్వస్తి సమస్తప్రశస్తిసమేత సు
ధామ మహాదేవి తన తనయకు
స్వస్తి సమస్తప్రశస్తిసమేతయై
పరగిన రత్నసుందరికిఁబ్రీతిఁ
జెప్పు నీ కిపుడొక చిట్టి తమ్ముఁడు గల్గె
మున్ను నీ పురమున నున్న యామృ
గాంకవర్మఁడు చెలియలు గాని నీకుఁ ద
మ్ముఁడు గాఁడు మగపేరు మ్రోయఁ జేసి
గీ॥ పెనిచితిమి మేము సుతుఁడు లేకునికిఁ దొల్లి
నిప్పు డక్కన్యఁ దగు పతి కిమ్ము నీవ
దానిఁ బొందిన భూపతి ధరణిసార్వ
భౌముఁడగు నిది మునివరభాషితంబు 193

వ॥ అను లేఖ యాకర్ణించి 194

క॥ ఊచ్చవడి వెల్లవాఱుచు
ముచ్చ ముడిఁగి మూర్ఛ తన్ను ముంచికొనంగా
వచ్చిన ధైర్యం బూఁతఁగ
నచ్చేడియ నిల్చునప్పు డద్భుత మయ్యెన్ 195

వ॥ అట్లుండి తనలోన 196

క॥ ఇది యేమి చేసికొంటిని
మదిమదినుండి జనులు దన్ను మతి లేదని న
వ్వెదరు సవతిరాకకునై
మది నోర్చినఁ దలమె వారి మాటల కోర్వన్ 197

వ॥ అని యిట్లు పశ్చాత్తాపపీడితయై యిది విధికృతం బింక దీనికి ధైర్యంబందనీ కేలని మెచ్చునకు ధైర్యంబుఁ దెచ్చుకొని ధీరయగుట నవికారయై యుండె. 198

గీ॥ కార్యమూలమెఱుంగక కడఁగి యొరుల
కఱపు మదినమ్మి తమకు నయ్యేలుక లేక
యొరులఁబఱచెద మని పోయి యొరులచేతఁ
దారువడుదురు రత్నసుందరి విధమున 199

వ॥ భాగురాయణుండు తనయుపాయంబు సఫలంబగుటయుఁ బ్రియంబంది. 200

క॥ పరముఖమునఁ దన పొందుగ
విరచించుచు మంతనంబు వెలిపుచ్చక నే
ర్పరి యైన భాగురాయణు
కరణి ననుష్ఠింపవలయుఁ గార్యములెల్లన్. 201

వ॥ మృగాంకావళి కేయూరబాహుతోడ ననంతరంబ 202

సీ॥ కర్పూరకస్తూరికాపరిమళకరం
డములట్టి హర్మ్యరత్నములయందుఁ
గోకిలకీరాదికోలాహలంబున
విలసిల్లు నుద్యానతలములందుఁ
మత్తకేకులకెల్ల నృత్తరంగములైన
రమణీయకేళిశైలములయందుఁ



బరివృతకదళికాప్రాప్తలతాశ్రేణి
నమరు దీర్ఘికల తీరములయందు
గీ॥ నాఁడు నాఁటికి వేడ్కలు నాఁటుకొనఁగ
సారెసారెకు నింపు లింపారుచుండ
నంతకంతకు నాదట లగ్గలింప
నంగజక్రీడఁ దేలుచు నభిమతముగ 203

వ॥ ఇట్లు లబ్ధమనోరథుండై కేయూరబాహుమహీపాలుండు 204

సీ॥ తేజంబుగలఁడు సాధించు శత్రులనాజ్ఞ
వెండి నిందకుఁ జాలవెఱచుఁ గాని
యరి నొవ్వఁగొనఁడు తప్పరయు ధర్మరతుండు
భృత్యులఁజెఱుపఁడు సత్యవాది
కలక యుబ్బుట భీతి కలుషమే మఱుట మొ
క్కలము వేగుపాటు చలము లేదు
కామినీలోలుండు గాఁడు సేవకుచేత
మఱవఁడిచ్చిన యీగి మరలఁగొనఁడు
గీ॥ క్రౌర్యలోభజాడ్యకపట వ్యసనముల
పొంతఁబోవఁడాయమును వ్యయంబు
నెఱుఁగు నాఁడునాఁటి కింద్రియవశ్యుండు
గాక సుజనవినుతికలితుఁడయ్యె 205

వ॥[1] మఱియును 206

సీ॥ తన యేలుభూమి యంతయుఁ దన నగరి లో
పల వోలె నెంతయుఁ దెలివిపడఁగ
నిచ్చట మరుదేశ మిచట జాంగలరాష్ట్ర
మిచ్చట సమతల మిచటసార

1.ఈ వచనం ' ము' లో లేదు,

మిచట సారము కొండ లిచటేరు నిచటఁ బే
　　రడవి యిచ్చటఁ గలదని యెఱింగి
యీ కాలమున కగు నిచట దుర్గంబని
　　తెలిసి దుర్గంబులు బలుపుచేసి
గీ॥ బలసియున్న సమీపభూపతులలోన
బలుని నబలుని మిత్రశత్రులను నరసి
చతురుపాయంబులను వారిఁ జక్కఁజేసి
పుడమి పాలించి యెల్లెడఁ బొగడనెగడె. 207

క॥ స్వామియు మంత్రియు దుర్గ
స్తోమము రాష్ట్రంబు ధనము సుహృదులు బలముం
గా మహి సప్తాంగము లని
[1]తా మదిలో నెఱిఁగి వీనిఁ దగ రక్షించెన్ 208

సీ॥ స్త్రీలోలవృత్తిమై సింహబలుండును
　　జూదంబుచే ధర్మసుతుఁడు నలుఁడు
నధికపానాసక్తి యాదవులును వేఁట
　　తగులునఁ బాండుండు దశరథుండుఁ
బలుకుప్రల్లదమునఁ బౌరవులును బరు
　　సనిదండమున జరాసంధనృపుఁడు
నప్రయోజననిఖిలార్థపరిత్యాగ
　　మున నా హరిశ్చంద్రమనుజపతియు
గీ॥ నాపదలఁ దొల్లిఁ బొంది రట్లగుటఁ జేసి
వ్యసనసప్తక మది యొప్పదని యెఱింగి
వాని వర్జించి ధరయెల్ల ప్రాలి యేలి
సార్వభౌమత్వమొందె నజ్జనవిభుండు 209

1. నేమఱక యొనర్పవలయు నిందుల రక్షన్ – ముద్రితప్రతుల్లోని ఈ పాఠాంతరం ఎక్కడిది?



గీ॥ బుద్ధి శస్త్రంబు, సప్తాంగములును మేను,
గార్యయత్నరహస్యరక్షణము జోఁడు,
చతురచరుల దృష్టులు, దూతజనము ముఖము,
ధర్మవర్తన ప్రాణ మద్ధరణిపతికి 210

వ॥ తద్రాజ్యంబున 211

ఉ॥ వృత్తుల కల్మషం బొదలి విప్రులు పెద్దయు ధన్యులైరి య
త్యుత్తమధర్మకార్యముల నొంది వసుంధర భూరిధాన్య సం
పత్తి వహించె నర్థువు లపారతఁ బొందె జనంబు గేహముల్
దత్తదభీష్ట వస్తువులఁ దామరతంపరలయ్యె నయ్యెడన్. 212

**ఆశ్వాసాంత పద్యములు**

శా॥ క్షాంతిదయాప్రియాభరణ కౌశికగోత్ర గృహప్రదీప ది
గ్దంతి మదాంబుసేచన విధానవివర్ధిత కీర్తివల్లికా
క్రాంతసమస్తలోక యవిఖండితసంతతదానవర్ష వి
శ్రాంత మనోహరార్థిజనచాతక భూతలపారిజాతకా ! 213

క॥ అభినవభానుతనూభవ
విభవపురందర లసద్వివేకబహుళ సౌ
రభసంవాసితమానస
సుభగా జనమదన నిఖిలశుభగణసదనా! 214

మాలిని॥ గణకశిఖరరత్నా! కావ్యవిద్యా ప్రయత్నా!
ప్రణుతజనశరణ్యా! ప్రాజ్యలోకాగ్రగణ్యా!
ఫణిశయదృఢభక్తా !బంధువర్గానుసక్తా!
గుణిజనకృతసఖ్యా! గుండనామాత్యముఖ్యా! 215

ఇది సకలసుజనవిధేయ మంచననామధేయ ప్రణీతంబైన కేయూరబాహుచరిత్రంబునందు సర్వంబును జతుర్థాశ్వాసము.
సంపూర్ణము.

| | |
|---|---|
| అంగనాకుచ | 17 |
| అంజనగిరి | 128 |
| అంత | 61 |
| అంత | 104 |
| అంతటిలోన | 35 |
| అంతనిట | 117 |
| అంతనొక | 80 |
| అందరిలోన | 8 |
| అందు | 10 |
| అందుండి | 57 |
| అంబుధి | 55 |
| అక్కథ | 22 |
| అక్కథ | 25 |
| అక్కథ | 28 |
| అక్కథ | 36 |
| అక్కథ | 38 |
| అక్కథ | 40 |
| అక్కథ | 59 |
| అక్కథ | 87 |
| అక్కన్నియ | 19 |
| అక్కాలంబున | 47 |
| అక్షరజ్ఞుడు | 90 |
| అగుఁగాక | 52 |
| అచట రెట్ట | 53 |
| అచ్చటనుండి | 98 |
| అటమీఁద | 27 |
| అట్టియెడ | 129 |
| అట్లగుట | 57 |
| అట్లగుట | 42 |
| అట్లగుట | 69 |
| అట్లగుట | 71 |
| అట్లగుట | 62 |
| అట్లగుట | 84 |
| అట్లగుట | 62 |
| అట్లయా | 41 |
| అట్లయ్యరణ్య | 47 |
| అట్లుంగాక | 97 |
| అట్లుంగాక | 70 |
| అట్లుండ | 128 |
| అట్లుండి | 44 |
| అట్లుండి | 136 |
| అట్లుగాక | 81 |
| అట్లు చూచు | 101 |
| అట్లు చూచు | 93 |
| అట్లు చెల్లించు | 55 |
| అట్లు జైనుల | 39 |
| అట్లు పోయి | 71 |
| అట్లు రెండు | 112 |
| అట్లైన | 131 |
| అతండొసంగు | 93 |
| అతఁడా | 29 |
| అతఁడు | 123 |
| అతఁడు తన | 57 |
| అతఁడును | 79 |
| అతని | 24 |
| అతనికి | 29 |
| అతని రాక | 58 |
| అతిలోభ | 71 |
| అతినిష్ఠ | 78 |
| అతిశయ | 10 |
| అతులైశ్వర్య | 82 |
| అత్తఱి | 107 |
| అత్యాచారపు | 84 |
| అత్రిసమాను | 14 |
| అది ఘీంకారము | 39 |
| అది జపము | 25 |
| అది నానాటికి | 53 |
| అదియును | 63 |
| అది యెక్కడి | 113 |
| అది యెట్టి | 66 |
| అది యెట్లనిన | 125 |
| అది యెట్లనిన | 90 |
| అది యెట్లనిన | 68 |
| అది యెట్లనిన | 79 |
| అది యెట్లనిన | 115 |
| అది యెట్లనిన | 68 |
| అది యొక | 69 |
| అది సుషిర | 35 |
| అనంతరంబ | 135 |
| అనలుండు | 79 |
| అతనిని | 85 |





| | |
|---|---|
| అనవుఁడు | 65 |
| అనవుఁడు | 21 |
| అనవుఁడు | 119 |
| అనవుఁడు | 76 |
| అనవుఁడు | 62 |
| అనవుఁడు | 65 |
| అనవుఁడు | 51 |
| అనవుఁడు విని | 113 |
| అనవుఁడు బోయ | 113 |
| అని కాకుల్ | 60 |
| అని కృత | 97 |
| అని కృష్ణ | 64 |
| అని చదివితి | 127 |
| అని చారాయణ | 42 |
| అని చింతించు | 91 |
| అని చిత్తంబు | 67 |
| అని చెప్పి | 115 |
| అని తగని | 3 |
| అని తగు | 88 |
| అని తన | 70 |
| అని తన యిష్ట | 50 |
| అని తన్ను | 50 |
| అని తలంచి | 73 |
| అని తలంచు | 108 |
| అని తలఁచి | 94 |
| అని తలఁచి | 69 |
| అని తత్సన్నిధి | 80 |
| అని తలపోయు | 81 |
| అనిన | 76 |
| అనిన | 76 |
| అనిన | 51 |
| అనినన్ | 77 |
| అనినంగళావతి | 132 |
| అనినంబెన్నిధి | 114 |
| అనిన నది | 33 |
| అని నియమించి | 120 |
| అని నివాసంబు | 130 |
| అని నిశ్చయించి | 75 |
| అని నిశ్చయించి | 95 |
| అని నిశ్చయించి | 96 |
| అని పక్షి | 88 |
| అని పలికి | 84 |
| అని పలికి | 3 |
| అని పలికి | 67 |
| అని పలికి | 63 |
| అని పలికి | 53 |
| అని పలికి | 74 |
| అని పలికి | 84 |
| అని పలికి | 44 |
| అని పలికి | 78 |
| అని పలికి | 22 |
| అని పలికి | 3 |
| అని పలికి | 26 |
| అని పలికి | 114 |
| అని పలికిన | 30 |
| అనిపలుక | 22 |
| అని పలుకు | 131 |
| అని భోజ్యంబు | 83 |
| అని మకరిందిక | 40 |
| అని మకరందిక | 98 |
| అని మఱియు | 90 |
| అని మఱియు | 31 |
| అని మఱియు | 80 |
| అని మఱియు | 61 |
| అని యతఁడు | 32 |
| అని యిట్ల | 66 |
| అని యిట్లచ్చట | 108 |
| అని యిట్లు | 37 |
| అని యిట్లు | 34 |
| అని యిట్లు | 82 |
| అని యిట్లు | 130 |
| అని యిట్లు | 86 |
| అని యిట్లు | 82 |
| అని యిట్లు | 108 |
| అని యిట్లు | 137 |
| అనియెఁ | 50 |
| అనియె నట్ల | 30 |
| అనియె నట్ల | 30 |
| అని యెఱింగించె | 34 |
| అని యోజన | 56 |
| అని వానిన్ | 72 |
| అనిశము | 14 |
| అని సుకుమారి | 89 |
| అనుచు | 98 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| అనుచుండ | 130 | అనుటయు | 131 | అయ్యవసర | 107 |
| అనుచుండ | 134 | అనుటయు | 47 | అరయన్ దుష్ట | 51 |
| అనుచుండ | 96 | అనుటయు | 71 | అరసెద | 24 |
| అనుచు నందు | 111 | అనుటయు | 67 | అరిగజ | 8 |
| అనుచు ననేక | 111 | అనుటయు నంచ | 54 | అరుగఁగ | 72 |
| అను జాగారము | 94 | అను పలుకు | 23 | అరుదందన్ | 7 |
| అనుటయు | 31 | అను పలుకు | 66 | అలఁతులగు | 37 |
| అనుటయు | 31 | అను పలుకులు | 62 | అలరుల | 130 |
| అనుటయు | 29 | అను పలుకులు | 62 | అలుకయు | 41 |
| అనుటయు | 58 | అను పలుకుల | 125 | అల్పులౌన | 38 |
| అనుటయు | 112 | అను పలుకులు | 70 | అల్లన | 127 |
| అనుటయు | 116 | అను పలుకులు | 122 | అవివేకి | 98 |
| అనుటయు | 29 | అను పలుకులు | 133 | అవ్విధంబు | 42 |
| అనుటయు | 54 | అను లేఖ | 136 | అసదృశ | 125 |
| అనుటయు | 122 | అనేకనిష్క | 95 | అసదృశ | 103 |
| అనుటయు | 122 | అన్నన్న వినవె | 113 | ఆ కథ | 64 |
| అనుటయు | 121 | అన్నా యేమని | 73 | ఆ కథ | 23 |
| అనుటయు | 33 | అపగత | 87 | ఆ కొమ్మన | 8 |
| అనుటయు | 52 | అపరిమిత | 13 | ఆ చేడియ | 125 |
| అనుటయు | 76 | అప్పుడు | 85 | ఆ జన్మ | 99 |
| అనుటయు | 58 | అప్పుడు | 103 | ఆ తేనెబొట్టు | 41 |
| అనుటయు | 65 | అప్పుడు | 114 | ఆత్మగతంబున | 90 |
| అనుటయు | 67 | అప్పుడు | 89 | ఆ దుఃఖంబు | 43 |
| అనుటయు | 33 | అప్పుడు | 93 | ఆ నరపతి | 91 |
| అనుటయు | 61 | అప్పుడేను | 129 | ఆ పురంబు | 15 |
| అనుటయు | 54 | అభినవ | 139 | ఆ పురంబున | 5 |
| అనుటయు | 78 | అమరఁగ | 71 | ఆమడ | 56 |
| అనుటయు | 134 | అయ్యపత్య | 123 | ఆ మదిరాక్షి | 123 |





| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆ మృగాంక | 35 | ఇట్లు వర్తించు | 29 | ఉనికియు | 19 |
| ఆ రమణి | 115 | ఇట్లు వర్తింపు | 36 | ఉపకార | 63 |
| ఆ రమణీ | 101 | ఇట్లు వసియించి | 53 | ఉరగంబున | 85 |
| ఆ రాజు | 92 | ఇతని కడుపు | 97 | ఉరగసంఘ | 49 |
| ఆ రాజుచేయి | 59 | ఇతరపురుష | 80 | ఉరగ స్త్రీ | 13 |
| ఆ రామా | 28 | ఇతరులు | 28 | ఉరులు కుజంబు | 54 |
| ఆరోగ్య | 16 | ఇది యేమి | 136 | ఉరులును | 91 |
| ఆ లీలావతి | 17 | ఇనుమున | 77 | ఉర్వికి | 72 |
| ఆ లోన | 104 | ఇమ్ముగ | 89 | ఊరికి | 82 |
| ఆ వాలుగంటి | 24 | ఇరువుర | 84 | ఊరిప్రజ | 84 |
| ఆ విభునకు | 5 | ఇరువుర | 96 | ఎండవు | 26 |
| ఆ వ్యాఘ్రం | 37 | ఇల పురము | 78 | ఎక్కడి చెలి తన | 73 |
| ఆస పాపజాతి | 114 | ఇలపై | 67 | ఎడపకయున్న | 87 |
| ఆ సమయ | 104 | ఇల వెలనాటి | 6 | ఎడలెం | 108 |
| ఆ సమయ | 105 | ఇవ్విధంబున | 55 | ఎడ లేదు | 88 |
| ఆ సమయంబున | 103 | ఇవ్విధంబున | 57 | ఎన్నడు | 29 |
| ఆ సమయంబున | 107 | ఇష్టార్థ | 13 | ఎప్పటియట్ల | 24 |
| ఇంచుక | 106 | ఈ గుండయ | 12 | ఎలదేఁటి | 127 |
| ఇంటికి నేను | 116 | ఈ జలము | 86 | ఎలుక కపట | 120 |
| ఇక్కరండ | 120 | ఈ యర్థంబు | 118 | ఎలుక వేట | 91 |
| ఇటనట | 126 | ఈ యూథ | 70 | ఎలుగు వినంగ | 103 |
| ఇట్టి నిర్దయత్వ | 53 | ఈ యొడళుల | 96 | ఎవ్వరిదాన | 104 |
| ఇట్లతిబహు | 111 | ఈ రేయి | 105 | ఏకరస | 18 |
| ఇట్లన్నియు | 48 | ఈ తెప్ప | 101 | ఏకాధివాస | 86 |
| ఇట్లుండి | 120 | ఈ సొమ్ముల | 73 | ఏ నధిక | 118 |
| ఇట్లు కృతి | 1 | ఉండియు నురగ | 85 | ఏ నిద్ర | 30 |
| ఇట్లు దేవి | 46 | ఉండు వీధిన్ | 55 | ఏ నేమి | 96 |
| ఇట్లు లబ్ధ | 137 | ఉండె నంతకు | 99 | ఏ నౌక | 68 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏ నొక మంత్ర | 120 | కదియ | 83 | కావించి మీర | 70 |
| ఏపున మున్ను | 111 | కని కాంచన | 23 | కావున | 27 |
| ఏమియుం | 74 | కనుగొఱత | 70 | కావున | 67 |
| ఏ రసమున | 26 | కన్నుమువెట్ట | 95 | కావున | 86 |
| ఏల వెఱగంద | 21 | కమలానన | 106 | కావున | 37 |
| ఐనను | 93 | కరపాదాంబు | 124 | కావున నాకు | 3 |
| ఒంటిని | 127 | కరమిడి | 40 | కావున నిచ్చట | 61 |
| ఒండొరు | 39 | కరమూలాంబు | 103 | కావుననే | 59 |
| ఒకఁడొకఁడు | 58 | కరిముఖు | 1 | కావున మతి | 23 |
| ఒకనాడచ్చటి | 38 | కర్పూరకస్తూరి | 137 | కావున మన | 34 |
| ఒక పర్వతము | 51 | కలమెండినుమున్నకై | 78 | కావున వివేక | 89 |
| ఒక పెనుగాన | 112 | కలయంబూచి | 111 | కూరిమి లేదని | 33 |
| ఒకయెడం | 59 | కలయఁగ | 107 | కెలనికి | 120 |
| ఒక్కయెడ | 37 | కలయో నిక్కమొ | 130 | కేతనమంత్రి | 8 |
| ఒడళుల | 14 | కలితకపోల | 14 | కేయూరబాహు | 46 |
| ఒప్పమి | 97 | కలిమి | 69 | కొండంత | 74 |
| ఓ! యని | 56 | కలువని | 33 | కొండికదాన | 116 |
| ఓరీ! కోమటి | 77 | కళావతి | 132 | కొండొక సేపు | 75 |
| ఓర్వండెఱుఁగక | 88 | కవిజన | 45 | కొందఱన్ | 77 |
| కంచుకము | 92 | కాంచీపుర | 22 | కొనిపోయిన | 76 |
| కంఠమూలంబున | 57 | కానన మొక్కట | 87 | కొనిపోవ | 95 |
| కటిబద్ధాంబర | 93 | కానభయంబు | 54 | కొన్ని యాడి | 81 |
| కడు చిన్నపు | 42 | కానిమ్ము | 108 | కొమ్ముల నూది | 39 |
| కడు నధికముగా | 117 | కాయలుడి | 66 | కొలనొక్కటి | 70 |
| కడునమ్మక | 82 | కారండవ | 62 | కోఱలసంధి | 64 |
| కడు బలు | 60 | కారండవమ్ము | 61 | కోసలదేశ | 59 |
| కదలివేకొన | 60 | కార్యమూల | 137 | కౌశికగోత్ర | 8 |
| కదియంజయ్యన | 49 | కాలంజేత | 88 | క్రూరులగు | 59 |





| | | | | | |
|---|---|---|---|---|---|
| క్రూరులచే | 98 | చూడ్కులు | 134 | తన కంఠంబున | 111 |
| క్రూరోరగ | 118 | చూలులు మేన | 103 | తనకటె | 89 |
| క్షణకరుణ | 97 | చూలు వహించి | 116 | తన కడుపు | 98 |
| క్షాంతిదయా | 140 | చెప్పిన వెట్టి | 114 | తన కార్యము | 119 |
| క్షితిఁగశ్యప | 9 | చెప్పి మరియు | 21 | తన కృపా | 15 |
| క్షురికాపుర | 24 | చెఱయేబాసి | 119 | తనకొరకై | 34 |
| క్షోణీశోత్తమ | 17 | చెలితనము | 75 | తన చుట్టల | 55 |
| గణకశిఖర | 140 | చెలిమిశిలా | 50 | తనచే నసాధ్యు | 115 |
| గరుడుండవ్వల | 56 | చెలులార | 46 | తన దేహము | 74 |
| గర్వోద్ధత | 90 | చేరదగని | 51 | తన పేరి | 1 |
| గార్గ్యుఁడను | 25 | చైతన్య | 105 | తన మేనల్లుని | 21 |
| గౌళీనిర్ఝర | 20 | చొరవెడల | 49 | తన యింట | 88 |
| చంచులుదెఱచు | 113 | చోరుడొకండు | 32 | తన యిష్ట | 2 |
| చంద్రవర్మ | 136 | జగతీనాయక | 108 | తలతలుపు | 83 |
| చతురప్రజ్ఞ | 16 | జనపాల | 4 | తన యేలు | 138 |
| చనుదెంచుచు | 72 | జలజవన | 105 | తన వారెల్లరు | 85 |
| చనునెడ | 26 | జలపక్షుల్ | 61 | తను నెఱుంగ | 107 |
| చని వాని | 62 | జలరుహ | 107 | తమ దేశ | 61 |
| చలము | 7 | తగదురుల | 117 | తమలో | 54 |
| చలమున | 36 | తగవూహింప | 42 | తరుణ ప్రవాళ | 106 |
| చారాయణ | 35 | తగుకొలది | 68 | తలఁచిన | 25 |
| చారాయణుండు | 44 | తగువారి | 54 | తాడిపండు | 126 |
| చారాయణుండు | 125 | తడిసిన | 89 | తిరుగాడు | 39 |
| చారాయణుండు | 122 | తదనంతరం | 94 | తులువకు | 64 |
| చాల నభీష్ట | 119 | తదనంతరం | 102 | తేజంబు గల | 138 |
| చిరజీవనము | 62 | తదనుసంభవ | 10 | తేనియకుండ | 41 |
| చిఱుతనాట | 78 | తద్రాజ్యంబున | 140 | తొడవులకు | 124 |
| చుక్కలు రాణి | 128 | తదీయానుజ | 10 | తొఱఁగుము | 46 |

తొల్లి యుగ 47
తొల్లియు నచ్చో 111
తోకొని 60
త్వరితకృత 105
దంష్ట్రముల 65
దలముగ 15
దశరథ 15
దాక్షిణ్యగుణ 117
దానిబొక్క 120
దూరగ్రామం 83
దేవరపొందు 76
దేవా భేకకులా 49
దేవిమేఖల 112
దేవి యిబ్భంగి 133
దేవియొక్క 131
దేవీరత్నము 98
ద్రుమశాశ 65
ద్రోహిశక్తుల 46
ధనగుప్తుం 77
ధనమెల్లన్ 77
ధరణితలేశ్వర 102
ధరణిపతి 41
ధర దుష్ట 89
ధాత్రీశలాట 123
ధీరుండా 5
నందనుఁడు 2
నందినీనామ 93
నడిపి 18
నడుమనల 96
నన్నుదోలు 121
నమలంగా 65
నమ్మఁదగదు 74
నమ్మకపోరాద 117
నమ్మికలు 114
నయనాద్యవ 124
నయవంతులు 27
నరములొక్క 69
నర్మదతట 36
నలువున 12
నవకోటి 6
నవముక్తా 13
నా కుదయించు 80
నాకు నీ పని 133
నా చెప్పినట్లు 119
నానాదేశ 18
నావుఁడు 65
నిగుడుచు 103
నిజపుత్రు 94
నిడుపులు 17
నిను గడచిన 56
నిరంతర 2
నీ కుపకారము 118
నీకొక 30
నీ కొడు కూర 83
నీడద్వార 87
నీ పెరిమలు 86
నీ యంగన 81
నీ వుపకారం 59
నీ వెవ్వరు 66
నూతనదర్ప 10
నెల పది 63
నేటికిని 68
నేరుపుమై 47
నైజగుణం 36
నొవ్వియలంప 64
పగలెల్లన్ 83
పగవాఁడనైన 115
పనిచిన 22
పనిచిన 116
పద్మాస్య 129
పయనమౌ 95
పరముఖము 137
పరిణయ 44
పరిపూర్ణోదక 48
పల్లెరంబు 23
పసదనం 131
పసిమి యెచ్చట 48
పాడున్ వీనుల 29
పావనుఁడు 97
పిడిచిన 26
పుచ్ఛంబు 63
పుట్టెంగుండన 10
పుణ్యంపు ముడి 9
పుణ్యనదీ 11



పుత్రస్నేహము 82
పురహర్మ్య 13
పురుషార్థ 20
పుష్పకనివహ 4
పూచిన 47
పూనుఁగాఁడి 114
పూర్ణలలాట 102
పెండ్లికిని 43
పెక్కునీళుల 69
పెక్కులు బుద్ధులు 53
పెట్టి దానికి 118
పెనుపఁగ 79
పొడమదు 82
పొరుగింట 30
పొలిసిరి 74
పొసఁగ 21
పోరదొడఁగి 36
పోరెదుసరట 40
పోరొప్ప 38
ప్రకట శ్రీ 113
ప్రకటిత 102
ప్రాగ్దిక్పశ్చిమ 5
ప్రాయమున 79
ప్రాలెదు 22
ప్రాలొక్కట 23
ప్రియబంధు 48
ప్రియభాషు 116
బలవంతు 93
బలవంతు 105
బలవద్ఘైన్యము 33
బలహీను 47
బలియుండగు 67
బలుపున 86
బహువిధంబుల 117
బాలరసాల 3
బుద్ధిమాలిన 90
బుద్ధిశస్త్రంబు 140
బోటిపోయిన 43
బ్రాహ్మణుఁడు 84
భయదాకార 38
భయభక్తి 85
భాగురాయణ 100
భాగురాయణ 137
భారతిదాది 10
భూరమణుఁడు 43
భూవర 122
భూవలయా 133
మండూక 49
మందరపురి 90
మకరందిక 35
మచ్చికరెట్టి 88
మచ్చెక్కింపు 31
మదువెల్లన్ 71
మతిధృతి 58
మతిమంతు 58
మతిమంతులు 112
మతి గలిగి 23
మతియ 26
మతియుతుఁడు 21
మతి లేని 25
మన కీ పాటులు 54
మన రాజు 131
మన రాజు 131
మర్మస్పర్శన 112
మఱియును 109
మఱియును 4
మఱియును 138
మఱియును 102
మఱియును 128
మాణిక్యసేన 38
మా పెద్ద 49
మా వాక్యంబులు 84
మిగిలిన 13
మిడుగుఱు 87
మిన్నక 31
మిన్నెల్ల 87
మీ కొఱఁగాములు 63
మీ యాడెదు 122
ముంగిళ్ల 60
ముందఱి 37
ముదిసినారము 37
మృగాంకావళి 137
మృదువేడి 109
మెలపున 106

మెలపుమై 101
మేఖల 132
మొగమోట 35
మొగమోడ 115
మొగిళుల 133
యక్షపురంబున 115
రత్నసుందరి 104
రమణీయమైన 6
రాజకళా 17
రాజ్ఞి దాది 35
రెండుతెఱంగు 42
రెండోడ 76
రోహణపర్వత 10
ఱిచ్చవడి 135
లలనారోహణ 15
లలితవివేక 43
లాఁగలు పెక్కులు 121
లాటరాజనందన 126
లాలనము 75
లీలానిర్జిత 64
లెక్కింప 104
లోభంబున 78
వచ్చి తదీయ 80
వచ్చి మృద్బద్ధ 121
వచ్చి యాలి 79
వచ్చుచు 73
వడకుమేని 41
వడకెడు 87
వడుఁగు పెండిలి 11
వనజానన 134
వననిధి 2
వననిధి 55
వననివహ 109
వనవిహారం 112
వనితారత్నము 124
వరమడుగు 25
వర్జితలోభు 99
వర్ధమాను 73
వర్ధమానుని 75
వలరాజువిజయ 110
వల దీ రేయిన్ 52
వలువదు 70
వాఁడును 34
వాఁడుపట్టిన 118
వాఁడు ప్రోడ 32
వాచకత్వము 12
వాటమగు 27
వాడెన్ మోము 128
వాని పిలుపు 32
వానికి ముందఱ 33
వారల పలుకులు 95
వాలుగన్నులు 124
వింటే మృగమా 67
విజయపుర 68
విదిశాపుర 28
వినయవివేక 44
విని చతురిక 32
వినుకలి 101
వినుమెవ్వాఁడే 119
విపినాంతర్ 66
విపులుండగ్రజు 94
వియ్యమంద 121
విరహజ 128
వివేకియైన 92
విహితస్థాన 5
వీరికి చెప్పక 62
వీరు మనకు 62
వృత్తు లకల్మషం 139
వృద్ధునకు 81
వేగుటయు 58
వ్యవసాయము 71
వ్రతులు మాలోన 63
వ్రత్తమొకని 96
శరధిసమ 20
శైలవ్రాతము 11
శ్రవణానందన 1
శ్రీరమణ 21
శ్రీరమణీ 40
శ్రీవనితా 100
శ్రీ వసియించు 1
శ్వేతుండను 50
సంతసములు 133
సచివభూషణ 19
సబము నెంగిళ్లు 52



సరసరతి 109
సరససుకవి 99
సరసిజ 15
సరసిజనేత్ర 130
సరసీజల 39
సల్లలితాశ్వత్థ 135
సీనపుదీవి 72
సుందరికిడ్డ 129
సుమనోదామము 92
సుశ్రేయః 45
సెట్టికి చెప్ప 75
సెలకట్టె 7
సొమ్మఖిలంబు 73
సొమ్ములయెడ 74
సొమ్ములలో 2
స్త్రీలోలవృత్తి 139
స్థాయిరసము 3
స్వస్తి సమస్త 136
స్వామియు 138
హనుమంతు 50
హారము వెట్టు 128
హృదయము 14

ANDHRA VIJGNANA SAMITHI – VIZIANAGARAM

ఆంధ్ర విజ్ఞాన సమితి – విజయనగరము

| | |
|---|---|
| అధ్యక్షులు, కోశాధిపతులు : [illegible]<br>ఉపాధ్యక్షులు : [illegible]<br>కార్యదర్శి : [illegible]<br>కృత్యసమాలోచన సమితి : [illegible] | నెం.______ ౬-౯-1940.<br><br>[illegible] |

P.T.O

ANDHRA VIJGNANA SAMITHI – VIZIANAGARAM

ఆంధ్ర విజ్ఞాన సమితి – విజయనగరము

| | |
|---|---|
| అధ్యక్షులు, కోశాధిపతులు : [illegible]<br>ఉపాధ్యక్షులు : [illegible]<br>కార్యదర్శి : [illegible]<br>కృత్యసమాలోచన సమితి : [illegible] | నెం.______ ______194 .<br><br>[illegible] |

P.T.O

[illegible handwritten letter]

స. శా.

[illegible]

[illegible]

VYAKARANA VIDYAPRAVEENA
VIDWAN - RASTRABHASHAVISARADA
CHILUKURI PAPAYYA SASTRY.
వ్యాకరణ విద్యాప్రవీణ
విద్వాన్-రాష్ట్రభాషావిశారద
చిలుకూరి పాపయ్యశాస్త్రి.

TELUGU ACADEMY
COCANADA.
ఆంధ్రసాహిత్యపరిషత్తు
కాకినాడ.

Dated, 29-5-1944.

బ్రహ్మశ్రీ వేలూరి ప్రభాకరశాస్త్రిగారికి

చిలుకూరి పాపయ్యశాస్త్రి నమస్కారములు.

[illegible]

ఇట్లు
చిలుకూరి పాపయ్యశాస్త్రి.